హైదరాబాద్
ఆదివారం
25-2-2018
సంపుటి: 2, సంచిక: 87
పేజీలు: 12+16, వెల: రూ.6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో..
అరుణోదయం
స్పోర్ట్స్‌లో..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

వాళ్లవల్లే పీఎన్‌బీ కుంభకోణం

- నియంత్రణ సంస్థలు, ఆడిటర్లపై జైట్లీ విసుర్లు
- కొన్నివ్యాపార వర్గాల్లో కొరవడిన నీతినియమాలు
- ఏళ్ల తరబడి మోసం నిరాఘాటంగా కొనసాగింది
- పర్యవేక్షణ సంస్థలు ఉదాసీనంగా పనిచేశాయి
- ఇది తీవ్ర ఆందోళనకర అంశం: అరుణ్ జైట్లీ

7 లో..



పాలమూరులో.. కరువుకు గుడ్‌బై

శాశ్వతంగా నిర్మూలిస్తాం

- కృష్ణా నికర జలాలన్నీ జిల్లాకే..
- పనిచేసే టీఆర్ఎస్ కావాలా.. కుర్చీల కోసం కొట్లాడే కాంగ్రెస్సా?
- కాంగ్రెస్ పార్టీది అధికార దాహం
- జిల్లాలో 20 లక్షల ఎకరాలకు నీరు
- ఖమ్మం, నల్గొండ జిల్లాల పొలాలకు గోదావరి నీళ్లు
- నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్

వనపర్తి, ఫిబ్రవరి 24(మనం ప్రతినిధి):

ప్రజల కోసం, ప్రజా సంక్షేమంకోసం రేయింబవళ్లు శ్రమించే టీఆర్ఎస్ కావాలో.. కుర్చీలకోసం కొట్లాడుకునే కాంగ్రెస్ పార్టీ కావాలో మీరే తేల్చుకోవాలంటూ **మిగతా 6లో..**



ఫార్మాపై శ్రద్ధ అమోఘం

తెలంగాణ సర్కారుకు కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు ప్రశంసలు

- ఈ రంగంలో పెట్టుబడులకు పలు దేశాల ఆసక్తి
- సంస్థలకు ప్రోత్సాహం.. ప్రజారోగ్యంపై రాజీపడం
- ఎన్‌పీపీఏ ద్వారా అందుబాటులోకి ఔషధ ధరలు
- హైదరాబాద్ వ్యాక్సిన్ రాజధాని: మంత్రి కేటీఆర్



బయో ఆసియా సదస్సు.. చర్చాగోష్ఠిలో కేంద్ర మంత్రి సురేష్‌ప్రభుతో మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి):

తెలంగాణలో ఔషధ పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న చొరవ ప్రశంసనీయమని కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు కొనియాడారు. దేశంలో ఫార్మా రంగం అనూహ్యంగా అభివృద్ధి చెందుతున్నదని ఈ అనుకూలతను తెలంగాణ చక్కగా అందిపుచ్చుకుంటున్నదని ప్రశంసించారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బయో-ఆసియా అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన ప్రసంగించారు. భారత ఫార్మా రంగంలో పెట్టుబడులకు అనేక దేశాలు ఆసక్తి చూపుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఫార్మా కంపెనీలకు **మిగతా 6లో..**

ఇదీలోకం!



ఇతను ముస్లిం.. గాయత్రీ మంత్రం బదులు ఖురాన్ పఠనం చేయొచ్చా అని అడుగుతున్నాడు సార్..!

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతల్లో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. చలిగాలుల తీవ్రత తగ్గుతుంది. గంటకు 11 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 34 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 35 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.8.10 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మృగశిర ఉ.9.51 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: సా.5.37-7.06; దుర్ముహూర్తం: సా.4.45-5.31; రాహుకాలం: సా.4.51-6.18; అమృతఘడియలు: రా.10.49-12.17; శుభసమయం: ఉ.7.00-9.00.

సూర్యోదయం: 6.41,

సూర్యాస్తమయం: 6.18



మండల ఆఫీసులోనే రిజిస్ట్రేషన్

- తహశీల్దార్లకు అదనపు బాధ్యతలు
- వచ్చే నెల 11 నుంచి అమలు
- ఆ బరువు మేం మోయలేం
- ఇప్పటికే మాపై పనిభారం: తహశీల్దార్లు
- నేడు అధికారుల భేటీలో తుది నిర్ణయం

3 లో..

నెల జీతం బోనస్

రెవెన్యూ ఉద్యోగులకు నజరానా



- భూ రికార్డుల ప్రక్షాళన సఫలం
- ఉద్యోగుల కృషి వల్లే సాధ్యమైంది
- రాత్రనకా.. పగలనకా కష్టపడ్డారు
- ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసలు
- 35,749 మంది ఉద్యోగులకు లబ్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి):

అత్యంత క్లిష్టమైన భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా పూర్తిచేసిన రెవెన్యూ శాఖ ఉద్యోగులకు ప్రోత్సాహకంగా ఒక నెల మూల వేతనాన్ని అందివ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. 10,809 మంది రెవెన్యూ ఉద్యోగులు, 24,410 మంది వీఏవోలు, 530 మంది సర్వే విభాగం ఉద్యోగులు.. మొత్తం **మిగతా 6లో..**



లవ్ వైరస్

పరిణతి లేని ఆలోచనలు.. ఆకర్షణ

- స్టేటస్ సింబల్‌గా భావిస్తున్న యువత
- ప్రేమ.. నిత్యావసర వస్తువులా భావన
- టీనేజ్ నుంచే ప్రేమాయణం మొదలు
- కుగ్రామాల నుంచి మెట్రో వరకూ సేమ్
- వివాహానికి ముందే చాలామంది కటీఫ్
- ఆశయం మరచి.. చదువుపై నిర్లక్ష్యం
- ప్రేమ పేరుతో హింసాత్మక సంఘటనలు
- యువతీ యువకుల నయా ట్రెండ్

‘జాతీ లేదు.. మతమూ లేదు.. కట్నాలేవీ కోరుకోదు ప్రేమ’

మనం సండే స్పెషల్

ప్రేమ గొప్పదనాన్ని తెలిపే ఓ పాట లోని చరణం ఇది. కానీ ఇప్పటి తరం మాత్రం అంత మెచ్యూర్డ్‌గా ఆలోచించడం లేదు. ఆకర్షణకు, ప్రేమకు **మిగతా 6లో..**

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు కలకలం

సంచీలో రెండు బాక్సుల గుర్తింపు

- మధిరలో స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు
- డాగ్‌స్క్వాడ్ పరిశీలనలోనూ స్పష్టత లేదు
- ప్రత్యేక బృందంకోసం ఎదురుచూపులు
- ఖమ్మంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ తనిఖీ
- అణువణువూ సోదా చేసిన ఆర్పీఎఫ్

6 లో..







బస్సు యాత్రకు 4 కమిటీలు

- అడ్వైజరీ, ఆర్గనైజింగ్, ఫైనాన్స్, మీడియా కమిటీల నియామకం
- యాత్ర ప్రారంభోత్సవానికి చిదంబరం, కుంతియా హాజరు

3 లో..

నిరుపేదల అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం

- **కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ సంస్థలు**
- **సాంకేతిక విద్యను పటిష్ట పరచాలి: కడియం**

పరకాల, ఫిబ్రవరి 24(మనం న్యూస్): ఉద్యమాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచాలన్న ధ్యేయంతో సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఈమేరకు శనివారం పరకాల పట్టణంలో ప్రభుత్వ యునాని ఆసుపత్రి, నూతన పాలిటెక్నిక్ కళాశాల హస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ సాధన కొరకు ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. పరకాల నియోజకవర్గంలో వేలకోట్లతో అభివృద్ధి నిధులను తీసుకువస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. పాలిటెక్నిక్ కళాశాల భవణానికి 6 కోట్ల 90 లక్షల నిధులతో అతితక్కువ కాలం వ్యవధిలో విశాలమైన భవణాన్ని నిర్మించి అభివృద్ధి పథంలోకి తీసుకువెల్లడం జరిగిందన్నారు. అదేవిధంగా పాలిటెక్నిక్ కళాశాలకు త్వరలోనే ల్యాబ్ యంత్రాలను హస్టల్‌కు కావాల్సిన ఫర్నీచర్‌ను వెంటనే అందించేలా అధికారులు చొరవచేపాలని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి గాను కళాశాలకు అదనంగా సివిల్, మైనింగ్, ఎలక్రిషన్ కోర్సులను ప్రారంభించేలా చోరవ చూపాని అన్నారు. కళాశాల ఆవరణంలో హరితహర కార్యక్రమంలో భాగంగా మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు ఒక్కొక్కరు ఒక్కొక్క చెట్టును దత్తత తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణను కాపాడాలని ఇద్దరిని చెట్లకు నీరు పోసేందుకు ఏర్పాటుచేయాలని అన్నారు. అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్ష నేతలు కండ్లు మూసుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎంపీ పసునూటి దయాకర్ మాట్లాడుతూ.. పేద ప్రజల కలలను నిజం చేసేందుకు సీఎం కేసీఆర్ పాటుపడుతు న్నారని చెప్పారు. మన ముఖ్యమంత్రి అపర భగీరథుడని, విజన్ ఉన్న నేత అని కొనియాడారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరగానే వరాలు ఇచ్చే మహా నేత మన ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అని అడగగానే లేదనకుండా నియోజకవర్గానికి వేల కోట్లను ఇచ్చిన ఘనత ఆయనదేనన్నారు.



యునాని ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న కడియం తదితరులు

చురుకుగా టీజేఏసీ పార్టీ ఏర్పాట్లు

- పరిశీలనలో పార్టీకి మూడు పేర్లు
- టీజేఎస్, ఆర్ఆర్‌పీ, టీపీఎస్, టీఎస్ఎస్
- ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తులు...!



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): పార్టీ ఏర్పాటు దిశగా టీజేఏసీ వేగంగా పావులు కదుపుతోంది. ఇందుకోసం అంతర్గతంగా ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నట్లుగా వినికిడి. పార్టీ పేరును నిర్ణయించడంలో తీవ్ర తర్జనభర్జనలు పడుతోంది. ప్రజలకు సుపరిచితంగా ఉన్న పేరును ఎంపిక చేయాలని టీజేఏసీ నేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగా.. తెలంగాణ జన సమితి(టీజేఎస్), రైతు రాజ్యం పార్టీ(ఆర్ఆర్‌పీ), తెలంగాణ ప్రజా సమితి(టీపీఎస్), సకల జనుల సమితి(టీఎస్ఎస్) పేర్లతో ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు చేసినట్లు సమాచారం. ముందు జాగ్రత్తగానే అనేక రకాల పేర్లను రిజిస్ట్రేషన్ చేసినట్లుగా భావిస్తున్నారు. ఈ పేర్లన్నీ టీజేఏసీకి దగ్గరగా ఉండటం గమనార్హం. తెలంగాణ ఉద్యమంలో టీజేఏసీ పేరు ప్రజలకు చాలా దగ్గరైంది. దీనికి భిన్నంగా పేరు పెడితే మళ్లీ ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన నేతలు.. టీజేఏసీకి దగ్గరగా ఉన్న పేర్లను రిజిస్ట్రేషన్ చేసినట్లుగా భావిస్తున్నారు.



మృతుడి బంధువుల రాస్తారోకో, ఇన్‌సెట్‌లో మృతుడు యాకయ్య

ఆస్పత్రిలో పెళ్లికొడుకు మృతి

- **యాకయ్య బంధువుల రాస్తారోకో**
- **నిందితుడిని ఉరితీయాలని డిమాండ్**
- **జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్**

వరంగల్/రఘునాథపల్లి, ఫిబ్రవరి 24(మనంన్యూస్): ఆ పెళ్లి కొడుకు చనిపోయాడు.. వారం రోజులుగా ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన ప్రాణం ఆరిపోయింది. పట్టుబట్టలతో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు విగతజీవిగా మారి పాడెపైకి చేరాడు. ఇష్టంలేని పెళ్ళి తప్పించుకునేందుకు కాబోయే వధువు పన్నిన దారుణ పన్నాగానికి బలయ్యాడు. ఈ నెల 18న జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల యాకయ్య(32)పై ఆరూరి బాలస్వామి, ఆరూరి అరుణ కలసి పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే! వారి అక్రమ సంబంధానికి అడ్డువస్తున్నాడనే నెపంతో ఈనెల 21న వివాహం ఉన్నందున ఈనెల 18వ తేదీ రాత్రి పథకం పన్ని పెళ్లికొడుకు యాకయ్యపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన విషయం పాఠకులకు విదితమే. ఈ కేసులో నిందితుడు ఆరూరి బాలస్వామి, ఆరూరి అరుణలను పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అయితే తీవ్రంగా మంటల్లో కాలి గాయాలపాలైన పెళ్లికొడుకు యాకయ్య గత ఐదురోజులుగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 7గంటలకు మృతిచెందాడు. ఈ మరణవార్త తెలుసు కున్న బంధువులు, గ్రామస్తులు సుమారు వందమంది రెండు ట్రాక్టర్లు, ఆటోలలో కంచనపల్లి నుండి బయలుదేరి మండలకేంద్రానికి చేరుకుని చౌరస్తా వద్ద 9.30గంటలకు నిందితుడిని ఉరి తీయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే నిందితుడితోపాటు మరో ముగ్గురు కూడా ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. వారిని కూడా పట్టుకుని కఠినంగా శిక్షించాలని వారు పోలీసులను కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసు అధికారులు సీఐలు తిరుపతి, నరేందర్ సంఘటన స్థలానికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నంచేసినా వారు వినలేదు. చివరాఖరుకు ఏసీపీ వెంకటేశ్వరబాబు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ రాస్తారోకోతో హన్మకొండ -హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.

టీఆర్టీ.. తొలిరోజు ఆగమాగం

దూరాభారం నుంచి వచ్చి.. నిమిషం నిబంధనతో పరీక్షకు దూరం

- **ముందు రోజు వచ్చి రోడ్లపైనే నిద్ర**
- **ప్రత్యామ్నాయ ఏర్పాట్లూ లేవు**
- **ఏళ్ల తరబడి కష్టపడి చదివి వృథా**
- **వాపోతున్న టీఆర్టీ అభ్యర్థులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 24(మనం ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ నియామక పరీక్ష శనివారం ప్రారంభమైంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమైన పరీక్షలు.. మార్చి 4 వరకు కొనసాగుతాయి. అందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు లాంగ్వేజ్ పండిట్(తెలుగు) పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు కొనసాగాయి. నిమిషం లేటయినా.. పరీక్ష కేంద్రంలోకి అనుమతించ లేదు. దీంతో చాలామంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్టీ పరీక్షను కేవలం ఆరు జిల్లాల పరిధిలో మాత్రమే నిర్వహించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మెదక్, హైదరాబాద్(హెచ్ఎండీఏ పరిధి) జిల్లాల్లో 60 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. అధిక శాతం హెచ్ఎండీఏ పరిధిలోనే కేంద్రాలను సిద్ధం చేయడంతో ఇతర జిల్లాల అభ్యర్థులకు అవస్థలు తప్పలేదు.

అభ్యర్థులకు తప్పని తిప్పలు

టీఆర్టీ పరీక్షకు ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 2,77,518 మంది అభ్యర్థులు 5,415 ఎస్జీటీ, 1,941 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి వీరందరికీ టీఆర్టీ పరీక్షను ఆయా ఉమ్మడి జిల్లాల పరిధిలోనే నిర్వహించాల్సి ఉంది. కానీ సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో పరీక్ష నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ భావించింది. ఇందుకు పాత జిల్లాల పరిధిలోనే పరీక్ష కేంద్రాలను అభ్యర్థులు ఆప్షన్‌గా పెట్టుకున్నారు. సీబీటీ విధానం కావడంతో అన్ని జిల్లాల్లో పరీక్షలు నిర్వహించడం సాధ్యం కాదనే కారణంతో కేవలం ఆరు జిల్లాల పరిధిలోనే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఒక్కటంటే ఒక్క కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. వరంగల్ జిల్లాలో కేవలం రెండు కేంద్రాల్లో మాత్రమే పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఫలితంగా ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులకు హైదరాబాద్‌లో కేంద్రాలను కేటాయించారు. దీంతో చాలామంది అభ్యర్థులు సకాలంలో పరీక్షకు చేరుకోలేమనే ఉద్దేశంతో 23వ తేదీ సాయంత్రానికే మహానగరానికి చేరుకున్నారు. ఇక్కడికి వచ్చిన అభ్యర్థులు బస చేసేందుకు టీఎస్‌పీఎస్సీ ఏలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా అభ్యర్థులు చాలావరకు రోడ్లపైనే గడిపారు. దీంతో రాత్రి చలికి అభ్యర్థులు బిక్కచచ్చిపోయారు. కొంతమంది విద్యార్థులు మాత్రం లాడ్జిలు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంతాల్లో తలదాచుకున్నారు. టీఆర్టీ కోసం ఏండ్ల తరబడి అభ్యర్థులు ప్రిపేర్ అయ్యారు. కానీ పరీక్షకు ముందు రోజు రాత్రి సరైన నిద్ర, ఆహారంలేక ఇన్నాళ్లు పడిన కష్టం వృథాగా మారింది. ఇక మహిళా అభ్యర్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. ఇకముందు జరగబోయే పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.



టీఆర్టీ పరీక్ష రాసి బయటకి వస్తున్న అభ్యర్థులు

ఆలస్యంగా అభ్యర్థులు..

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ అభ్యర్థి టీఆర్టీ కోసం మూడేండ్లుగా ప్రిపేర్ అవుతున్నాడు. అతడికి టీఆర్టీ(ఎల్‌పీ) పరీక్ష (ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు) కోసం నాచారంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ సెంటర్ కేటాయించారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం దాదాపు 10 గంటలు. అదిలాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరం నుంచి సదరు అభ్యర్థి బయలుదేరి పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు మొత్తంగా 14 గంటల సమయం పడుతుంది. దీంతో ఆ అభ్యర్థి 23వ తేదీ సాయంత్రమే హైదరాబాద్‌కు బయలుదేరాడు. కానీ సకాలంలో బస్సులు అందక.. పరీక్ష కేంద్రానికి చేరుకునే సరికి 10.06 గంటల అయ్యింది. దీంతో అక్కడి సిబ్బంది పరీక్ష హాల్‌లోకి అనుమతించలేదు. రాత్రి పగలూ శ్రమించి సిద్ధమైందంతా వృథాగా మారిందని.. ఇక ఆత్మహత్యే శరణ్యమంటూ ఇంటిబాట పట్టాడు. ఇలా చాలామంది అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా పరీక్షకు హాజరుకాలేక పోయారు. టీఆర్టీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు నాలుగేండ్లు ఆగిన టీఎస్‌పీఎస్సీకి.. ఒక్క నిమిషం లేటయితే అనుమతించడానికి ఇబ్బంది ఏంటని అభ్యర్థులు మండిపడ్డారు.

మొదటిరోజు ప్రశాంతం: టీఎస్‌పీఎస్సీ చైర్మన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు మొదటి రోజు సజావుగా సాగాయని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అన్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం నిర్వహించిన భాషా పండిట్ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పరీక్ష కు 92 శాతానికి పైగా అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు ఎస్జీటీ తెలుగు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 వరకు ఎస్జీటీ ఇంగ్లీష్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షకు 50 వేల మంది అభ్యర్థులు హాజరవుతారని చెప్పారు. టీఆర్టీలో మొత్తం 42 పరీక్షలు నిర్వహిస్తున్నామని, వెంటనే 'కీ'ని విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు.



మేధావులకు మేధావి కేసీఆర్

- **కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు, తాగు నీరు**
- **మండలి చైర్మన్ స్వామి గౌడ్**
- **ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ**



మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్

పెద్దపల్లి, ఫిబ్రవరి 24(మనం న్యూస్): తెలంగాణను సస్యశ్యామలంగా చేసే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసి సీఎం కేసీఆర్ మేధావులకే మేధావిగా మారారని శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, 40మంది శాసన మండలి సభ్యుల బృందం తో కలిసి ఆయన శనివారం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించారు. శాసన మండలి సభ్యుల బృందానికి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన, రామగండం పోలీసు కమీషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ సహా, పలువురు అధికారులు ఘన స్వాగతం పలికారు. సుందిళ్ళ బ్యారేజి, అన్నారం పంపుహౌజ్‌లను వారు సందర్శిం చారు. అనంతరం ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ బంగారు తెలంగాణ దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్య మిస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సుమారు 38 లక్షల ఎకరాలకు సాగు నీరు మిషన్ భగీరథకు మరియు హైదరాబాద్ నగరవాసులకు త్రాగునీటి తోసహా పారిశ్రామిక అవసరాలకు నీరు అందుతున్నారు. మండలి సభ్యుల బృందం కాళేశ్వరంప్రాజెక్టు నిర్మాణ పను లను చూసి అబ్బుర పడిందని చెప్పారు. రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో భార్య పిల్లలను వదిలి అడవిలో ఉంటూ ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న ప్రభు త్వ అధికారులు, ఇంజనీర్లు,టెక్నీషియన్లు, కూలీలు, పోలీసులను అభినందిం చారు. గత ముఖ్యమంత్రులు మాటలకే పరిమితం కాగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించి పనులను కొనసాగిస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ 14 సంవత్సరాల మలిదశ తెలంగాణ సుదీర్ఘ పోరాటంలో రైతుల కష్టాలు చూసి చలించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు కేసీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు.

పర్యాటక కేంద్రంగా గండిపేట

- **మూసీలో నిరంతరం మంచినీటి ప్రవాహం**
- **నీటి శుద్ధిపై జాయింట్ యాక్షన్ కమిటీ: కేటీఆర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 24(మనం ప్రతినిధి): మూసీ నది అభివృద్ధిలో భాగంగా గండిపేటను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. 2020 నాటికి గండిపేట చెరువును నిర్మించి వంద సంవత్సరాలు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో చెరువు అభివృద్ధి కోసం హెచ్ఎండీఏ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సాగునీటి శాఖ అధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమలకు తోడుగా హెచ్ఎండిఏ, టూరిజం శాఖలు కలిసి గండిపేట చెరువు సుందరీక రణ చేస్తాయన్నారు. దీంతోపాటు త్వరలోనే మూసి అభివృద్ధి సుందరీకర ణపైన అంతర్జాతీయ స్థాయి డిజైన్ కాంపిటీషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. శనివారం మూసి అభివృద్ధి, సుందరీకరణ కార్యక్రమాలపైన మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, కాలు ష్య నియంత్రణ మండలి, సాగునీటి శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొ న్నారు. మూసీ నది చుట్టూ ఏర్పాటు చేయనున్న ఎక్స్‌ప్రెస్ వేలు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంపైచర్చించారు. మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాల నివేదిక తయారైందని, సాగునీటి శాఖ చేపట్టే హైడ్రాలిక్ సర్వే కూడా త్వరలోనే పూర్తి అవుతుందని మంత్రికి అధికారులు తెలిపారు. మూసీ నీటి శుద్ధికి తీసుకోవాల్సిన చర్యలపైన వాటర్ వర్క్స్ పీసీబీ, టీఎస్ఐఐసీ అధికారులతో ఒక జాయింట్ యాక్షన్ కమిటీని చేయాలని అధికారులను మంత్రి అదేశించారు. వారంరోజుల్లో ఈ అంశంపైన ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు. మూసీ సుందరీకరణ కోసం ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమికంగా పలు ప్రణాళికలు రూపొందించిందని, మూసీ సుందరీకరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వంతెల నిర్మాణం, యస్టీపీల నిర్మాణం వంటి అంశాలను అత్యంత సుందరంగా ఉంచాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం త్వరలోనే ఒక డిజైన్ కాంపిటీషన్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. మూసీ నదిలో నిరంతరం మంచినీరు ప్రవహించేలా చేసేందుకు ఉన్న అవకాశాలపైన ఈ సందర్భంగా జలమండలి, సాగునీటి శాఖాధికారులతో మంత్రి చర్చించారు.

బీసీ ఫెడరేషన్లకు నిధులేవి?

- **రెండేండ్లుగా నిధుల కేటాయింపులు నిల్**
- **2015-16 నాటి నిధులకే మోక్షం లేదు**



హైదరాబాద్, జనవరి 24 (మనం ప్రతినిధి): పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా బీసీ ఫెడరేషన్ల పరిస్థితి మారింది. బీసీల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన బీసీ ఫెడరేషన్లు రాష్ట్రంలో త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫెడరేషన్లతో లాభం కలుగుతుందని అనుకున్న బీసీలకు నిరాశే మిగులుతోంది. బీసీలకు నిధులు కేటాయిస్తున్నామని చెప్తున్నప్పటికీ అవి కాగితా లకే పరిమితమయ్యాయని బీసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. బీసీలకు నిధుల కేటాయింపు మేడిపండు చందంగా ఉందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రెండేండ్లుగా కానరాని నిధులు..

బీసీ ఫెడరేషన్లతో పాటు కార్పొరేషన్ కింద 2015-16 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వ్యక్తిగత రుణాలతో పాటు ఫెడరేషన్ల రూపంలో దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులైన వారి జాబితాను ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేధిక పంపారు. ఇందులో భాగంగానే బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 1,31,387మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 17,167మందిని ఎంపిక చేశారు. రూ. 132.59కోట్ల నిధులు అవసరమని పేర్కొన్నారు. కాగా 8,332 మందికి గానూ రూ.60.86 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరి చేసింది. ఇంకా 8,835 మంది లబ్దిదారులకు గానూ 71.73 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇదే క్రమంలో రజక, వడ్డెర, నాయీబ్రాహ్మణ, మేదరి, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, కృష్ణబలిజ, సగర, భట్రాజు, గౌడ ఫెడరేషన్లకు గానూ 23,906 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 5,464 మందిని ఎంపిక చేశారు. రూ. 49 కోట్లు కేటాయించారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ. 18.14 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. మరో రూ. 30 కోట్లు రావాల్సి ఉంది. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మిగిలిన బకాయిలు ఇటీవల కాలంలో విడుదలైనట్లు తెలిసింది. కాగా కార్పొరేషన్‌కు మంజూరైన నిధుల్లోంచి ఫెడరేషన్లకు నిధులను బదలాయించాల్సి ఉంది.

ఫెడరేషన్లపై చిన్నచూపు..

బీసీ ఫెడరేషన్లను ఏర్పాటు చేసుకోండి. నిధులను ఇస్తామని ఓ వైపు పాలకులు పేర్కొంటున్నారు. ఆశతో ఫెడరేషన్లు ఏర్పాటు చేసుకున్నారు. తమ బతుకులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని బీసీలు ఆశించారు. ఏండ్లు గడుస్తున్నా నిధులకోసం ఎదురుచూపులే మిగిలాయి. 2016-17, 17-18 ఆర్థిక సంవత్సరానికిగానూ నిధుల కేటాయింపులు జరగలేదు. గతంలో ఏర్పా టు చేసుకున్న తమకు నిధుల మంజూరుకు అధికారులు తిప్పుతున్నారని రంగారెడ్డిజిల్లా కొహెడ మండలానికి చెందిన కృష్ణాచారి వాపోయారు.

ఎంబీసీ గ్రూపుల వైపు ప్రభుత్వం చూపు..

బీసీల్లో అత్యంత వెనుకబడిన కులాల గుర్తింపుకు టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ఇందులో భాగంగా ఎంబీసీలో కులాల గుర్తింపు విషయాన్ని బీసీ కమిషన్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఇప్పటి వరకు దాదాపుగా 92 కులాలను గుర్తించినట్టుగా విశ్వసనీయ సమాచారం. ఎంబీసీ కులాల సంక్షేమానికి అధిక కేటాయింపులు ఇచ్చే విధంగా రానున్న బడ్జెట్లో ప్రణాళికలను రూపొందిస్తున్నారు. దాదాపుగా రూ. వెయ్యికోట్లకు పైగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇదే క్రమంలో ఎంబీసీలు కాకుండా ఇతర బీసీ కులాలకు రూ. 500 కోట్ల మేర కేటాయింపుల ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనున్నారు. ఎన్నికలు వస్తుండటంతో రాజకీయ పార్టీలన్నీ బీసీ ఓట్లపై దృష్టి సారించాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ హామీలను గుప్పించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీసీ ఓట్లే కీలకం కానున్నాయి. ఈ క్రమంలో బీసీ ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. తమ వైపు తిప్పుకునేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాయి.

నిధుల విడుదల ఏది?

బీసీ ఫెడరేషన్లకు, కార్పొరేట్లకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాం. రుణాల కోసం లక్షలాధి మంది బీసీలు దరఖాస్తు చేస్తున్నారు. ఫెడరేషన్ల ద్వారా 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా ఒక్కరికి లోన్ ఇవ్వలేదు. బీసీ కార్పొరేషన్ ద్వారా 1.92లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోయింది. చెప్పులరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం కనికరించటం లేదు. నాయిబ్రాహ్మణులకు రూ. 250కోట్లు, రజకులకు రూ. 250 కోట్లు అన్నారు. విడుదల చేయలేదు. ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా రూ. వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. నిధుల జాడలేదు. ఎంబీసీ కులాలను గుర్తించలేదు. రూ. వెయ్యి కోట్లను 11 ఫెడరేషన్లకు కేటాయించాలని అడిగాం, పాలకులు స్పందించటం లేదు. రుణాల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో బీసీలు వచ్చే ఎన్నికల్లో పాలకులకు బుద్ధి చెప్తారు.

ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు

కేటాయింపు వరకేనా?

ఫెడరేషన్లు ఏర్పాటు చేసిన నాటి నుంచి సరిగా నిధులు కేటాయించటం లేదు. కేటాయించిన వాటిని ఖర్చు చేయటం లేదు. ఫెడరేషన్లకు పాలకమండలి లేదు. కార్యాలయాలు లేవు. ఆలనాపాలనా చూసే సరైన అధికారులు లేరు. మేడిపండు చందంగా ఫెడరేషన్లున్నాయి. ఫెడరేషన్లతో మా కుల వృత్తులకు భరోసా లభిస్తుందని ఆశించాం. ఫలితం లేకుండా పోయింది. ఫెడరేషన్లతో కుల వృత్తి దారులకు పెద్దగా మేలు జరగలేదు. ప్రతి ఫెడరేషన్‌కు కనీసం రూ. వంద కోట్లు కేటాయించాలి. బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా వంద శాతం నిధులు విడుదల చేసి ఖర్చు చేయాలి. బీసీ ఫెడరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్టు ఉంది. అధికారులు మాత్రం నిధులను విడుదల చేయటం లేదు. సంచార జాతులకు ఫెడరేషన్ ఏర్పాటు చేసి గత బడ్జెట్లో రూ. 7 కోట్లు కేటాయించారు. ఎక్కడ ఖర్చు చేసారో తెలియదు. ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి. బీసీలకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఫెడరేషన్లతో త్వరలో రాష్ట్రస్థాయిలో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నాం.

జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఓటర్ల జాబితాలో అవకతవకలు: మర్రి



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అధికార పార్టీ చేసే ఇలాంటి అక్రమాలకు కొంతమంది అధికారులు సహకరిస్తున్నారని పీసీసీ ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆరోపించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం దంతాన్‌పల్లి గ్రామ సర్పంచి ఉప ఎన్నిక సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. ఆ గ్రామంలో 2017 ఓటర్ల జాబితా ప్రకారం 2,652 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నిక మాత్రం 2015 ఓటర్ల జాబితా 1959 మంది ఓటర్లతో జరిపించారు. 742 ఓట్లను అధికార పార్టీ టీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే తొలగించారని పేర్కొన్నారు. ఇలా మోసపూరిత ఓటర్ల లిస్టులను తయారు చేసి ఎన్నికలు జరిపించనప్పటికీ అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కేవలం 18 ఓట్ల తేడాతోనే ఓడిపోయారని చెప్పారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ గ్రామాల్లో తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీలకు చెందిన ఓటర్లను తొలగించే ప్రమాదం ఉందని శశిధర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ ఎన్నికలు ఎలాంటి అవకతవకలు లేకుండా సవరించిన 2017 ఓటర్ల జాబితా ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ఎన్నికల అధికారికి ఒక వినతి పత్రం సమర్పించారు.



గవర్నర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రవీంద్ర నాయక్

రిజర్వేషన్లపై సర్కారు మోసం: రవీంద్ర నాయక్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): గిరిజన రిజర్వేషన్ల విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత విధానాలకు పాల్పడుతుందని, కాంగ్రెస్ నాయకులు రవీంద్రనాయక్ విమర్శించారు. నేరుగా రిజర్వేషన్లను 6.5 నుంచి 10 శాతానికి పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ పని చేయలేదన్నారు. కేంద్రం ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మైనారిటీ రిజర్వేషన్లు బిల్లుతో పాటు, గిరిజన రిజర్వేషన్ల బిల్లును కూడా శాసనసభలో ఆమోదింపచేసి కేంద్రానికి పంపించాలని విమర్శించారు. ఇలా రెండు బిల్లులను పంపించడంలోనే కేసీఆర్ మోసం దాగి ఉందన్నారు. ఇప్పుడు ఇదే విషయంపై గిరిజన తెగల మధ్య ఒకరినొకరు చంపుకునేంతగా కక్ష్యలు పెరగడానికి ప్రభుత్వ వైఖరే కారణమని ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ గిరిజనుల రిజర్వేషన్ జీవో ద్వారా పెంచినట్లుగానే ఇప్పుడు 10శాతాన్ని కూడా పెంచి ఉండాల్సిందన్నారు. గిరిజనులు, ఆదివాసీల మధ్య ఏర్పడిన అపోహలను తొలగించడంలో కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గిరిజన నాయకులు సూర్యానాయక్, శంకర్‌నాయక్‌తో కలిసి శనివారం నాడు ఆయన గవర్నర్ నరసింహన్ కలిసి ఈ వివాదాన్ని పరిష్కరించాల్సిందిగా కోరారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని రాష్ట్ర ట్రైబల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివాదాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

'గీత' సంక్షేమానికి 3 వేల కోట్లు కేటాయించాలి

- గీత పనివారల సంఘం డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24(మనం ప్రతినిధి): గీత కార్మికుల సంక్షేమానికి, వృత్తి అభివృద్ధికి రానున్న బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ గీత పనివారల సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈత, తాటి చెట్ల పెంపకానికి రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాలకు 10 ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ భూమిలో బోరు బావి, వనాలలో షెడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. చెట్లపై నుంచి పడి మరణించిన గీత కార్మికులకు గతంలో మాదిరిగా ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

బస్సు యాత్రకు 4 కమిటీలు

- అడ్వైజరీ, ఆర్గనైజింగ్, ఫైనాన్స్, మీడియా కమిటీల నియామకం
- యాత్ర ప్రారంభోత్సవానికి చిదంబరం, కుంతియా హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ప్రజాచైతన్య యాత్రకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. యాత్రను విజయవంతం చేసేందుకు పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా అడ్వైజరీ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, మీడియా కమిటీ, ఫైనాన్స్ కమిటీ పేర్లతో ఈ నాలుగు కమిటీలను ఏర్పాటు చేశారు. మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా 18 మంది సభ్యులతో అడ్వైజరీ కమిటీని ఉత్తమ్ నియమించారు. ఈ కమిటీలో వి.హనుమంతరావు, జి.చిన్నారెడ్డి, మధుయాష్కీ గౌడ్, పొన్నాల లక్ష్మయ్య, డి.కె.అరుణ, గీతారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సర్వే సత్యనారాయణ వంటి ప్రముఖులు ఉన్నారు. మండలిలో కాంగ్రెస్ పక్ష నాయకుడు షబ్బీర్ అలీ చైర్మన్‌గా ఏర్పడిన ఆర్గనైజింగ్ కమిటీలో మాజీ మంత్రి దానం నాగేందర్, కో చైర్మన్‌గా ఆలేటి మహేశ్వర్ రెడ్డి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో మొత్తం 31 మందిని సభ్యులుగా నియమించారు. పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి చైర్మన్‌గా 9 మంది సభ్యులతో ఫైనాన్స్ కమిటీని నియమించారు. పీసీసీ మీడియా ఇంచార్జి మల్లు రవి చైర్మన్‌గా 18మందితో మీడియా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 26న చేవేళ్లలో మధ్యాహ్నం ఒంటిగంటకు మొదటి విడత బస్సు యాత్రను ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారు. మార్చి 9 వరకు ఇది కొనసాగుతుంది. ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభలు ఉంటాయి. బస్సు యాత్ర ప్రారంభానికి తెలంగాణ ఇంచార్జి రాంచంద్ర కుంతియా మాజీ ఆర్థికమంత్రి చిదంబరం హాజరు కానున్నారు.



ఉత్తమ్ యాత్రకు సిద్ధమైన బస్సు

అందరూ హాజరు..

బస్సుయాత్రలో కాంగ్రెస్ అగ్ర నాయకులంతా పాల్గొనేలా ప్లాన్ చేశారు. ఆయా జిల్లాల్లో ఉన్న ముఖ్య నేతలు కూడా ఇందులో పాల్గొంటారు. బస్సు యాత్ర సందర్భంగా వివిధ పార్టీల నుంచి నాయకులను చేర్చుకునే కార్యక్రమం కూడా ఉంటుంది. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు విభేదాలు పక్కన పెట్టి తప్పనిసరిగా యాత్రలో పాల్గొనాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. యాత్రకు ముందు ఆయా ప్రాంతాలకు సాంస్కృతిక బృందాలు వెళ్లనున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తెలంగాణ గుండె చప్పుడు అనే పేరుతో ఓ ఆడియో క్యాసెట్‌ను విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ సాంస్కృతిక సేన చైర్మన్ ఏపూరి సోమన్న రచించి, గానం చేశారు. ఆయన నాయకత్వంలో బృందం పీసీసీ పర్యటనల వెంట కొనసాగనుంది.

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు

అంతర్రాష్ట్ర రవాణాపై మంత్రుల బృందం సిఫారసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: అంతర్రాష్ట్ర రవాణాదారులు ఈ-వే బిల్లు కలిగి ఉండాలన్న నిబంధనను ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తేవాలని రాష్ట్ర ఆర్థిక మంత్రుల బృందం సిఫారసు చేసింది. వివిధ రాష్ట్రాల మధ్య రవాణాలో సరుకు విలువ రూ.50 వేలకు మించితే ఎలక్ట్రానిక్ వే-బిల్లు కలిగి ఉండాలన్నది వస్తుసేవల పన్ను చట్టం (జీఎస్టీ) నిబంధన. అయితే, దీన్ని దశలవారీగా అమలు చేయాలని బిహార్ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ నేతృత్వంలోని రాష్ట్రస్థాయి ఆర్థిక మంత్రుల బృందం శనివారం నాడు సిఫారసు చేసింది. నిరుడు జూలై 1న జీఎస్టీ వ్యవస్థను ప్రవేశపెట్టినప్పటికీ సమాచార సాంకేతిక (ఐటీ) నెట్‌వర్క్ సిద్ధంకాని కారణంగా ఈ-వే బిల్లు నిబంధన అమలు వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1 నుంచి ప్రభుత్వం దీన్ని ప్రారంభించగా ఐటీ నెట్‌వర్క్ వ్యవస్థలో అనేక లోపాలు తలెత్తడంతో మరోసారి వాయిదా పడింది. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి తిరిగి మొదలుపెట్టాలని ఆర్థిక మంత్రుల బృందం సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనను మార్చి 10న జరిగే సమావేశంలో వస్తుసేవల పన్ను మండలి పరిశీలిస్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు.

నిరుద్యోగులకు 3 వేల భృతి

- అధికారంలోకి రాగానే అమలు
- ఉద్యోగాల భర్తీని పట్టించుకోని సర్కారు
- లక్ష ఉద్యోగాలు భర్తీ చేయాల్సిందే
- లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం: లక్ష్మణ్
- టీఆర్ఎస్‌ను ఎదుర్కొనేది బీజేపీనే: మురళీధర్‌రావు



'నిరుద్యోగ యువగర్జన'లో మాట్లాడుతున్న లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి) : తెలంగాణలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉందని, అధికారంలోకి వస్తే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. అన్ని నియోజకవర్గాల్లో నిరుద్యోగంపై ఆందోళనలు చేస్తామని, లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేసీఆర్ మాట మార్చారని ఆరోపించారు. హైదరాబాద్ అమీర్‌పేట్‌లో శనివారం బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన 'నిరుద్యోగ యువగర్జన'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఓయూ విద్యార్థుల త్యాగ ఫలితంగానే వచ్చిందని, ప్రత్యేక రాష్ట్రం కోసం రోజుకో విద్యార్థి తమ ప్రాణాలు త్యాగం చేశారని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో చెప్పిన విధంగా లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ పరంగా నిరుద్యోగ సమస్య పునరావతం అవుతోందే తప్ప ఉగ్యోగ ఖాళీలు మాత్రం భర్తీ కావడం లేదన్నారు. ఫీజు బకాయిలు చెల్లించలేక యువత చదువులు మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వందలాది డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడటానికి ప్రభుత్వమే కారణమని విమర్శించారు. గత నాలుగేళ్లలో కేవలం 16వేల ఉద్యోగాలను భర్తీ చేశారని తెలిపారు. నిర్దిష్ట ఉద్యోగుల క్యాలెండర్ ప్రకటించాలని లేకపోతే అసెంబ్లీ సమావేశాలు స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

టీఆర్ఎస్‌ను ఎదుర్కొనేది బీజేపీనే : మురళీధరావు

టీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటానికి యువత సిద్ధమవ్వాలని, తెలంగాణ ప్రజలంతా టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరావు అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల విద్యార్థులను కేసీఆర్‌ను వ్యతిరేకిస్తున్నారని, టీ సర్కారు వచ్చాక భూమాఫియా, అవినీతి పెరిగిందని విమర్శించారు. ఉద్యమం చేసినోళ్లకు ప్రభుత్వంలో చోటు లేకుండా పోయిందన్నారు. ప్రతి సామాన్యుడికి ఉపయోగపడే విధంగా కేంద్రం ముద్ర యోజన ద్వారా స్వయం ఉపాధి కల్పించిందని తెలిపారు. టీఆర్ఎస్‌ను ఎదుర్కొనే శక్తి ఒక్క బీజేపీకే ఉందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని, త్వరలో ఎన్నికలు జరగనున్న మేఘాలయ, త్రిపురలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, తెలంగాణలోను బీజేపీ జెండా ఎగురువేస్తుందని దీమా వ్యక్తం చేశారు.

నిరుత్సాహంలో యువత: రామచంద్రరావు

తెలంగాణ యువత ఉద్యోగాలు లేక నిరుత్సాహంతో ఉందని ఎమ్మెల్సీ రామచంద్రరావు పేర్కొన్నారు. రాష్ట్రం లో లక్షా ఇరవై వేల ఉద్యోగాలు ఖాళీలు న్నాయని కానీ నాలుగేళ్లలో భర్తీ చేయలేదని మం డిపడ్డారు. ఐటీ కంపెనీలు వస్తున్నాయంటే కేవలం కేంద్రం కృషి వల్లేనని, ఇం దులో రాష్ట్ర గొప్పతనం ఏ మా త్రం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో బీ జేపీ యువతకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

బీసీలకు రాజ్యసభ సీట్లు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): వచ్చే నెలలో జరుగబోయే రాజ్యసభ ఎన్నికల్లో బీసీలకు రెండు సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన ఇద్దరు రాజ్యసభ ఎంపీలు దేవేందర్ గౌడ్, రాపోలు ఆనంద భాస్కర్ పదవీ విరమణ అవుతున్నందున మరో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన వారికి ఒక రాజ్యసభ స్థానం కేటాయిస్తామని సీఎం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, దీంతోపాటు అత్యంత వెనుకబడిన కులాల వారికి గానీ, సంచార జాతుల నుంచి ఒకరికీ సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రైతు సమన్వయ సమితిలో గ్రామ, మండల, జిల్లాల కమిటీల్లో రాష్ట్రం 54 శాతం ఉన్న బీసీలకు అన్యాయం జరిగిందని, దీనిని సీఎం కేసీఆర్ సరిదిద్ది సామాజిక న్యాయం పాటించాలని కోరారు. తమిళనాడు తరహాలో బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని, దేశంలోనే బడుగు బలహీన వర్గాలు 90 శాతం పైగా ఉన్న ఏకైక రాష్ట్రమంటునే పదవుల్లో మాత్రం దమాషా పద్ధతి పాటించకపోవడం దురదృష్టకరమని తెలిపారు.



హైదరాబాద్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు అర్ధసంవత్సర జాబితాను విడుదల చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

'సూపర్ క్రిటికల్'కు శ్రీకారం

- రాష్ట్రంలోనే తొలిసారి ఏర్పాటు
- 800 మె.వా. కేంద్రానికి పనులు ప్రారంభం
- మంచిర్యాల జిల్లాలో 'సింగరేణి' ఆధ్వర్యంలో నిర్మాణం



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి) :తెలంగాణకే తలమానికమైన సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యుత్ ప్లాంట్లలో రాష్ట్రంలోనే తొలిసారిగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని అధికారులు ఉపయోగించనున్నారు. మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న 1200 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రానికి అదనంగా మరో 800 మెగావాట్ల విద్యుత్తుకు సింగరేణి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని జైపూర్ మండలంలో 2,600 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించిన సింగరేణి.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు అవసరాల్లో దాదాపు 14 శాతాన్ని సింగరేణి పవర్ ప్లాంట్లు తీరుస్తున్నాయి. దీనికి అదనంగా రెండో దశలో 800 మెగావాట్ల మూడో యూనిట్ పనులకు శ్రీకారం చుట్టింది. రూ.5,879.62 కోట్ల వ్యయంతో బొగ్గు ఆధారిత సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని నిర్మించనుంది. దీనికి అవసరమైన నిధులను 70:30 నిష్పత్తిలో సేకరించనుంది. సింగరేణి సంస్థ రూ. 1764 కోట్లు పెట్టుబడి పెట్టనుండగా, మిగతా 70శాతం రూ. 4116 కోట్లు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణంగా సేకరించనుంది. ఈ మొత్తాన్ని వాణిజ్యపరంగా ఉత్పత్తి మొదలైన ఆరు మాసాల తర్వాత మూడు నెలలకు ఒకసారి చొప్పున 12 ఏళ్లలో తిరిగి చెల్లించనుంది. ఈమేరకు గత నెల 22న యాజమాన్యం ఆర్థిక సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ ప్రకటన జారీ చేసింది. ఈనెల 22లోపు పెట్టుబడి కోసం అవసరమైన రుణాన్ని ఇచ్చే సంస్థలు ముందుకు వస్తే, పనులు వేగం పుంజుకోనున్నాయి.

0ఇప్పుడున్న 1,983 ఎకరాల విద్యుత్తు కేంద్రం ఆవరణలోనే మూడో యూనిట్ నిర్మాణాన్ని చేపట్టనుంది. కేంద్రం ఆవరణలో అవసరమైన స్థలంలో నేలను చదును చేసే పనులను ఇటీవలే మొదలుపెట్టింది. చదును పనులు పూర్తయిన అనంతరం మార్చి నెల తర్వాత మూడో యూనిట్ నిర్మాణం పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్‌కు బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బీటీజీ), బ్యాలన్స్ ఆఫ్ ప్లాంట్ (బీఓపీ) పనులను ఈపీసీ కాంట్రాక్టు పద్ధతిన అప్పగించింది. ఇప్పుడున్న రెండు 600 మెగావాట్ల యూనిట్ పనులను కూడా బీహెచ్ఈఎల్ సంస్థే చేపట్టింది. ఇప్పటికే మట్టి నమూనాలను పరీక్షించిన యాజమాన్యం, తెలుగు రాష్ట్రాల్లోనే సూపర్ క్రిటికల్ విధానంలో తొలి యూనిట్‌ను నెలకొల్పడానికి అడుగులు ముందుకు వేస్తోంది.

సింగరేణి ఆధ్వర్యంలో ఇప్పుడు నడుస్తున్న 1200 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రం కోసం ఇదివరకే చేపట్టిన బీఓపీ (బ్యాలన్స్ ఆఫ్ ప్లాంట్) పనులు ఉపయోగపడుతాయి. స్థల సేకరణ, ప్రహరీగోడ నిర్మాణం, కోల్ హ్యాండ్లింగ్, యాష్ హ్యాండ్లింగ్ తదితర అనేక పనులు కొత్త యూనిట్ నిర్మాణంలో చోటు చేసుకునే అవసరంలేదు. జైపూర్ మండలంలోని షెట్‌పల్లి గ్రామ సమీపంలోని గోదావరి నది నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ వంద ఎకరాల విస్తీర్ణంలో నీటిని నిల్వ చేసే జలాశయం ఉంది. ఏదైనా అవాంతరం ఏర్పడి గోదావరి నది నుంచి నీటి తరలింపు నిలిచిపోతే 15 రోజులకు సరిపడేంతగా జలశయంలోని నీరు ఉపయోగపడుతుంది. సుందిల్ల బ్యారేజి నిర్మాణం పూర్తయితే షెట్‌పల్లి సమీపంలోని గోదావరిలో ఏడాదిపొడవునా నీరు సమృద్ధిగా ఉంటుంది.


ఇటు బొగ్గు ఉత్పత్తి...అటు విద్యుత్..

సీఎం కేసీఆర్ చొరవతో మూడో యూనిట్ పనులకు మోక్షం లభించింది. రాష్ట్రంలో నిరంతర విద్యుత్తు అందించాలనే సంకల్పంతో 2015 మార్చి 3న రెండో దశలో మరో 600 మెగావాట్ల మూడో యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ప్రాజెక్టు నివేదికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం పర్యావరణానికి మరింత మేలు చేయాలనే ఉద్దేశంతో సబ్ క్రిటికల్ విధానానికి బదులుగా సూపర్ క్రిటికల్ థర్మల్ కేంద్రాలకే అనుమతి ఇస్తోంది. ఈ విధానంలో 600మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడం సాధ్యమయ్యే అవకాశాలు లేకపోవడంతో, 800 మెగావాట్లకు పెంచాల్సి వచ్చింది.

మూడో యూనిట్ నిర్మాణం పూర్తయితే సూపర్ క్రిటికల్ విధానంలో విద్యుత్తును ఉత్పత్తి చేసే సంస్థల్లో సింగరేణి తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి స్థానంలో ఉంటుంది. దేశంలోనే తొలి ప్రభుత్వరంగ బొగ్గు ఉత్పత్తి సంస్థగా గుర్తింపు ఉన్న సింగరేణి విద్యుత్తు ఉత్పత్తిలో 2000 మెగావాట్లు చేసే పరిశ్రమగా ఖ్యాతి గడించనుంది. ఏప్రిల్‌లో పనులు మొదలైతే, 48 నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని అంచనా. బొగ్గు ఉత్పత్తిరంగంలో 129 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి, తొలి 600 మెగావాట్ల యూనిట్ ద్వారా 2016 సెప్టెంబరు 25న వాణిజ్య ప్రాతిపదికన విద్యుత్తును ఉత్పత్తి చేసింది. రెండో యూనిట్ ద్వారా 2016 డిసెంబరు 2 నుంచి మరో 600 మెగావాట్లు ఉత్పత్తి చేస్తోంది. ఇటు బొగ్గు ఉత్పత్తి, అటు విద్యుత్తు ద్వారా సింగరేణి సంస్థ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం రూ. 2,400 కోట్లకు చేరుకుంటుందని అంచనా. 2016-17లో ఈ ఆదాయం రూ.19,274 కోట్లుగా నమోదైంది. ఈ లెక్కన ఆ ఆర్థిక సంవత్సరం సింగరేణి రూ. వెయ్యి కోట్లకు పైగా లాభం గడించే అవకాశం ఉంది. కొత్త యూనిట్ నిర్మాణం పూర్తయి ఉత్పత్తి మొదలైతే విద్యుత్తు కేంద్రం ద్వారా మరిన్ని లాభాలు పొందే అవకాశాలున్నాయి.

తహశీల్దార్ వద్ద రిజిస్ట్రేషన్

- వారికి అదనపు బాధ్యతలు
- వచ్చే నెల 11 నుంచి అమలు
- ఆ బాధ్యతలు మేం మోయలేం
- ఇప్పటికే మాపై పనిభారం: తహశీల్దార్లు
- నేడు అధికారులు సమావేశంలో తుది నిర్ణయం



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ చట్టాల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా భూ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టింది. తాజాగా భూ క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా చర్యలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రభుత్వం మరి కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఒకేచోట రిజిస్ట్రేషన్, ఖాతా మార్పులు ఉండాలని నిర్ణయించింది. తహశీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ దిశగా ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. కాగా రిజిస్ట్రార్లుగా అదనపు బాధ్యతలు స్వీకరించే విషయంలో తహశీల్దార్ల నుంచి కొంత వ్యతిరేకత వస్తుండటం గమనార్హం.


తహశీల్దార్లకు బాధ్యతలు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా రిజిస్ట్రేషన్ చట్టంపై తహశీల్దార్లకు అవగాహన కల్పిస్తున్నారు. మార్చి 11న కొత్త పాసు పుస్తకాల జారీతోపాటు తహశీల్దార్ కార్యాలయాల్లో కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈక్రమంలోనే హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు ప్రభుత్వం అధికారులకు శిక్షణను ఇప్పించింది.

అయితే..ఇప్పటికే మండల తహశీల్దార్లకు దాదాపు 258 చట్టాల అమలు పర్యవేక్షణ బాధ్యతలున్నాయి. ఇక నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల బాధ్యత కూడా మోయాల్సి ఉంటుంది. భూముల క్రయవిక్రయాల దస్త్రాలను పరిశీలించటంతోపాటు చట్టం-1908 ప్రకారం రిజిస్ట్రేషన్లను పూర్తిచేసే బాధ్యత కూడా తహశీల్దార్లే పర్యవేక్షించనున్నారు. ఇదిలా ఉండగా రిజిస్ట్రేషన్ల బాధ్యతలు తమకు వద్దంటూ తహసీ ల్దార్లు వాపోతున్నారు. తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతలు పూర్తిగా భిన్నమైనవని వారు పేర్కొం టున్నారు. కొత్త బాధ్యత వల్ల కలిగే ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పలువురు తహసీల్దార్లు పేర్కొంటున్నారు.

సిబ్బంది కొరత..

ప్రతి తహశీల్దార్ కార్యాలయానికి అదనంగా ముగ్గురు సిబ్బందిని నియమించి సాంకేతిక సహాయకుడిగా, జూనియర్ అస్టిటెంట్‌గా, ధరణి వైబ్‌సైట్ నిర్వాహకులుగా వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గడువు దగ్గర పడుతున్నా ఇప్పటివరకు అదనపు సిబ్బంది నియామకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తహసీల్దార్లు చెబుతున్నారు. నియామక ప్రక్రియ ఆలస్యమైతే ఉన్న వారిపైనే అదనపు భారంపడే పరిస్థితి నెలకొంది. దీని వల్ల సాధారణ పరిపాలన విభాగం పనులు అటకెక్కే ప్రమాదం ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఇకనుంచి ఎవరైనా సరే స్టాంపులపై రాతపూర్వకంగా భూలావాదేవీలు జరగాల్సి ఉంటుంది. మండల కార్యాలయాల వద్ద కూడా దస్తావేజు లేఖర్లపైనే అధారపడాల్సిన ఉంటుంది. ఈ నెల 25న హైదరాబాద్‌లో తహశీల్దార్ల సంఘం సమావేశాన్ని ఏర్పాటు నిర్వహించనున్నారు. తహశీల్దార్లు రిజిస్ట్రార్లుగా బాధ్యతలతో పడే ఇబ్బందులను సమావేశంలో చర్చించనున్నట్టు తెలిసింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు తహసీల్దార్లు సన్నద్ధమవుతున్నారు.



డాక్టర్ సందీప్ పాండే

ఎదుటి మనిషికి చెప్పేందుకే సలహాలున్నాయన్నట్టుగా కాకుండా ఆ సలహాను స్వయంగా మోదీ ప్రభుత్వం పాటిస్తే సమంజసంగా ఉంటుంది. ఎంత పెద్ద సమస్యకైనా చర్చలే పరిష్కారాన్ని చూపుతాయని తరచూ ప్రధాని దేశ విదేశాల్లో చెబుతుంటారు.

ఉద్రిక్తతలకు చర్చలతోనే చెక్!



సంఘ్ పరివార్ ... భారత్-పాక్‌ల మధ్య యుద్ధమేఘాలు సృష్టించాలని భావిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య శాంతి చర్చలు జరగాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశిస్తున్నట్టుగానే భారత-పాక్‌లమధ్య ఎందుకు శాంతిచర్చలు పునఃప్రారంభం కాకూడదు? మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కారణాలేమైనప్పటికీ భారత, పాక్‌ల మధ్య సంబంధాలు క్షీణించాయన్నది వాస్తవం. సరిహద్దుల్లో పాక్ ఆగడాలను అరికట్టడానికి భారతసైన్యానికి ఆరేడునెలల పడుతుందని, అదే తమ కార్యకర్తలైతే మూడురోజులో సర్వం చక్కబెట్టుకు రాగలరని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాటలు గుర్తుండే ఉంటాయి. ఇంతకన్నా దేశానికి కాలసినదేమున్నది? అత్యంత క్రమశిక్షణ గల దేశభక్తియుత సంఘ్‌పరివార్ కార్యకర్తలు దేశాన్ని గొప్ప నిబద్ధతతో కాపాడగలరనుకుంటే దేశరక్షణ భారం ఖర్చు తగ్గుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న తమ భావజాల పార్టీ ప్రభుత్వం తరపున భగవత్ ఇలాంటి ప్రతిపాదనను ఇంత ఆలస్యం ఎందుకు చేశారో ఎవరికీ అర్థంకాని విషయం!

ఆర్ఎస్ఎస్ పరివార్ కార్యకర్తలు దేశాన్ని రక్షించేందుకు సిద్ధపడినప్పటికీ వారి శక్తిసామర్థ్యాలను మనం పరిశీలించవలసి ఉంది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాల్గొన్న సందర్భం లేదు. హిందుత్వంతో సంబంధం ఉన్న ఒక్క వీర సావర్క‌ర్‌ను మాత్రం ఆయనకున్న దేశభక్తి భావాల ఆధారంగా బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధించింది. అనంతరం ఆయన క్షమాపణ చెప్పడంతో జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తరువాత హిందుత్వ భావాలు కలిగి చరిత్రలో మనకు కనిపించే మరోవ్యక్తి నాథూరామ్ గాడ్సె. మహాత్మా గాంధి హత్యతో ప్రఖ్యాతి గాంచిన వ్యక్తి.

ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పీ) అధికారంలో ఉన్నపుడు మూడేళ్లలో చేయలేని పనిని ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 1992లో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలో ఉన్నపుడు ఒక్కరోజులో అయోధ్యలో బాబ్రీమసీదును ఆర్ఎస్ఎస్ కరసేవకులు కూల్చివేశారు. దేశంలో సంభవించిన ఐదు బాంబు పేలుళ్ల వెనుక హిందు మత దురభిమానులున్నారు. లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ పురోహిత్, రిటైర్డ్ మేజర్ రమేశ్ ఉపాధ్యాయ సలహాల కారణంగానే సరిహద్దుల్లో అలజడి, ఉద్రిక్తతలు పెరిగాయి. ఇప్పుడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. గో రక్షకుల పేరుతో ముస్లింలను, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని దాడులు, హత్యలు జరిగాయి. హిందు భావజాలానికి సరిపడని వారిపై 'లౌ జీహాద్' దాడులు, కొంతమంది మేధావులను కూడా లక్ష్యంగా చేసుకుని సంఘ్‌పరివార్ విపరీత ధోరణితో ప్రవర్తించింది. ఈ దాడులు, హత్యలను జాతీయవాదం ముసుగులో పరివార్ కొనసాగించింది. మొహమ్మద్ అఖ్‌లాఖ్ హత్య జరిగినప్పుడు అతని మృతదేహానికి జాతీయ పతాకంతో కప్పారు. దేశాన్ని రక్షించగల ధైర్యసాహసాలు ఆర్ఎస్ఎస్‌కు ఉన్నాయని ఈ సాహసకృత్యాలు విశ్వాసం కల్పించడం లేదా?! 2008లో పాకిస్థాన్ టెర్రరిస్టులు ముంబైలో కొందరిని కొన్నిరోజులు బందీలుగా చేసినప్పుడు ఆర్ఎస్ఎస్ కావాలని స్పందించలేదు. మరాఠీ ప్రజల రక్షణకు ముందుంటామని ప్రకటించే శివసేనతో కలిసి ఆర్ఎస్ఎస్ వర్గీయులు పెద్దసంఖ్యలో ముంబైలో బందీలుగా ఉన్న తాజ్ హోటల్‌ను చుట్టుముట్టి ఉంటే ఒక్కరోజులో పాకిస్థాన్ టెర్రరిస్టుల ఆట కట్టేదేమో? ఈ అంశంలో తమ అసలైన శౌర్యాన్ని చూపించడంలో ఆర్ఎస్ఎస్-శివసైనికులు మంచి అవకాశాన్ని వదులుకున్నారనుకోవాలా? దాడి చేయడానికి సైన్యానికి ఆరేడు నెలల కాలం పడుతుందని ప్రకటించడం ద్వారా మోహన్ భగవత్, ముంబై తాజ్ సంఘటనలో జోక్యం చేసుకుని ఉంటే మూడురోజుల్లో టెర్రరిస్టుల ఆటకట్టించి ఉండేవారేమో? సరిహద్దులకు వెళ్లనవసరం లేకుండా మహారాష్ట్రలో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని ఉంచుకుని మరీ ఆర్ఎస్ఎస్ వలంటీర్లు ఎందుకు మౌనంగా ఉండిపోయారో ఎవరికీ అర్థం కాని విషయం. వీటన్నింటినీ పరిశీలిస్తే, అనవసరమైన ఉద్రిక్తతలను, హింసలను ఆర్ఎస్ఎస్ ప్రోత్సహిస్తోందని స్పష్టమవుతోంది. వారి ఆలోచనాధోరణి దేశానికి హానికరంగానే పరిణమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

> సమస్యలకు చర్చలే పరిష్కారమైనప్పుడు పొరుగుదేశంతో సంబంధాలు మెరుగుపరుచుకునే దిశలో చర్చలకు ఎందుకు మళ్లీ శ్రీకారం చుట్టకూడదు? అన్నది ఇప్పుడు మేధావులను వేధిస్తున్న ప్రశ్న.

ఇక్కడ మనం ఒక విషయాన్ని పరిశీలనలోకి తీసుకోవాలి. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత పొరుగుదేశలతో స్నేహసంబంధాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. చైనాతో ఉద్రిక్తతలు, దాయాది దేశమైన పాకిస్థాన్‌తో సంబంధాలు క్షీణించాయ్యన్నది వాస్తవం. కారణం ఎవరైనప్పటికీ, ఏదైనప్పటికీ, విధానలోపం ఎవరిదైనప్పటికీ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, చొరబాట్లు పెరిగాయి. పాక్ ఆగడాలను అరికట్టడానికి సర్జికల్ దాడులు వంటి చర్యలకు మనం దిగుతున్నప్పటికీ పరిస్థితులు మారలేదు. సరిహద్దుల్లో ఎక్కడో అక్కడ టెర్రరిస్టుల చేతుల్లో భారతీయ సైనికులు అంతమవుతూనే ఉన్న సంఘటనలు నిత్యం నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇందుకు ప్రతిగా మనం కూడా కొంతమంది పాకిస్థాన్ సైనికులను, టెర్రరిస్టులను చంపుతూనే ఉన్నాం. నువ్వొకరిని చంపితే నేను ఇద్దర్ని చంపుతాననే వ్యూహం వల్ల సాధించేదేమున్నది? - రక్తపాతం తప్ప! రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు, వైషమ్యాలు తొలగిపోవాలంటే ఒకరిపై మరొకరు దాడులు, ప్రతిదాడులు చేసుకోవడమే మార్గమా? దీంతో పరిస్థితులు చక్కబడతాయా?

ఇలా పొరుగుదేశాలతో ఉద్రిక్తపరిస్థితులు ఏ దేశానికీ అభివృద్ధిని చూపించదు. పాలస్తీనా-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నివారణకు శాంతి చర్చలే మార్గమని నరేంద్ర మోదీ సలహా ఇచ్చారు. చాలా మంచి సూచన. కానీ, ఎదుటి మనిషికి చెప్పేందుకే సలహాలున్నాయన్నట్టుగా కాకుండా ఆ సలహాను స్వయంగా మోదీ ప్రభుత్వం పాటిస్తే సమంజసంగా ఉంటుంది. ఎంత పెద్ద సమస్యకైనా చర్చలే పరిష్కారాన్ని చూపుతాయని తరచూ ప్రధాని దేశ విదేశాల్లో చెబుతుంటారు. దేశంలో సమస్యలకు చర్చలే పరిష్కారమైనప్పుడు పొరుగుదేశంతో సంబంధాలను మెరుగుపరుచుకునే దిశలో చర్చలకు ఎందుకు మళ్లీ శ్రీకారం చుట్టకూడదు? అన్నది ఇప్పుడు మేధావులను వేధిస్తున్న ప్రశ్న. ఇప్పటికైనా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవతి అసందర్భ వ్యాఖ్యలు మానుకుని కేంద్రంలోని తమ ప్రభుత్వానికి ఉచితమైన సలహా ఇవ్వాల్సి ఉంది. ఆ చర్యతో వారు కోరుకుంటున్న సరిహద్దు ఉపద్రవాలను ముగింపు కూడా లభిస్తుంది కదా!

కుల ధ్రువీకరణ పత్రాలు దక్కని 'దాసులు'

సమీక్ష

శ్రీ వైష్ణవ మత స్థాపన జరగటానికి ముందే పన్నెండు ఆళ్వారుల భక్తి ఉద్యమమూ, అందులోనూ ఆళ్వారులు వివిధ కులాలకు చెందినవారు, వారిలో ముఖ్యంగా అంటరాని కులం నుంచి తిరుమళ్శై ఆళ్వార్, తిరుప్పాణాళ్వార్‌లు ఉన్నారు. ఈ రోజుకూ పన్నెండు ఆళ్వారులలో భాగంగా వీరిరువురినీ కొలుస్తూ దైవ ఆరాధనలో అందరూ ఒక్కటేననే వైష్ణవతత్వాన్ని చాటుకోవడం జరుగుతుంది. ఆళ్వారుల భక్తి ఉద్యమ ప్రభావం రామానుజాచార్యుల వారి కాలానికి భారతీయ తాత్విక పురోగతికి భూమికగా ఉంటూ విశిష్టద్వైత శాఖగా పుంజుకుని శ్రీ వైష్ణవ మతంగా అభివృద్ధి చెందింది. ఈ మత శాఖ కేవలం అగ్రకులాలకే పరిమితం కాకుండా వివిధ శూద్ర-దళిత-గిరిజనులలో విశేషంగా వ్యాపించి వారిని తనలో భాగం చేసుకుంది. వారందరినీ జంధ్యధారణ-దాసనామ స్వీకరణ-గుడుల స్థాపన-పూజారులుగా నియామకం- భక్తి కార్యక్రమాల నిర్వాహణకు ప్రోత్సహించడం జరిగింది. దీని ఫలితంగా ఈ రోజుకూ పెక్కుమంది దాసులు (మాల/మాదిగ దాసర్లు) శ్రీ వైష్ణవ శాఖను అంటిపెట్టుకుని ఉన్నారు, అందులోనూ కొందరు తమ కులవృత్తిని కొనసాగించడాన్ని చూడవచ్చు (కొందరు ఉద్యోగస్తులను మినహాయించి). దాసులను ప్రభుత్వం గుర్తించి వారికి కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయవలసినదిగా ఆదేశాలు జారీ అయ్యాయి. (Constitution (Scheduled Caste) Order,1950 ప్రకారం మాలమాదిగ దాసులు/దాసర్లకు కులధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయవచ్చు). కానీ అధికారులు ఈ ఆదేశాన్ని పెడచెవిన పెడుతూ కులధ్రువీకరణ పత్రాల మంజూరుకు పూనుకోవడం లేదు, దీనివలన ఈ రోజుకూ కొన్ని ఏళ్లుగా కులధ్రువీకరణ పత్రాలు లేక నిరుద్యోగులుగా కొన సాగుతున్నారు లేదా చాలామంది దాసులు మాలమాదిగ కులపత్రాలు సంపాదించి చలామణి అవు తున్నారు. కావున వారికి నేటి సమాజంలో అందివచ్చే అవకాశాలు దూరమవడమే కాకుండా నేటి తరం తాతముత్తాతల సాంస్కృతిక సాహిత్య వారసత్వాలకు దూరమవుతున్నారు కూడా. ఇటువంటి దుస్థితి నుంచి తమను రక్షించుకోవడానికి దాసర్ల సంఘాలను స్థాపించుకుని వినతి పత్రాలు, సభలు, సమావేశాలు, పోరాటాలు చేయడం ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు వైష్ణవ మత పెద్దల ప్రోద్బలం కూడా ఉండటంతో పాటుగా వారిని సనాతన ధర్మరక్షణలో పాల్గొనమంటూనే తమవంతు కర్తవ్యంగా దాసులకు ఉచితంగా ధర్మబోధన చేయటానికి సిద్ధమని ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమాల తర్వాతనైనా అధికారులలో మార్పు వస్తుందేమోననే దాసర్ల కాంక్ష నెరవేరడం లేదు. నేటి ఆధునిక కాలంలో తమ కులవృత్తి ఏ మేరకు జీవనోపాధి కాగలదు? అధునిక సమాజం నిరంతరం వేగంగా పురోగమిస్తున్న తరుణంలో దాసులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయవలసిన అవసరాన్ని గుర్తించి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలి.

◆ అంకాళ్ళ నారాయణ దాసు

సోయా సాగుకు సాయం!

దేశవ్యాప్తంగా సోయా ఉత్పత్తులు వినియోగం పెరుగుతోంది. ఈ కారణంగా సోయా పంట విస్తీర్ణం కూడా ప్రతి ఏటా పెరుగుతోంది. అయితే రైతుల శ్రమకు ఫలితం గిట్టుబాటు ధర రూపంలో లభించుటంలేదు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలి.

సోయా చిక్కుడు అధిక దిగుబడినిచ్చే శక్తిమంతమైన లెగ్యూమ్ జాతి పైరు. దీని గింజలలో 43 శాతం మాంసకృత్తులు, 20 శాతం నూనె ఉంటాయి. ఈ పైరును సాగుచేసి ఇటు పప్పు ధాన్యాలు అటు నూనెగింజల కొరత తగ్గించుకోవచ్చును. మన దేశంలో సోయాచిక్కుడు నూనెగింజల పంటగా వేరుశనగ, ఆవాలు తరువాత మూడవ స్థానం ఆక్రమించింది. మనదేశంలో ఈ పైరు 60 లక్షల హెక్టారుల్లో సాగులో ఉంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, మహారాష్ట్రలలో ఎక్కువగా సాగుచేయబడుచున్నది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణాల్లో 2 లక్షల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. నూనె పరిశ్రమలు స్థాపించి ఈ పైరును ప్రోత్సహించాల్సిన అవసరముంది.

మనదేశంలో ఈ పైరు తొలకరిలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. కాని రబీ, వేసవికాలంలో సాగు చేసి ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. ఒకే పంటగా కాకుండా కొబ్బరి, పత్తి, కంది పైర్లలో అంతరపంటగా ఈ పైరు విస్తీర్ణం పెంచడానికి అవకాశాలు అధికం. తొలకరి సోయాచిక్కుడు కన్నా రబీలో దిగుబడులు 60% అధికంగా ఉంటాయని పరిశోధనా ఫలితాలు తెలియజేస్తున్నాయి. రబీ, సోయాచిక్కుడును పొడి వాతావరణంలో కోతకు వస్తుంది కాబట్టి గింజ నాణ్యత బాగుంటుంది. మొలక శాతం ఎక్కువ కాలం ఉంటుంది.

సోయా చిక్కుడు, మనం పండించే అపరాల పైర్ల కంటే రెండున్నర రెట్లు అధిక దిగుబడినిచ్చే శక్తి కలిగి, వాటికంటే రెట్టింపు మాంసకృత్తులు కలిగిన పైరు. సోయాచిక్కుడు గింజలలో మాంసకృత్తులతోబాటు 20% నూనె ఉంటుంది. సోయానూనెలో ఎక్కువ శాతం అసంతృప్త కొవ్వు ఆమ్లాలే వుండటం వలన ఇప్పుడు వాడుకలో ఉన్న పంట నూనెలన్నింటికన్నా ఆరోగ్యానికి మంచిది. ప్రస్తుతం సోయాగింజల నుండి నూనె తీసిన చెక్క/పిట్టును విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీనివలన విదేశీ మారక ద్రవ్యం లభిస్తున్నప్పటికీ సోయాచెక్కలో గల 60-65% మాంసకృత్తులను మనదేశ ప్రజల అవసరాలకు వాడుకోలేకపోతున్నాం. సోయాచెక్కను ఉపయోగించుకోవటానికి అనుబంధ పరిశ్రమలను నెలకొల్పి మన ఆహారంలో మాంసకృత్తులు కొరతను తగ్గించుకోవలసిన అవసరముంది.



ఒకే విధమైన సాగులో సోయాచిక్కుడు 29.6 క్వి/ హె., కంది 16.6 క్వి/హె., మినుము 10.4 క్వి/హె., పెసర 8.8 కి.హె., దిగుబడులు కలిగి ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో సోయాచిక్కుడు సాగు పొగాకు, ప్రత్తి, మిర్చి, జొన్న పంటల ప్రత్యామ్నాయాలుగా సుమారు 3 లక్షల హెక్టార్లలోను, పత్తి కంది, కొబ్బరి పైర్లలో అంతర పంటగా 5 లక్షల హెక్టార్లకు పైగా విస్తీర్ణం అదనంగా వచ్చే అవకాశముంది. ఈ కారణంగా ఇతర పంటలలోని ధరల వడుదుడుకులను తగ్గించవచ్చు.


సోయాచిక్కుడు సాగులో సమస్యలు :

1. సోయా చిక్కుడు విత్తనం త్వరగా మొలక శక్తిని కోల్పోవడం.
2. సకాలంలో పైరు కోయలేకపోతే కాయలు చిట్లి 10 నుంచి 70 శాతం వరకు పంటకు నష్టం కలుగుతుంది.
3. మేలైన విత్తనం సరిపోయిన మోతాదులో అందుబాటులో లేకపోవడం.
4. రైజోబియం కల్చరు, భాస్వరం, గంధకంనిచ్చే ఎరువులు సిఫారసు మేరకు ఉపయోగించకపోవడం.
5. కొత్త పైరు గనుక సాగులో మెలకువలు తెలియకపోవడం.
6. సకాలంలో పురుగులు, తెగుళ్ళను గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోవడం.

సోయాచిక్కుడు పైరు రైజోబియం జపానికం అనే బాక్టీరియా సహాయంతో గాలిలోని నత్రజని స్థిరీకరించి ఉపయో గించుకోవడమే గాక, హెక్టారుకు 50 కిలోల నత్రజని వరకు భూమికి చేర్చి భూమిని సారవంతం చేస్తుంది. అందువలన రైజోబియం జపానికం కల్చరును సోయాచిక్కుడు విత్తనానికి పట్టించి విత్తుకోవాలి. సోయాచిక్కుడు మొక్క నిటారుగా పెరుగుతుంది. కొమ్మలు తక్కువ. కాండం మీద వత్తుగా కాయలు కాస్తాయి. కాబట్టి విత్తనం దగ్గర దగ్గరగా విత్తుకొని అధిక దిగుబడులు పొందవచ్చు. హెక్టారుకు 4 లక్షల మొక్కలుండేటట్లుగా 30X7.5 సెం.మీ. లేదా 45X5 సెం.మీ. దూరంలో విత్తుకోవడానికి విత్తన సైజును బట్టి 50 నుంచి 62.5 కిలోలు హెక్టారుకు అవసరం. పొగాకు, పత్తి, మిర్చి సాగు రైతులు సోయా పంటవైపు మొగ్గవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

◆ పుట్టా సోమన్నచౌదరి

పీడిత ప్రజల ఆత్మబంధువు



సిపిఐ(ఎంఎల్) రాష్ట్రనాయకులు, పీడిత ప్రజల ఆత్మబంధువు, పార్టీ ఆశయాల సాధన కోసం పూర్తి నిబద్ధతతో, ఉక్కు క్రమశిక్షణతో తుదిశ్వాస వరకూ ఆదర్శ జీవితాన్ని గడిపిన యద్ధనపూడి సోనీ చిరస్మరణీయుడు. సోనీ(60 సం॥లు) గుండె సంబంధ వ్యాధికి గత కొంత కాలంగా చికిత్స పొందుతూ ఫిబ్రవరి 19న విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. 1958లో ఆస్తిక భావాలున్న సంప్రదాయ కుటుం బంలో జన్మించిన యద్దనపూడి సోనీ (సోమేశ్వర జానకీరామ్), బందరులో డిగ్రీ చదువుతున్న కాలంలోనే నాస్తిక భావాలవైపు, తర్వాత నాటి డిఎస్‌ఓ పరిచయాల్లోకి వచ్చారు. మార్క్సిజాన్ని అవగాహన చేసుకుంటూ, 1980 నాటికి విప్లవమే వృత్తిగా, విప్లవ రాజకీయాచరణకు జీవితాన్ని అంకితం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. బందరు ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణ బాధ్యతల్లో భాగంగా పట్టణంలో విద్యార్థుల, శ్రామిక యూనియన్ల ఏర్పాటుతో పాటు పేదల నివాస కాలనీల ఏర్పాటుకు; బందరు పరిసర గ్రామాల్లో తీరప్రాంతవాసుల, రైతాంగ సమస్యలపై నిరంతర, రాజకీయ, ఉద్యమ, నిర్మాణకృషి సాగించారు. దీనికి కళారంగాన్ని సృజనాత్మకంగా జోడించి ప్రజలను విస్తృతంగా సమీకరించి, పలు విజయాలు సాధించారు.

సోనీ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికి నిబద్ధుడై, పార్టీ నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడి కడదాకా కృషి సాగించారు. పెడధోరణులకు, సిద్ధాంత గందరగోళాలకు వ్యతిరేకంగా ఆంతరంగిక ఘర్షణల్లో సరైన వైఖరులను నిలబెట్టటంలో వ్యక్తిగత సాన్నిహిత్యాలను సైతం లెక్కచేయక దృఢంగా నిలిచారు. పార్టీ సిద్ధాంతంపై, ఆచరణపై భావజాల పరంగా జరిగే దాడులను సమర్థంగా తిప్పికొట్టారు. సోనీపై, ఇతర కామ్రేడ్స్‌పై గూండాలు భౌతికదాడులు, దుష్ప్రచారాలు చేసినా వెరవలేదు. పోలీసుల వేధింపులు, అక్రమకేసులకు జంకలేదు. ప్రజలను నిరంతర కార్యాచరణలో వుంచుతూ ఉద్యమాన్ని కాపాడుకున్నారు.

కృష్ణాజిల్లాలో పార్టీ నిర్మాణ బాధ్యతలతోపాటు, 2008లో రాష్ట్రస్థాయిలో ఏర్పడిన ఏపిఎఫ్‌టియు సంస్థకు రాష్ట్రకార్యదర్శిగా, తదనంతరకాలంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్రకార్యదర్శిగా సోనీ బాధ్యతలు నిర్వహించి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నలుమూలల పర్యటించి కార్మిక సమస్యలపై ఆందోళనల్లో పాలుపంచుకున్నారు. గ్రామీణ పేదల సంఘం, రైతుకూలీ పేదల సంఘం, నేడు కొనసాగుతున్న రైతుకూలీసంఘం ఆవిర్భావం నుంచి కృష్ణా జిల్లా కార్యదర్శిగా, రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కోశాధికారిగా, సహాయకార్యదర్శిగా పలు సందర్భాల్లో వివిధ జిల్లాలలోనూ, రాష్ట్రస్థాయిలోనూ జరిగిన రైతుకూలీ ఆదివాసీ ఉద్యమాలలో అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక పాల్గొని సోనీ అండగా నిలిచారు.

ఆనాడు విప్లవపంథా నిర్మాతలు డి.వి., టి.ఎన్.ల నాయకత్వాన ఉన్న యు.సి.సి.ఆర్.ఐ (ఎంఎల్) నుంచి సిపిఐ (ఎంఎల్) యూనిటీ ఇనీషియేటివ్, సిపిఐ (ఎంఎల్) జనశక్తి నుంచి నేటి సిపిఐ(ఎంఎల్) పార్టీ వరకూ క్రియాశీల నాయకుడిగా కొనసాగారు.

ప్రజల సమస్యలకు త్వరితంగా స్పందించటం, సమస్యను అధ్యయనం చేసి వేగంగా వారిని ఆందోళనకు సిద్ధంచేయటం సోనీ నైజం. రాజకీయ విధానాలలో రాజీపడకుండా వుండటం, యాజమాన్యాలతో వేతనాలపై జరిగే చర్చల బేరసారాలలో కార్మికుల ప్రయోజనాలకోసం నిజాయితీగా నిలవటం, నిర్ణయాలకు కట్టుబడి అమలు చేయటం, ఆర్ద్రత, ఆప్యాయతలతో ప్రజలతో, కామ్రేడ్స్‌తో మెలగటం, మీదుమిక్కిలి దశాబ్దాలుగా అనారోగ్యంతో యుద్ధంచేస్తూనే నవ్వుతూ ముందుకు కదిలి, అందరినీ కదిలించటం సోనీ జీవితాచరణలో విశిష్ట లక్షణాలు. రాష్ట్ర పిలుపుల కోసం వేచిచూడకుండా వివిధ ప్రాంతాల ప్రజాందోళనలకు మద్దతుగా, వారిపై నిర్బంధానికి, దాడులకు నిరసనగా తక్షణం స్పందించి కార్యక్రమాలు చేపట్టడం, విశ్లేషణాత్మకమైన కరపత్రాలను క్రమబద్ధంగా వెలువరించటం, పూర్వపరిచయాలన్నింటితో రాజకీయ సంబంధాలను నెరపటం సోనీ రాజకీయ జీవితాచరణలో మరికొన్ని ఎన్నదగిన లక్షణాలు. విద్యుత్ చార్జీల భారీ పెంపుదల ఉద్యమం మొదలుకొని అనేక ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు సాగించిన ఐక్య కార్యాచరణ కార్యక్రమాల్లో ఉద్యమ దీక్షతో పాల్గొనేలా పార్టీ శ్రేణులను కదిలించేవారు.

సోనీ స్ఫూర్తిదాయక జీవితాచరణను మననం చేసుకుంటూ మన సమస్యల పరిష్కారంకోసమేగాక, ఈ వ్యవస్థ మార్పుకోసం సాగే జనతా ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం సాగే కృషిలో భాగస్వాములవుదాం.

◆ ముప్పాళ్ళ భార్గవశ్రీ
సిపిఐ(ఎంఎల్) రాష్ట్రకమిటి సభ్యులు

(మచిలీపట్నం సువర్ణకళామందిర్‌లో నేడు యద్ధనపూడి సోని సంస్మరణసభ)

మన లేఖలు

మహిళా వర్సిటీ మంచిది

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీని ప్రతిపాదించటం మంచి పరిణామం. విశ్వవిద్యాలయంగా మార్చడానికి కోఠి ఉమెన్స్ కాలేజీకి అన్ని రకాల వసతులున్నాయి. దాదాపు 40 ఎకరాల్లో విస్తరించి, ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీలో 42 యు.జి కోర్సులు, పీజీ కోర్సులతో నడుస్తున్న ఉమెన్స్ కాలేజీలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులు ఉన్నారు వీరితో పాటు విదేశాలకు చెందిన చాలా మంది విద్యార్థినిలు కూడా చదువుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఒకటి ఉండగా, విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లింది. దీంతో తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. ఇటీవల కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ దృష్టికి కూడా నాయకులూ తీసుకెళ్ళారు. తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, కేంద్రం ఇందుకు తగిన సాయం చేయాలని కోరారు. ప్రస్తుతం కోఠి ఉమెన్స్ కాలేజీని చూసిన తర్వాత తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం చేయడానికి కావల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయని గుర్తించటం శుభ పరిణామం. మహిళా విశ్వవిద్యాలయం వల్ల మహిళలకు ఉన్నత విద్య , పరిశోధన వంటి అంశాలు అందరికి చేరుతాయి. వచ్చే విద్యా సంవత్సరం మహిళా విశ్వ విద్యాలయం ప్రారంభం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకొని మహిళలకు యూనివర్సిటీ విద్య అందుబాటులో ఉండేలా కృషి చేయాలి.

-కందగట్ల శ్రవణ్ కుమార్,
కాకతీయ యూనివర్సిటీ.

రాచకొండ అడవులు సరే... చెట్లేవి?

రాష్ట్రవ్యాప్తంగా అడవుల శాతాన్ని పెంచి గ్రీన్ కవర్ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ 'హరితహారం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు అడవుల్లో మొక్కలను నాటి, నాటిన ప్రతి మొక్కను బతికించే విధంగా అటవీశాఖ అధికారులు కృషిచేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ, రాచకొండ ప్రాంతంలో కొంతమంది అటవీ శాఖ అధికారులు మొక్కలకు తగిన రక్షణ కల్పించడంలేదని, నీటి సౌకర్యాలు పెట్టిన మొదట్లో కొట్టినారనీ, మా ప్రాంతంలోని యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని 'రాచకొండ' అటవీ ప్రాంతంలో చెట్ల శాతాన్ని చూస్తే అర్థం అవుతుంది. పూర్వంలో రాచకొండ ప్రకృతి అందాలు, గుట్టల్లో విపరీతమైన చెట్లు, అడుగు దూరంలో ఉన్న వ్యక్తి కానరాని పరిస్థితి ఉండేది. అలాంటిది ఇప్పుడు కనీసం చూడడానికి వెళ్లే పర్యాటకులకు కాసేపు కూర్చోడానికీ చెట్లే లేని పరిస్తితి. హరితహారం ద్వారా పూర్వవైభవం వస్తుందనుకుంటే అటవీశాఖ అధికారులు మొక్కలను పర్యవేక్షించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

- గుండమల్ల సతీష్‌కుమార్
సంస్థాన్ నారాయణపురం

మనం
కుటుంబం
ఆదివారం, 25 ఫిబ్రవరి 2018
www.manamnews.com



రెక్కాడితే కాని డొక్కాడని మధ్యతరగతి కుటుంబం. ఇద్దరు అమ్మాయిలను గారాబంగా చూసుకుంటున్న తల్లిదండ్రులు వారిని అందరి ఆడపిల్లల్లా పెళ్లిళ్లు చేసి పంపకుండా, మీకు నచ్చినట్టు చేయండన్నారు. అంతే తండ్రి ప్రోద్బలంతో చిన్న కూతురు భారత పతాకాన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించే స్థాయికి ఎదిగింది. తమ చిన్నారికి క్రీడలపట్ల ఉన్న మక్కువను మొగ్గలోనే గుర్తించి, అవసరమైన ట్రైనింగ్ ఇప్పించారు. ఇప్పుడు ఇంటర్నెట్‌లో మోస్ట్ ట్రెండింగ్ స్పోర్ట్స్ పర్సనాలిటీగా ఎదిగిన అరుణా బుద్ధా రెడ్డి కుటుంబ నేపథ్యం ఇది.





స్ప్రింగ్‌లా!

అక్క అండతో అంతర్జాతీయ స్థాయికి

హైదరాబాద్‌లో ఉంటున్న అరుణ బాల్యంలోనే కరాటే బ్లాక్ బెల్ట్ సాధించి, ఆతరువాత జిమ్నాస్ట్‌గా క్రీడా జీవితాన్ని మొదలుపెట్టారు. 22 ఏళ్ల అరుణ భాగ్యనగరంలోని సెయింట్ మేరీస్ కాలేజ్‌లో బీకాం పూర్తి చేశారు. తండ్రి మరణం తర్వాత అమ్మ, అక్క, బావ సహకారంతో ఎలాగైనా ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని, గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో దూసుకుపోతున్నారు. గత రెండు నెలలుగా ఉజ్బెకిస్తాన్‌లో ట్రైనింగ్ తీసుకుని, జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్‌లో కాంస్య పతకం సాధించి, ఏప్రిల్‌లో జరగబోయే కామన్ వెల్త్ క్రీడల్లో సత్తా చాటేందుకు సాధన చేస్తోంది. కంపెనీ సెక్రెటరీగా పనిచేస్తున్న అక్క పావని కంపెనీనే ఇప్పటివరకూ అరుణకు స్పాన్సరర్‌గా నిలిచింది. కానీ కామన్ వెల్త్, ఒలింపిక్స్ అంటే బోలెడంత ఖర్చుతో కూడుకున్న పని. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం చేయకపోతే చాలా కష్టమని ప్రస్తుతం వీరు భావిస్తున్నారు. గతంలో రెండు తెలుగు రాష్ట్రాలు అరుణకు ఆర్థిక సాయాన్ని ప్రకటించినా చివరికి మొండి చేయి చూపించాయి. దీంతో ఏ టోర్నమెంట్‌కు వెళ్లాలన్నా అప్పులు చేయక తప్పదు, ఆతర్వాత వడ్డీలు కట్టి వాటిని తీర్చక తప్పదని అరుణ కుటుంబ సభ్యులు వాపోతున్నారు. క్రికెట్, టెన్నిస్, బ్యాడ్మింటన్‌లా జిమ్నాస్టిక్స్‌కు పెద్దగా ఆదరణ లేకపోవడం కూడా ఇందుకు కారణం. తాజాగా జిమ్నాస్టిక్స్‌లో వాల్ట్ విభాగంలో అరుణ చూపిన ప్రతిభను క్రీడారంగం ప్రశంసల్లో ముంచెత్తుతోంది. ఈ అమ్మాయి ఒంట్లో ఉన్నది ఎముకలా? లేక స్ప్రింగ్‌లా ? అనేలా సాధన చేసే అరుణను చూసి కోచ్‌లే ఇంప్రెస్ అవుతున్నారు.










నాకు ఈ ప్రపంచంలో అందరికంటే ఇష్టమైనది ఎవరో తెలుసా? ఇంకెవరు నేనే !! అవును నాకు బాగా నచ్చే నన్ను నన్నుగా ఉండిపోనివ్వాలనిపించిన క్షణాన తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి జీవితాంతం నాకోసం నేను నేనుగా మిగిలిపోవాలని అనుకుంటున్నా. నేను అత్యధికంగా ప్రేమించే నా జీవితాన్ని ఇంకొకరితో పంచుకోవాలన్న ఆసక్తి ఏమాత్రం లేని నాకు, ఇలాగే హాయిగా.. నాకు మాత్రమే సొంతమైన నేను, నేనుగా ఉంటూ, భవిష్యత్‌లోనూ నన్ను ప్రేమించే నేను, నేనుగానే మట్టిలో కలిసిపోవాలని ఆనందమైన జీవితాన్ని సంతృప్తిగా బ్రతుకుతున్నా.. ఇది శ్రీమోయీ పియు కుందు మనసులో మాట. ఈపాటికే మీకు అర్థమై ఉంటుంది.. ఈమె తన జీవితాన్ని అమితంగా ప్రేమిస్తారని. మీకు అర్థమైంది నిజమే.

నాకోసం నేను

స్టేటస్ సింగిల్

'మీ టూ ఉద్యమం' తర్వాత సిటీ వుమెన్‌ను అత్యధికంగా ఆకర్షిస్తున్న స్టేటస్ సింగిల్ ఇప్పుడు సరికొత్త ఉద్యమంగా రూపాంతరం చెందుతోంది. వ్యక్తిగత కారణాలు, లవ్ ఫెయిల్యూర్, కెరీర్‌లో ఒడిదుడుకులు, ఆర్థిక కష్టాలు, కుటుంబ నేపథ్యం, ఆరోగ్య సమస్యలు, పెళ్లి కుదురకపోవడం ఇలాంటి ఎన్నో కారణాలతో దేశవ్యాప్తంగా ఒంటరిగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్న కొందరు ఒంటరి మహిళలను స్వయంగా కలిసి, వారితో మాట్లాడిన కుందు, స్టేటస్ సింగిల్ జీవితాలను పుస్తకంగా విడుదల చేశారు. 3000 మంది తనలాంటి అర్బన్ సింగిల్ వుమెన్ ఇంటర్వ్యూలను తన పుస్తకం ద్వారా వెలుగులోకి తెచ్చి, బియింగ్ సింగిల్ స్టేటస్‌ను ప్రోత్సహిస్తున్నారు కుందు. నెటిజెన్లకు క్రేజీ కాన్సెప్ట్‌గా కనిపిస్తున్న స్టేటస్ సింగిల్ మూ మెంట్‌తో మహిళలకు సాధికారత లభిస్తుందని, ఆర్థకంగా తన కాళ్ల మీద తాను నిలదొక్కు కోగలమన్న ఆత్మస్థైర్యమే ఇలాంటి జీవితాలకు ఇంధనమని కుందు చెబుతారు.








అస్తిత్వం కోల్పోకుండా..

నా అస్తిత్వాన్ని కోల్పోవడమంటే ఏమాత్రం ఇష్టం లేదని చెప్పే కుందు, ఎప్పుడూ ఉత్సాహంగా, హుషారుగా ఉంటారు. తనను తాను అందంగా అలంకరించుకుని, తనకు నచ్చిన వ్యక్తులతో, తనకు నచ్చినట్టు ప్రశాంతంగా ఉండే కుందు తాను నమ్మి, ఆచరిస్తున్న సిద్ధాంతాన్ని లిటరేచర్ రూపంలో పబ్లిష్ చేస్తూ మారుతున్న మహిళల రుచులు, అభిరుచులను నిర్మొహమాటంగా ఆవిష్కరిస్తున్నారు.

మారుతున్న మిడిల్ క్లాస్ మెంటాలిటీ

కోల్‌కతాకు చెందిన నాలుగు పదులు దాటిన కుందు స్వేచ్ఛగా ఉండే తన స్వభావం, జీవన శైలి.. ''నేటి తరం మహిళకు నిలువెత్తు రూపం నేనే'' అని సగర్వంగా చెప్పుకునేలా ఉంటుంది. మధ్యతరగతి నుంచి వచ్చిన తమలాంటి వారిలో వచ్చిన మార్పును తల్లిదండ్రులంతా జీర్ణించుకోవాలి, సొసైటీ కూడా అంగీకరించాలని ఈమె వాదిస్తారు. అదేమంటే అవును నాకు పెళ్లి, పెటాకులు, బాధ్యతలు అంటే నచ్చదు.. నా పాటికి నేను నాకు నచ్చినట్టు ఉండిపోతాను, నా క్యారెక్టర్‌కు ఇలా ఉంటేనే న్యాయం జరుగుతుంది అని కుండబద్దలు కొడుతూ నవ్వేసే కుందు లాంటి వారు మనమధ్య చాలా మంది ఉన్నారు. ఇటీవలి కాలంలో మధ్యతరగతి అమ్మాయిలు ఇలా సింగిల్‌గా ఉండిపోవడానికి సాహసం చూపుతుండడం విశేషం.





హోలీ ఆయీరే



కృష్ణుడు జన్మించిన యమునా తీరం మధురలో హోలీ వేడుకలు హోరెత్తుతున్నాయి. నెల రోజుల పాటు మధుర, బృందావనంలో జరిగే హోలీ సంబరాలకు దేశ విదేశాల నుంచి టూరిస్టులు చేరుకుంటున్నారు. రంగు రంగుల పూల రెక్కలు, గులాల్‌తో పాటు వివిధ రంగులు, పసందైన హోలీ వంటలు ఆరగిస్తూ రంగుల్లో మునిగి తేలుతూ హోలీ ఆయి రే అంటూ ఒకటే సందడి చేస్తున్నారు.

11 రకాల రంగుల కేళి


మణిపూర్‌లో 'రస్‌రంగ్ హోలీ' పేరుతో 6 రోజుల పాటు రంగుల కేళి సాగుతుంది. మహారాష్ట్రలో 'హోలికా దహనం'తో 'రంగ పంచమి' పేరుతో 'దహి హండీ' క్రీడలు వంటివి పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. బంగాల్, ఒడిసాలో 'డోల్ పూర్ణిమా' పేరుతో రంగులు చల్లుకుని, సంప్రదాయ ఆటపాటల్లో మునిగి తేలుతారు. హర్యాణాలో 'దహీ హండీ'తో పాటు 'భాభీ దేవర్ హోలీ' పేరుతో రంగుల్లో మునిగి తేలుతారు. ఫోక్ సాంగ్స్, బురద, రంగులతో కన్నుల పండువగా భోజ్‌పురి హోలీ సాగుతుంది. డోలు వాయిస్తూ, చిందేస్తూ సాగే భోజ్‌పురి హోలీ హై ఎనర్జిటిక్ ఫెస్టివల్.



ఇక్కడ హోలీ రెండు నెలలు

'కుమయూన్ హోలీ' అంటూ ఉత్తరాఖండ్‌లోని కుమయూన్ ప్రాంతంలో రెండు నెలలపాటు సాగే పండుగలో 'బైఠక్ హోలి, ఖడి హోలీ, మహిళా హోలీ' పేరుతో పెద్ద ఎత్తున సాగుతుంది. మధుర, బృందావన్, నందగావ్, బర్సానాల్లో 'లఠ్ మార్ హోలీ'ని చూడాల్సిందే కానీ వర్ణించడం మాటలకందని అనుభూతి. సాధారణంగా ఈ రంగుల పండుగకు వితంతువులు దూరంగా ఉంటారు, కానీ బృందావన్‌లో మాత్రం వితంతు వులు భారీ ఎత్తున హోలీ జరుపుకోవడం ఆనవాయితీ.







సీనియర్ పాత్రికేయుడు రమేశ్‌బాబు కన్నుమూత



హైదరాబాద్, ఫిబ్రవరి 24:

సీనియర్ పాత్రికేయుడు గుత్తికొండ రమేశ్‌బాబు (69) తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన... శనివారం ఉదయం హైదరాబాద్ సుందరనగర్‌లోని తన స్వగృహంలో మరణించారు. 1949లో జన్మించిన రమేశ్‌బాబు.. తొలుత ఆంధ్రజ్యోతి దినపత్రికతో తన పాత్రికేయ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తర్వాత ఈనాడులో చేరి అక్కడ సుదీర్ఘకాలం 'న్యూస్‌టుడే' వార్తాసంస్థకు ఎండీగా పనిచేశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల సమాచార వ్యవస్థను ఒక క్రమపద్ధతికి తీసుకురావడంలో రమేశ్‌బాబు కృషి చేశారు. మొత్తం నాలుగు దశాబ్దాల పాటు పాత్రికేయ వృత్తిలో తనదైన ముద్ర వేశారు. ఆయన మృతిపట్ల పలువురు సీనియర్ పాత్రికేయులు, పాత్రికేయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు. విదేశాలలో ఉన్న ఆయన పిల్లలు ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటారని, ఎర్రగడ్డ శ్మశానవాటికలో సోమవారం ఉదయం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆత్మీయుల సందర్శనార్థం ఆయన మృతదేహాన్ని సోమవారం ఉదయం నుంచి ఇంటివద్ద ఉంచుతారని తెలిపారు.



కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు కలకలం

గుడ్డ సంచీలో రెండు బాక్సుల గుర్తింపు

మధిర, ఫిబ్రవరి 24(మనం న్యూస్):



భువనేశ్వర్- ముంబై మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అనుమానిత బాక్సులు కలకలం రేపాయి. ఎస్-11 బోగీలో సీటు కింద ఉన్న ఈ బాక్సులను బాంబులుగా భావించి ప్రయాణికులు టీసీకి తెలియజేశారు. ఒక్కోటీ అరకిలో ఉన్న ఈ రెండు బాక్సులకు బలమైన సీల్ ఉండడంతో ప్రయాణికులలో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో మధిర స్టేషన్‌లో రైలును నిలిపి వాటిని పోలీసులకు సమాచారం అందించారు. బాక్సలను, వాటిపై ఉన్న సీల్‌ను పరిశీలించిన పోలీసులు హైదరాబాద్ నుంచి డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లను పిలిపించారు. వారు మధిర చేరుకుని అత్యంత జాగ్రత్తగా సదరు బాక్సులను ఊరి చివర మైదాన ప్రాంతానికి తరలించి తనిఖీలు జరిపారు. అయితే, బాక్సలపై పెయింట్ దట్టంగా వేయడంతో డాగ్‌స్క్వాడ్ కూడా లోపల ఏముందనే విషయాన్ని పసిగట్టలేకపోయింది.

శనివారం ముంబై వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ దాటిన తర్వాత ఓ సీట్‌కింద ఉన్న రెండు బాక్సులను ప్రయాణికులు గుర్తించారు. ఓ గుడ్డ సంచీలో ఉన్న ఈ రెండు బాక్సులలో పేలుడు పదార్థం ఉండొచ్చనే సందేహంతో రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. ఆ బోగీలో ఉన్న టీసీ ఈ విషయాన్ని విజయవాడ కంట్రోల్ రూంకు చేరవేశాడు. రైలులో అనుమానాస్పద వస్తువుపై సమాచారం అందడంతో వెంటనే స్పందించిన అధికారులు మధిర స్టేషన్‌లో ట్రైన్‌ను ఆపించారు. ఉదయం 6:30 గంటల సమయంలో ట్రైన్ మధిర రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే ఆ బోగి వద్దకు వెళ్ళి ట్రైన్‌లో ఉన్న సంచిని కిందికి దించి రైలును పంపించివేశారు. రైల్వే పోలీసుల నుంచి అందిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేసి స్థానిక పోలీసులు స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో ఖమ్మం నుండి డ్వాగ్ స్కాడ్, బాంబ్ డిఫ్యూజ్డ్ టీమ్ హుటాహుటిన మధిరకు వచ్చి బాంబులు ఉన్న బాక్సులను పరిశీలించింది. అయితే ఆ బాక్సులకు వేసిన ఎనామిల్ పెయింట్ కారణంగా జాగిలాలు కూడా ఆ బాక్సులలో పేలుడు పదార్థాలు ఉన్నదీ లేనిదీ పసిగట్టలేకపోయింది. దీంతో ఆందోళన మరింత పెరిగింది. విషయం క్లిష్టంగా ఉండటంతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక టీమును రప్పించి పరీక్షించాలని నిర్ణయించారు. సంచీలో బాక్సులు..

పేలుడు పదార్థాలు ఉన్నట్లు అనుమానిస్తున్న బాక్సులను అనంతపురానికి చెందిన శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ వారి సంచీలో పెట్టి సీటు కింద పెట్టారని పోలీసులు తెలిపారు. భువనేశ్వర్ నుంచి వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సంచీ కనిపించడం పలు సందేహాలకు తావిస్తోంది. ఈ బాక్సులు ఎవరు ఎక్కడ పెట్టారు? ఎక్కడి నుంచి ఎక్కడికి పంపిస్తున్నారనే సందేహాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ బాక్సులలో ఉన్నది పేలుడు పదార్థమేనని తేలితే ఎస్ 11 బోగి రిజర్వేషన్ జాబితా తీసుకొని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. ఏదేమైనా మధిర ప్రాంతంలో తొలిసారి ఈ తరహా సంఘటన చోటుచేసుకోవడంతో సంచలనం రేగుతోంది. కాగా, హైదరాబాద్ నుంచి ప్రత్యేక బాంబ్ స్క్వాడ్ వచ్చి పరిశీలించాకే బాక్సుల్లో ఏముందనే విషయం తెలుస్తుందని పోలీస్ అధికారులు తెలిపారు.

ఖమ్మంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

మధిరలో అనుమానిత బాక్సులను దించివేసిన తర్వాత ఖమ్మం చేరుకున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. రైలులోని అన్ని బోగీలలో అణువణువూ సోదాలు జరిపారు. ప్రయాణికుల బ్యాగులనూ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గతంలో కూడా ఇదే ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్మగ్లింగ్ చేస్తుంటే అనేక సార్లు మధిర ప్రాంతంలోనే పట్టుకోవడం జరిగింది. తాజా ఘటనతో రైళ్ళలో భద్రతపై పోలీసుల డొల్లతనం మరోసారి రుజువైందని ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు.

కాల్పుల విరమణకు పాక్ తూట్లు

ఉరీ ఆర్మీ పోస్టుపై కాల్పులు

శ్రీనగర్, ఫిబ్రవరి 24: పాకిస్థాన్ బలగాలు మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. జమ్ము కశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌లో గల ఆర్మీ పోస్టుపై పాక్ సైనికులు కాల్పులకు దిగారు. శనివారం ఉదయం 11.50 గంటల సమయంలో ఉన్నట్టుండి పాక్ రేంజర్లు తూటాల వర్షం కురిపించగా.. తక్షణం అప్రమత్తమైన భారత బలగాలు ఈ కాల్పులను సమర్థంగా తిప్పికొట్టాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేదని ఆర్మీ అధికారి ఒకరు తెలిపారు. కాగా, 2016లో 271 సార్లు సరిహద్దుల్లో కాల్పుల విరమణకు తూట్లుపొడిచిన పాక్... 2017లో 860 సార్లు ఈ దుశ్చర్యకు పాల్పడిందని పేర్కొన్నారు.

నెలజీతం బోనస్..!

(మొదటి పేజీ తరువాయి)

35,749 మంది ఉద్యోగులకు ఒక నెల మూల వేతనం అదనంగా అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేవలం వంద రోజుల వ్యవధిలోనే రెవెన్యూ ఉద్యోగులు రేయింబవళ్లు పనిచేసి భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ముఖ్యమంత్రి అభినందించారు. విధి నిర్వహణ పట్ల ఇంతటి చిత్తశుద్ధి, అంకితభావం కలిగిన ఉద్యోగులుండడం తెలంగాణ ప్రజలు, రైతుల అదృష్టంగా ఆయన అభివర్ణించారు. తెలంగాణ ప్రజలు, రైతుల పక్షాన రెవెన్యూ ఉద్యోగులకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం, కొత్త పాస్ పుస్తకాల పంపిణీపై శనివారం ప్రగతిభవన్‌లో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... ''దాదాపు 80 ఏళ్లుగా భూ రికార్డుల నిర్వహణ సరిగా లేదు. భూమి క్రయవిక్రయాలు, యాజమాన్యంలో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో భూ రికార్డులు గందరగోళంగా మారాయి. తెలంగాణలో పంట పెట్టు బడి పథకం అమలు చేసేందుకు ఏ భూమికి ఎవరు యజమానో కచ్చితంగా తేలాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో భూ రికార్డులను సరిచేసి, పూర్తి పారదర్శకంగా పథకం అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కేవలం వంద రోజుల్లోనే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు గ్రామాల్లో తిరిగి, రైతులతో మాట్లాడి భూమి యాజమాన్య హక్కులపై స్పష్టత తెచ్చారు. సొంత భూములున్న రైతులతో పాటు, అసైన్డ్ దారుల విషయంలో కూడా స్పష్టత సాధించారు. రాష్ట్రంలో 22.5 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచగా, అందులో 20 లక్షల ఎకరాల విషయంలో స్పష్టత వచ్చింది. మిగతా రెండున్నర లక్షల ఎకరాల విషయం లో స్పష్టత కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. కోర్టు కేసుల్లో ఉన్న భూములు, అటవీ-రెవెన్యూ శాఖల మధ్య వివాదంలో ఉన్న భూములు మినహాయిస్తే మిగతా విషయాల్లో పూర్తి సాధించారు. మమూలు సాధారణ విషయం కాదు. దేశంలో ఎవరూ సాధించని ఘనత రెవెన్యూ ఉద్యోగులు సాధించారు. వారికి ప్రోత్సాహకరంగా ఉండేందుకు ఒక నెల మూల వేతనాన్ని అదనంగా అందిస్తాం'' అని సీఎం ప్రకటించారు. ''కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉంటుందో భూ రికార్డుల ప్రక్షాళన నిరూపించింది. చిన్న జిల్లాలుండడం వల్లనే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించడం సాధ్యమైంది. కొత్త కలెక్టర్ల ప్రతిభకు, పనితీరుకు ఇది గీటురాయి. కలెక్టర్లు తమ విధిని గొప్పగా నిర్వహించారు'' అని సీఎం అభినందించారు. ''తెలంగాణ రాష్ట్రంలో అధికశాతం మంది అధికారులు, ఉద్యోగులు నిజాయితీగా, చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఉద్యోగుల పనితీరులో ఎంతో మార్పు వచ్చింది. కష్టపడి పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడానికి ఎంతో కృషి చేస్తున్నారు. వైద్య సిబ్బంది ఎంతగానో కష్టపడడం వల్ల ప్రజారోగ్యం మెరుగుపడింది. గతంలో రెండు లక్షల లోపే ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగేవి. ఇప్పుడా సంఖ్య చాలా పెరిగింది. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్లు, రోడ్ల నిర్మాణంలో పంచాయితీ రాజ్, ఆర్ అండ్‌బీ అధికారులు, ఇంకా ఇతర శాఖల అధికారులు చాలా కష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలు కూడా అత్యంత పారదర్శకంగా ఉన్నాయి. అవినీతికి ఆస్కారం ఇవ్వని విధంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయి. ఈ పథకాలను అమలు చేస్తున్న ఉద్యోగులకు మంచి వేతనాలు లభించాలన్నదే ప్రభుత్వ అభిమతం. అందుకే తెలంగాణ వచ్చిన వెంటనే ఉద్యోగులకు 42 శాతం ఫిట్ మెంటుతో వేతన సవరణ చేశాం. తెలంగాణ ఇంక్రిమెంటు ఇచ్చాం. భవిష్యత్తులో కూడా ఉద్యోగులకు మంచి జీతభత్యాలు ఇవ్వాలని నిర్ణయించాం'' అని ముఖ్యమంత్రి చెప్పారు. సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు జీఆర్ రెడ్డి, సీనియర్ అధికారులు ఎస్.నర్సింగ్‌రావు, రాజేశ్వర్ తివారి, రామకృష్ణ రావు, శివశంకర్, వాకాటి కరుణ, స్మితా సభర్వాల్, కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాపై శ్రద్ధ అమోఘం

(మొదటి పేజీ తరువాయి)

తగిన ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ప్రజారోగ్యం కూడా ముఖ్యమని, పేదల ఆరోగ్య రక్షణలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆరోగ్యబీమా పథకం ఫార్మా పరిశ్రమ కోసం కాదని, ప్రజారోగ్యం కోసమేనని చెప్పారు. ఆధునిక సాంకేతికత సాయంతో దేశంలో పెట్టుబడులు పెట్టే సంస్థల పర్యవేక్షణకు చర్యలు చేపట్టడమేగాక వాటికి సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మందుల ధరలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. ఈ దిశగా జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ధరలు నిర్ణయిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ఫార్మా సంస్థల ఎన్‌పీపీఏతో చర్చించి తక్కువ ధరల్లో ప్రజలకు మందులు అందించేందుకు కృషిచేయాలని కోరారు. దేశవ్యాప్తంగా జిల్లాల స్థాయిలోనూ వాణిజ్య సౌలభ్యం మెరుగుపడితే ఆయా రాష్ట్రాల్లో స్థూల రాష్ట్రీయోత్పత్తి (జీఎస్‌డీపీ) కూడా వృద్ధి చెందుతుందన్నారు. తద్వారా స్థూల జాతీయోత్పత్తి వృద్ధిచెంది దేశం ప్రగతిపథంలో దూసుకెళ్లగలదని పేర్కొన్నారు.

బల్క్ డ్రగ్ కూడలి హైదరాబాద్

తెలంగాణ రాజధాని హైదరాబాద్ వ్యాక్సిన్ రాజధానిగా అవతరించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. అలాగే బల్క్ డ్రగ్ కూడలిగా ప్రసిద్ధికెక్కిందని, వ్యాక్సిన్ తయారీలో అగ్ర స్థానంలో నిలిచిందని తెలిపారు. ఔషధ ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతయినా ఉందని చెప్పారు. కొత్త ఆలోచనలతో వస్తున్న యువతను ప్రోత్సహిస్తూ 'రిచ్' (రీసెర్చ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్) ముందుకెళ్తోందని తెలిపారు. రిచ్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఏడాది వ్యవధిలోనే ఈ సంస్థ గొప్ప పరిశోధనలు చేసిందని ప్రశంసించారు. పరిశోధన సంస్థలు, పారిశ్రామిక భాగస్వాములు, స్టార్టప్ కంపెనీలు, యువత... రిచ్‌ద్వారా మమేకమైనట్లు పేర్కొన్నారు. రిచ్‌ద్వారా వీరంతా మంచి విజయాలు సాధించగలరని చెప్పారు. ఇక రాష్ట్రం తదుపరి దశవైపు పయనం ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. మేగ్నటిక్ పార్క్, ఐటీ టెక్, తయారీ రంగాల్లో రాణించాల్సి ఉందన్నారు. మూడున్నరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు.

పాలమూరులో కరువుకు గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)



నీటిపారుదల మంత్రి హరీశ్ రావు ప్రజలను కోరారు. ఈమేరకు వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో శనివారం జరిగిన వివిధ సభలలో కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీ నేతల వైఖరిని తూర్పారబట్టారు. కాంగ్రెస్ పార్టీలోకి నాగం జనార్దన్ రెడ్డి చేరబోతుంటే దామోదర రెడ్డి వ్యతిరేకిస్తున్నాడు. రేవంత్‌ను డి.కె. అరుణ వ్యతిరేకిస్తోంది.. ఇలా అధికారంలో లేకున్నా కుర్చీల కోసం, పదవుల కోసం కుమ్ములాడుకునే స్వభావాన్ని మాత్రం వారు వదులుకోలేదని మంత్రి ఎద్దేవా చేశారు. ఇలాంటి వారికి అధికారం కట్టబెడతారా అంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సొంతపార్టీ ముఖ్యమంత్రులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, మర్రి చెన్నారెడ్డి, రోశయ్యలందరినీ గద్దె దింపిన ఘన చరిత్ర కాంగ్రెస్ సొంతమని విమర్శించారు. అధికార దాహం తప్ప ప్రజల గురించి కాంగ్రెస్ నాయకులు ఎన్నడూ ఆలోచించరని హరీశ్ రావు విమర్శించారు.

కరువుకు శాశ్వతంగా గుడ్‌బై

పాలమూరు జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలిస్తామని ఇరిగేషన్ మంత్రి ప్రకటించారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో కృష్ణాలో నికర జలాలన్నీ పాలమూరు ప్రాజెక్టులకు దక్కనున్నాయన్నారు. ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో గోదావరిని మళ్లిస్తామని తెలిపారు. కృష్ణా జలాలలో తెలంగాణ వాటాపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో న్యాయ పోరాటం చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. త్వరలోనే ట్రిబ్యునల్ తీర్పు తెలంగాణ రైతాంగానికి అనుకూలంగా రానుందని చెప్పారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై వివిధ కోర్టుల్లో వందలాది కేసులు వేశారని చెప్పారు. మనిషికి ఆక్సిజన్ లాగే వ్యవసాయరంగానికి నీరే ఆధారమన్నారు. అలాంటి ఆక్సిజన్ దొరకకుండా, రైతుల నోటి కాడ బుక్కను లాక్కునే కుట్రలు, కుతంత్రాలకు కాంగ్రెస్ నాయకులు పాల్పడడం జిల్లా దురదృష్టమని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కారణంగా, కేసీఆర్ సీఎంగా ఉన్నందుకు పాలమూరు స్వరూపమే మారిపోయిందన్నారు. నాలుగు ఆన్ గోయింగ్ ప్రాజెక్టులనుంచి గత సంవత్సరం 6.50 లక్షల ఎకరాలకు సాగునీరందించడం ఒక రికార్డని మంత్రి చెప్పారు. పాలమూరులో ఫిబ్రవరి చివరిలోనూ చెరువులు మత్తడి దుంకుతున్నట్టు చెప్పారు. ఎక్కడ చూసినా పచ్చని పొలాలు దర్శనమిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్‌లో ఈ యేడాది 10లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, జూరాల ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా మొత్తం 20లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడం సీఎం కేసీఆర్ సంకల్పమని మంత్రి చెప్పారు.

కంది కొనుగోలుపై కేంద్రం పరిమితి

కేంద్రం చెప్పే మాటలకు, చేతలకు పొంతనలేదని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణలో పండించిన కంది కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం పరిమితులు విధించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం 2 లక్షల మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేయగా.. కేంద్రం 50 వేల మెట్రిక్ టన్నుల కందులే కొన్నట్టు మంత్రి తెలిపారు. ఏపీ, కర్నాటక కందులు కొనడంలేదని, అక్కడి నుంచి పెద్ద ఎత్తున కందులు మన మార్కెట్లకు వస్తున్నాయని చెప్పారు. వాటిని కట్టడి చేయాలని కోరారు. కర్నూలు, కర్నాటక రైతులు తెలంగాణ రైతుల పాసుబుక్కులతో అమ్ముతున్న సంఘటనలు ఉన్నందున రైతులు సహకరించవద్దని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

ముదిరాజ్ భవనానికి భూమి కోసం

సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 24: తెలంగాణ ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి హైదరాబాద్ నగరంలో స్థలం, నిధులు కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాశ్ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ విందులో

పేలిన గిఫ్ట్ బాంబ్

వరుడి మృతి.. వధువుకు తీవ్రగాయాలు

భువనేశ్వర్, ఫిబ్రవరి 24:



కోటి ఆశలతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకున్న ఓ కొత్త జంట ఆశలన్నీ ఆవిరయ్యాయి.. ఓ అగంతుకుడు ఇచ్చిన బహుమతి పేలడంతో రిసెప్షన్ వేడుక విషాదంగా మారింది. ఈ ప్రమాదంలో వరుడితో పాటు, ఓ వృద్ధురాలు మృత్యువాత పడగా, వధువు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఒడిసాలోని బోలాంగిర్ జిల్లాలో గల పట్నాగఢ్‌లో ఈ విషాదం చోటు చేసుకుంది. ఈ నెల 18న జరిగిన పెళ్లికి అతిథులు గిఫ్టులిచ్చారని, పెళ్లి తర్వాత ఇంటికెళ్లి వాటిని ఓపెన్ చేస్తుండగా ఓ గిఫ్ట్ అకస్మాత్తుగా పేలిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ బహుమతిని ఎవరో తెలియని వారే ఇచ్చారని వివరించారు. అయితే, సంఘటన స్థలంలో గిఫ్ట్ పాకెట్ లేదని, పార్శిల్ బాంబు మాత్రమే ఉందని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని బోలాంగిర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారని, వరుడి పరిస్థితి విషమించడంతో బుర్లా ఆస్పత్రికి తరలిస్తుండగా తుది శ్వాస విడిచాడని వివరించారు.


లవ్ వైరస్

యువతపై సినిమాల ప్రభావం



(మొదటి పేజీ తరువాయి)

తేడా తెలియని వయసులోనే ప్రేమలో పడిపోతున్నారు. బాయ్‌ఫ్రెండ్ / గాళ్‌ఫ్రెండ్ ఉండటాన్ని ఓ స్టేటస్ సింబల్‌గా భావిస్తున్నారు. లేకుంటే అదో వెలితిగా, చిన్నతనంగా చూస్తున్నారు. ప్రేమను ఒక నిత్యావసర వస్తువులా భ్రమిస్తున్నారు. ఈ ప్రేమ ఓ వైరస్‌లా వ్యాపిస్తోంది. కుగ్రామాలు మొదలు పట్టణాలు, నగరాలు, మెట్రోలు అన్న తేడా లేకుండా 'ప్రేమికుల రాజ్యం' విస్తరిస్తోంది. చాలామంది టీనేజ్‌లోకి రావడం ఆలస్యమన్నట్టు గాళ్‌ఫ్రెండ్ / బాయ్ ఫ్రెండ్‌ను కోరుకుంటున్నారు. పాఠశాల స్థాయి నుంచే ఈ ప్రేమాయణం మొదలవుతోంది. కాలేజీల్లో సంగతి చెప్పనక్కర్లేదు. పెళ్లిపీటల వరకూ నడిచే ప్రేమికుల కంటే మధ్యలో కటీఫ్ చెప్పేవారి సంఖ్య ఎన్నోరెట్లు ఎక్కువ. ప్రేమ పేరుతో జరుగుతున్న హింసాత్మక సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.



దారి తెన్నూ లేకుండా..

తమ పిల్లలు ప్రయోజకులు కావాలని, ఉన్నత స్థానానికి వెళ్లాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. కానీ ఉజ్వల భవిష్యత్‌కు నిచ్చెనగా మారే వయసులో చాలామంది దారి తప్పుతున్నారు. దీనికి ప్రేమ కూడా ఓ కారణం. ప్రేమ పేరుతో విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారు. అసలు లక్ష్యాన్ని మరిచి ఇదే జీవితమనే భ్రమలో గడుపుతున్నారు. చదువును నిర్లక్ష్యం చేసి.. ఫలితంగా ఉద్యోగాల వేటలో వెనుకబడుతున్నారు. పోనీ జీవితాంతం కలిసుంటారా అంటే చాలా తక్కువ. ప్రేమను సరదాగా భావించేవారే ఎక్కువ. ప్రేమ ఒకరితో పెళ్లి మరొకరితో అనే భావించేవారు కొందరు.. ఒకరి కంటే ఎక్కువమందితో ప్రేమలో పడేవారు మరికొందరు.. ఎక్కడికక్కడ కటీఫ్ చెబుతూ కొత్త ప్రేమికులను వెతుక్కునేవారు.. ఇలా భిన్న మనస్తత్వాలు గలవారు ప్రేమకు అర్థాన్నే మార్చేస్తున్నారు.

సినిమా అన్నాక అందులో హీరో హీరోయిన్లు.. వారి మధ్య ప్రేమ.. పాటలు ఉండాల్సిందే. ఇలాంటి సన్నివేశాలు లేని భారతీయ సినిమాలు చాలా అరుదు. వీటి ప్రభావం పిల్లల మీద చాలా ఎక్కువగా ఉంటోందని.. సినిమాల్లో చూపించినట్లుగా అత్యంత సులభంగా ప్రేమలో పడిపోయే అమ్మాయిలు, అబ్బాయిలు ఉండరన్న వాస్తవాన్ని గమనించలేకపోతున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో సంచలనం రేపిన ప్రియా వారియర్ కన్నుగీటే సన్నివేశం, పాట చూసి ఎంతోమంది అలా ప్రయత్నించారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహితుల్లా ఉండాలని, ప్రేమ/ఆకర్షణ, ఆశయాల గురించి వివరంగా చెప్పాలని సూచిస్తున్నారు.

ప్రేమ పేరుతో హింస

ప్రేమించలేదని అమ్మాయిలను వేధించడం, దాడి చేయడం.. తనను ప్రేమించి మరొకరితో చనువుగా ఉంటోందని ఏకంగా చంపేయడం.. ప్రేమించి మోసం చేశాడని అమ్మాయిలు ఆందోళన చేయడం.. ప్రేమ పేరుతో వంచించి రెండు, మూడు పెళ్లిళ్లు చేసుకోవడం.. ప్రేమించి పెళ్లి చేసుకున్నాక భార్య/భర్తలు వివాహేతర సంబంధం పెట్టుకుని హత్య చేయించడం ఇలాంటి విషయాలు నిత్యం వెలుగు చూస్తున్నాయి.

జీవితాంతం తోడు నీడగా..

మొదటి లైన్‌లో సినీ కవి రాసినట్టుగా ప్రేమ.. కులమతాలకు, ప్రాంతాలకు, భాషలకు, జాతీయత, పేద/ధనిక తారతమ్యాలకు అతీతమైనది.

లక్ష్యం మరవని ప్రేమికులు, వివాహ బంధంతో ఒక్కటైన వారు.. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినవారు.. జీవితాంతం తోడు నీడగా కలిసున్నవారు ఎందరో ఉన్నారు. కులాలకు అతీతంగా పెళ్లి చేసుకున్నవారు.. భవిష్యత్ తరాల వారికి ఆదర్శంగా ఉన్న వారూ ఉన్నారు.

ప్రేమలో 4 దశలు

1. భాగస్వామి ఎంపిక

ముందుగా మనతో కలిసి జీవించేవారు ఎవరైతే సరైన వాళ్లో ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఒక గది నిండా బోలెడంత మంది ఉన్నా.. వాళ్లలో ఎవరో ఒకరే మనల్ని బాగా ఆకర్షిస్తారు. మన జన్యువులు అవతలి వాళ్ల జన్యువులతో కలుస్తాయని శరీరం గ్రహించడం వల్లే ఆ ఆకర్షణ అనేది పుడుతుంది. దాన్ని సరిగ్గా గుర్తించి, అవతలి వాళ్లను ఎంచుకోగలగాలి.

2. ప్రేమలో పడటం

ప్రతివాళ్లూ దీని గురించే మాట్లాడుతారు. ఈ దశలో వాస్తవాలేంటో చూడం.. ప్రేమ గుడ్డిది. వాళ్లు మనవాళ్లు కావాలని ఆశిస్తుంటాం.మెదడులో ఉండే మోనోఅమైన్లు అనే రసాయనాల కారణంగా.. మనం ప్రేమలో పడతాం, లేదా అవతలివాళ్లతో ప్రేమలో పడినట్లు భావిస్తాం. అది నిజమైన ప్రేమేనా.. కాదా అనే విషయాన్ని గుర్తించాలి.

3. ప్రేమ నుంచి బయటపడటం

ప్రేమలో పడిన చాలామంది దాన్నుంచి బయట కూడా పడతారు. చాలా గాఢమైన ప్రేమలో మునిగిపోయాం అనుకునేవాళ్లు సైతం ఒకోసారి ఆ ప్రేమ నుంచి బయటకు వచ్చేస్తారు. ఒక్కసారి ఆకర్షణ మాయమైందంటే.. అవతలి వ్యక్తి మనకు నచ్చడం మానేస్తారు. అప్పుడు మన ఎంపిక తప్పన్న విషయం తెలుస్తుంది. ఎంత త్వరగా బయటకు వచ్చేస్తామా అని చూస్తామట.

4. నిజమైన ప్రేమ

ఆకర్షణ ముగిసే సమయానికి కూడా.. వాళ్లే మనకు సరైనవాళ్లని నిర్ణయించుకోగలిగితే మాత్రం అది అసలుసిసలైన ప్రేమ అని అర్థం. మధ్యలో గిల్లికజ్జాలు వచ్చినా.. ఆ ప్రేమ కలకాలం నిలబడుతుందట. ఏళ్లు గడిచేకొద్దీ ప్రేమ మరింత బలోపేతం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అప్పుడు వాళ్లు చిరకాలం తమ బంధాన్ని కొనసాగిస్తారని, అదే నిజమైన ప్రేమ అని అంటున్నారు.

నాన్న మళ్లీ వస్తారు!

అమెరికా అధ్యక్షుడి కొడుకు జూనియర్ ట్రంప్



న్యూఢిల్లీ/ముంబై, ఫిబ్రవరి 24:

''మా నాన్న మళ్లీ వ్యాపారంలోకి వస్తారు. ప్రస్తుతాన్ని కెతే ఆయన అధ్యక్ష పదవి మా కుటుంబ స్థిరాస్తి వ్యాపారానికి ప్రతికూలమే. ఆ పదవీ కాలం ముగిశాక మా తండ్రి తిరిగి పగ్గాలు స్వీకరిస్తారు'' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమారుడు జూనియర్ ట్రంప్ చెప్పారు. అమెరికా స్థిరాస్తి వ్యాపార దిగ్గజం 'ట్రంప్ ఆర్గనైజేషన్'కు భారత భాగస్వామిగా ఉన్న లోధా గ్రూప్ శుక్రవారం రాత్రి ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత స్థిరాస్తి విపణి తమకెంతో ప్రధానమైనదని చెప్పారు. తమ తండ్రి పదవీకాలం ముగిసేసరికి ఇది మరింత ప్రాముఖ్యంగలదిగా మారుతుందని సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడి హోదాలో జూనియర్ ట్రంప్ ప్రకటించారు. భారత్‌కు తాను వ్యాపారవేత్తగానే వచ్చానని, రాజకీయాలు మాట్లాడటానికి రాలేదని జూనియర్ ట్రంప్ అన్నారు. 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక నిర్వహించిన న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రపంచ వాణిజ్య సదస్సులో శుక్రవారం రాత్రి ఆయన ప్రసంగించారు. భారతీయులన్నా, ఇక్కడి మీడియా అన్నా తనకెంతో ఇష్టమని చెప్పారు. ఎన్ని కష్టాలున్నా భారతీయులు చిరునవ్వు చిందిస్తారని కితాబిచ్చారు. ఇక్కడి మీడియా అంటే తనకెంతో ఇష్టమని, ఈ దేశ చరిత్రలో ఇలాంటి వ్యాఖ్య చేసిన తొలి వ్యక్తిని బహుశా తానే కావచ్చునని చలోక్తి కూడా విసిరారు. కలహశీల, కాఠిన్య అమెరికా మీడియాతో పోలిస్తే ఇక్కడి ప్రసార, పత్రికా మాధ్యమాలు ఎంతో సౌమ్యం, సరళమైనవని కొనియాడారు.

బాధ్యులెవరో 60 రోజుల్లో తేల్చండి

- పీఎన్‌బీ కుంభకోణంపై ప్రధానికి కాంగ్రెస్ డిమాండ్


కపిల్‌సిబల్ (ఫైల్)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పీఎన్‌బీలో చోటు చేసుకున్న వేల కోట్ల కుంభకోణానికి బాధ్యులెవరో 60 రోజుల్లో తేల్చాలని ప్రధాని నరేంద్రమోదీకి కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ కుంభకోణానికి కేంద్ర ఆర్థిక శాఖదా? ఆర్బీఐదా? బ్యాంకు యాజమాన్యానిదా? తేల్చాలని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ పేర్కొన్నారు. ''కుంభకోణం సూత్రధారి నీరవ్‌మోదీపై ఎందుకంత ప్రేమ చూపిస్తున్నారో తెలుసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. నీరవ్‌మోదీ దేశం విడిచి వెళ్లేందుకు ఎలా అనుమతించారో తెలుసుకోవాలకుంటున్నారు'' అని పేర్కొన్నారు. ''పీఎన్‌బీ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు రూ.21 వేల కోట్ల నష్టం వాటిల్లింది. భవిష్యత్తులో మరిన్ని కుంభకోణాలు వెలుగు చూస్తాయి. ఇప్పుడిప్పుడే ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్(ఓబీసీ)లో రూ.390 కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది'' అని సిబల్ పేర్కొన్నారు. ఇలాంటి పెద్ద పెద్ద కుంభకోణాలు వెలుగు చూస్తున్నప్పటికీ.. అతి ఖరీదైన చౌకీదార్(పర్యవేక్షకుడు- ప్రధాని) మాత్రం ఎన్నికల ర్యాలీల్లో పాల్గొంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావట్లేదని వ్యాఖ్యానించారు.

మా హక్కులు రక్షించరూ!

- సుప్రీం కోర్టును ఆశ్రయించిన చిదంబరం
- ఎన్డీఏ సర్కారు కక్ష సాధిస్తోందని ఆరోపణ
- ఎఫ్ఐఆర్ లేకుండానే విచారణేమిటని ప్రశ్న


చిదంబరం (ఫైల్)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఎన్డీఏ సర్కారు తమ హక్కులను కాలరాస్తోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి చిదంబరం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. వ్యక్తిగత గోప్యతసహా ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని ఆరోపించారు. ఎయిర్‌సెల్-మాక్సిస్, ఐఎన్ఎక్స్ మీడియా కేసులలో తన కుమారుడు కార్తీకి సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీచేసిన నేపథ్యంలో ఈ పిటిషన్ వేశారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా సీబీఐ, ఈడీ పదేపదే సమన్లు జారీ చేయడమేగాక శోధన పేరిట, ప్రశ్నించే సాకుతో తమ కుటుంబం మొత్తాన్నీ విసిగిస్తున్నాయని సర్వోన్నత న్యాయస్థానానికి మొరపెట్టుకున్నారు. ఇదంతా చాలదన్నట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ల వంటి ఆస్తులను చట్టవిరుద్ధంగా కేసులకు జోడించడం, దురుద్దేశపూర్వకంగా మీడియాకు తప్పుడు సమాచారం చేరవేత వంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. ఇలా అనేక రకాలుగా తనను, తన కుమారుణ్ని, తమ కుటుంబంలోని ఇతర సభ్యులను వేధిస్తూ, అవమానిస్తూ, ఆవేదనకు గురిచేస్తున్నారని ఆక్రోశించారు. తమను ఇలా మానసికంగా హింసించడంగాక తమ కుటుంబంతో వ్యాపార, సామాజిక సంబంధాలున్నవారినీ చికాకు పెడుతున్నారని పేర్కొన్నారు. అందుకే తమకు రాజ్యాంగరీత్యా సంక్రమించిన ''చట్టం ముందు సమానత్వం, వాక్-సభా స్వాతంత్ర్యాలు, జీవన-వ్యక్తిగత స్వేచ్ఛ, గోప్యత తదితర ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.


తాను, తన కుటుంబం సగౌరవంగా జీవించేలా ప్రభుత్వాన్ని నియంత్రించాలని కోరారు. సీబీఐ, ఈడీ చేపడుతున్న అనుచిత చర్యలన్నీ ప్రభుత్వ ప్రేరేపితమేనని, వీటి అసలు లక్ష్యం తానేనని పేర్కొన్నారు. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే దర్యాప్తు పేరిట తనను, తన కుమారుడిని ఈ రెండు సంస్థలూ ఎలా విచారిస్తాయంటూ చట్టపరమైన ప్రశ్నను కూడా సుప్రీం కోర్టు ముందుంచారు. ఇలాంటి చట్టవిరుద్ధ విచారణకు ఇక స్వస్తి చెప్పేవిధంగా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

యూపీఏ కాలంలో జీడీపీ అద్భుత వృద్ధి

కాంగ్రెస్ నేతృత్వంలో పదేళ్లపాటు యూపీఏ పరిపాలన సాగినపుడు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వృద్ధి అద్భుతమని చిదంబరం పేర్కొన్నారు. 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక శుక్రవారం నిర్వహించిన ప్రపంచ వాణిజ్య సదస్సు ఈ మేరకు అభిప్రాయపడినట్లు ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. ''పదేళ్ల ప్రగతిని ప్రాతిపదికగా తీసుకుంటే 2004-14 మధ్య యూపీఏ పాలన కాలం జీడీపీ వృద్ధిలో అత్యుత్తమ దశాబ్దమని ఆ సదస్సులో పాల్గొన్న దిగ్గజాలు పేర్కొన్నారు'' అని చిదంబరం వివరించారు. ఆ పదేళ్లలో నాటి ధరల రీత్యా డాలర్ల పరిమాణంలో జీడీపీ వృద్ధి మూడు రెట్లు పెరిగిందని తెలిపారు. అయితే, సదరు సదస్సులో ఈ ప్రశంసలు చేసినవారు ఎవరన్నది ఆయన వెల్లడించలేదు.

ఎల్జీతో మంత్రుల బృందం భేటీ

- పాలన సాఫీగా సాగేందుకు కృషి చేస్తా..
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు బైజాల్ హామీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ప్రభుత్వ వ్యవహారాలు సాఫీగా సాగేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటానని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ తమకు హామీ ఇచ్చారని సీఎం కేజ్రీవాల్ తెలిపారు. పరిపాలన సక్రమంగా సాగేందుకు అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని బైజాల్ తెలిపారు. ఢిల్లీ సీఎస్‌పై దాడి ఆరోపణల నేపథ్యంలో మంత్రులతో సమావేశాలను ఉన్నతాధికారులు బహిష్కరించారు. మూడు రోజులుగా వారెవరూ మంత్రులతో భేటీ కాలేదు. దీంతో పాలన స్తంభించి పోయిందని, పలు కీలక నిర్ణయాలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రుల బృందం పేర్కొంది. ఈ నేపథ్యంలో పరిపాలన వ్యవహారాలు కుంటుపడకుండా చూడాలంటూ సీఎం కేజ్రీవాల్ నేతృత్వంలో ఎల్జీ బైజాల్‌ను కలిసినట్లు తెలిపింది. ఈ సందర్భంగా బ్యూరోక్రాట్లు ఎవరూ మీటింగ్‌లకు హాజరు కావడంలేదని ఎల్జీకి విన్నవించినట్లు వివరించింది. దీనిపై ఎల్జీ సానుకూలంగా స్పందించారని, అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొంది. కాగా, ఇలాంటి సంఘటన మరోసారి పునరావృతం కాబోదని మంత్రుల బృందం ఎల్జీకి హామీ ఇచ్చినట్లు డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా పేర్కొన్నారు. ఎల్జీతో భేటీ అనంతరం సీఎం కేజ్రీవాల్ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయితే, సీఎస్ అన్షు ప్రకాశ్‌పై దాడి ఆరోపణలపై సీఎం కేజ్రీవాల్ క్షమాపణ చెబుతారా అన్న ప్రశ్నకు జవాబిస్తూ.. జరిగిన సంఘటనపై అవాస్తవాలు ప్రచారంలో ఉన్నాయని సిసోడియా పేర్కొన్నారు. దానిపై విచారణ కొనసాగుతోందని వివరించారు.

వాళ్లవల్లే పీఎన్‌బీ కుంభకోణం

నియంత్రణ సంస్థలు, ఆడిటర్లపై జైట్లీ విసుర్లు.. కొన్నివ్యాపార వర్గాల్లో నీతి నియమాలు కొరవడ్డాయి

- పీఎన్‌బీ మోసం నిరాఘాటంగా కొనసాగింది
- పర్యవేక్షణ సంస్థలు యథాలాపంగా పని చేశాయి
- మోసాన్ని ఆపే ప్రయత్నం ఒకవైపు నుంచీ జరగలేదు
- ఇది తీవ్రమైన ఆందోళనకర అంశం: అరుణ్ జైట్లీ
- భారత వ్యవస్థలో రాజకీయ నేతలే బాధ్యులు
- అంతేకానీ..నియంత్రణ సంస్థలు కాదని వ్యాఖ్య
- అవసరమైతే చట్టాలను పటిష్ఠం చేస్తామని వెల్లడి
- పీఎస్‌యూల ప్రైవేటీకరణ ఉండబోదని స్పష్టీకరణ


టైమ్స్ గ్లోబల్ సమ్మిట్‌లో మాట్లాడుతున్న అరుణ్‌జైట్లీ


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ. 11,400 కోట్ల మోసం చోటుచేసుకోవడానికి బ్యాంక్ మేనేజ్‌మెంట్ అలసత్వంతోపాటు, నియంత్రణ సంస్థలు, ఆడిటర్ల వైపు నుంచి పర్యవేక్షణ కొరవడడం కారణమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ప్రభుత్వ రంగంలోని ఆ రెండవ అతిపెద్ద బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టినవారిని వారిని శిక్షించడానికి అవసరమైతే చట్టాన్ని పటిష్ఠపరుస్తామని ఆయన చెప్పారు. పీఎన్‌బీని చుట్టుముట్టిన కుంభకోణంపై 'ఎకనామిక్ టైమ్స్ బిజినెస్ సదస్సు'లో ఆర్థిక మంత్రి మాట్లాడారు.

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటు పరం ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సుస్పష్టం చేశారు. ఇందుకు రాజకీయంగా అనుమతి లభించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. 'ఎకనామిక్ టైమ్స్ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్'లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''బ్యాంకుల ప్రైవేటీకరణ అనేది రాజకీయ ఏకాభిప్రాయంపై ఆధార పడి ఉంది. దాంతోపాటు బ్యాంకింగ్ నియంత్రణ చట్టంలో సవరణలు తేవాల్సి ఉంటుంది. నా ఉద్దేశం ప్రకారం భారతీయ రాజకీయ పార్టీలు ప్రైవేటీకరణ ప్రక్రియకు అంగీకరించవు. అయినా.. ఇది సవాళ్లతో కూడిన నిర్ణయం'' అని జైట్లీ పేర్కొన్నారు.

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటుపరం చేయం: జైట్లీ


కొన్ని వ్యాపార వర్గాలలో నీతి నియమాలు కొరవడడాన్ని ఆయన దుయ్యబట్టారు. బహుళ అంచల ఆడిటింగ్ వ్యవస్థ దీన్ని వేరే విధంగా చూసి ఉండాలి లేదా తన పనిని యథాలాపంగా చేసుకుపోయి ఉండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మోసానికి సూత్రధారిగా భావిస్తున్న వజ్రాల వ్యాపారి, కోటీశ్వరుడు నీరవ్ మోదీ- పీఎన్‌బీ పేరు ప్రస్తావించకుండానే ఆయన విమర్శించారు. ఈ రకమైన మోసం నిరాఘాటంగా సాగిపోతున్నప్పుడు కనీసం ఒక్క వైపు నుంచి కూడా ఆపే ప్రయత్నం జరగకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ''జరుగుతున్న దానిపట్ల ఉన్నత స్థాయి మేనేజ్‌మెంట్లు ముభావంగా ఉండడం లేదా అసలు ఏం జరుగుతోందో తెలియని స్థితిలో ఉండడం కూడా కలవరపరుస్తోంది'' జైట్లీ అన్నారు. ''కనీసం బహుళ అంచల ఆడిటింగ్ వ్యవస్థలోని వారైనా దీన్ని కనిపెట్టి ఉండాల్సింది. వారు జరుగుతున్నదానిని వేరేగా అర్థం చేసుకుని ఉండాలి లేదా తమ పనిని యాదాలాపంగా చేసుకుపోయి ఉండాలి. పర్యవేక్షణ తగినంతగా లేదే'' అని ఆయన చెప్పారు. ''కనుక, ఎవరెవరు ఏం చేశారనేది, చివరకు దర్యాప్తులోనే తేలుతుందని అనుకుంటున్నా'' అని ఆయన చెప్పారు. ''నియంత్రణ సంస్థలు నిర్వహించవలసిన చాలా ముఖ్యమైన పనులున్నాయి. నియమ నిబంధనలను అంతిమంగా నిర్ణయించేది నియంత్రణ సంస్థలే. నియంత్రణ సంస్థలకు మూడవ కన్ను కూడా ఉండాలి. దాన్ని అవి నిరంతరం తెరచి ఉంచాలి'' అని జైట్లీ పేర్కొన్నారు. ''కానీ దురదృష్టవశాత్తు, భారతీయ వ్యవస్థలో మేం రాజకీయ నాయకులం జవాబుదారీ వహిస్తున్నాంకానీ, నియంత్రణ సంస్థలు కాదు'' అని మంత్రి వ్యాఖ్యానించారు. మోసాలు జరిగినప్పుడు ఎక్కడ లొసుగులు ఉన్నాయో అక్కడ నిబంధనలను పటిష్ఠపరచవలసి ఉందని, అవసరమైతే మోసకారులను బోనులోకి ఎక్కించేందుకు అన్ని తీవ్రమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. పీఎన్‌బీ పరిణామం నేపథ్యంలో విలువలతో కూడిన వ్యాపారం/ వాణిజ్యం చేసే అలవాటును భారతీయ సంస్థలు అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ''ఎవరైతే లక్ష్యాన్ని మరిచి ప్రవర్తిస్తారో.. వారు తప్పనిసరిగా వాణిజ్య పరంగా, పౌర పరంగా పర్యవసానాలు ఎదుర్కొనక తప్పదు'' అని పేర్కొన్నారు. ''అప్పు ఇచ్చే వారు- తీసుకునేవారి మధ్య అనైతిక బంధానికి ఇక చరమగీతం పడాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన దివాళా, అప్పుతీర్చలేని సంస్థలకు చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకుని అమ్మకానికి పెడుతున్నారు. ఇది మంచి పద్ధతే'' అని జైట్లీ చెప్పారు. భారత్‌లో ముఖ్యంగా విలువలతో కూడిన వ్యాపారం చేయడం ప్రధాన సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏం చేస్తుందని? ప్రశ్నించే బదులు విలువలతో కూడిన వ్యాపారంపై దృష్టిసారిస్తే మంచిదని ఈ సందర్భంగా మంత్రి అభిప్రాయపడ్డారు. అనేక సంస్థలు వ్యాపారపరంగా నష్టపోయిన వాటికంటే.. ఉద్దేశపూర్వకంగా నష్టపోయిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. బ్యాంకింగ్‌లో ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకోవడంతో ఈ రంగంలో తీసుకుంటున్న సంస్కరణలు అంతకంతకూ వెనుకబడి పోతున్నాయని అన్నారు.

నీరవ్ కేసులో మరో 523 కోట్ల ఆస్తులు అటాచ్


నీరవ్ మోదీ

ముంబై/ న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)ను వేల కోట్లు ముంచిన కేసులో నీరవ్ మోదీకి గ్రూప్‌నకు చెందిన రూ.523 కోట్ల విలువైన ఇళ్లను, భూమిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం అటాచ్ చేసింది. ఇందులో మోదీకి చెందిన 21 ఆస్తులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అటాచ్ చేసిన వాటిలో ఓ పెంట్‌హౌజ్, ఓ ఫార్మ్‌హౌజ్ కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ చట్టం కింద వీటిని జప్తు చేశామని అధికారులు పేర్కొన్నారు. ఓ పెంట్‌హౌజ్ పైభాగంలో మూడు హెలికాప్టర్లు దిగేందుకు ఏర్పాట్లు ఉన్నాయని కూడా వెల్లడించారు. ముంబై, ఢిల్లీ, పుణెలలో మొత్తం ఆరు నివాస ప్రాంతాలు, పది ఆఫీసు కార్యాలయాలు ఉన్నాయని వెల్లడించారు.

నేను తప్పు చేయలేదు: మెహుల్ చోక్సీ


మెహుల్ చోక్సీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ''నేను ఎలాంటి తప్పు చేయలేదు. నిజాలు త్వరలోనే బయటకు వస్తాయి. నా కర్మను నేను అనుభవిస్తాను'' అని పీఎన్‌బీ కుంభకోణం సూత్రధారి నీరవ్‌మోదీ మామ, గీతాంజలి జెమ్స్ ఎండీ మెహుల్ చోక్సీ పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ ఉద్యోగులకు ఓ బహిరంగ లేఖ రాశారు. దానిని ఆయన న్యాయవాది సంజయ్ అబ్బాట్ మీడియాకు విడుదల చేశారు. ''సంస్థ ఖాతాలను స్తంభింపజేయడంతో కంపెనీకి చెందిన 3,500 మంది ఉద్యోగుల వేతనాలను సకాలంలో అందించలేకపోతున్నాను. ఇందుకు నేను చాలా బాధపడుతున్నాను. అనేక రకాల విచారణలతో నేను అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాను. సంస్థ కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. నా పట్ల, నా కంపెనీ పట్ల ఒక భయాన్ని సృష్టించారు. అపరాధి అనే భావనను కలిగించారు. జీతాల చెల్లింపులో అనిశ్చితి ఏర్పడటంతో వేతనాలు చెల్లించని పరిస్థితి ఏర్పడింది. దాంతో ఉద్యోగులందరూ ఇతర కెరీర్‌ను వెతుక్కుంటున్నారు'' అని ఆ లేఖలో చోక్సీ పేర్కొన్నారు.

రంగులేసుకుంటే.. నిజాయితీపరులా?

- వీళ్లు చిచ్చుబుడ్లలా మాయమైపోతారు
- మమ్మల్నెవరూ కలలోనూ విడదీయలేరు
- ఏ క్షణంలోనైనా ఎన్నికలకు మేం రెడీ
- రజనీ.. కమల్‌పై పన్నీర్‌సెల్వం విమర్శలు
- జయలలిత కాంస్య విగ్రహం ఆవిష్కరణ



చెన్నై, ఫిబ్రవరి 24: తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం పరోక్షంగా ప్రముఖ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్‌లపై విమర్శలు గుప్పించారు. రాజకీయాలలోకి ప్రవేశించాలన్న వాళ్ల ఉద్దేశాన్ని కూడా ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో వెలుస్తున్న కొత్త పార్టీలు చిచ్చుబుడ్లలాంటివని, అవి త్వరలోనే మాయమైపోతాయని అన్నారు. త్వరలోనే ఆ బుడగ పేలిపోతుందని, కేవలం రంగులేసుకుని వాళ్లు ప్రజల వద్ద నిజాయితీపరుల్లా నటిస్తున్నారని విమర్శించారు. దివంగత సీఎం జయలలిత 70వ జయంతి సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఆరు అడుగుల జయలలిత కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కొంతమంది వెన్నుపోటుదారులు పార్టీని, ప్రభుత్వాన్ని విడదీయాలనుకుంటున్నారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అమ్మ దయతో నడుస్తోందని.. కార్యకర్తలే దీన్ని నడిపిస్తున్నారని ఓపీఎస్ చెప్పారు. తమను విడదీయాలని ఎవరూ కలలో కూడా అనుకోలేరని, తాము ఏక్షణంలోనైనా ఎన్నికలకు సిద్ధం గా ఉన్నామని అన్నారు. పరోక్షంగా ఆయన ఆర్కేనగర్ ఎమ్మెల్యే, అన్నాడీఎంకే బహిష్కృత నేత టీటీవీ దినకరన్ విషయాన్ని ప్రస్తావించారు. పార్టీ కార్యకర్తలు పైకి నవ్వినట్లు కనిపిస్తున్నా.. అదంతా అమ్మ ఇక లేరన్న ఆవేదనతో వస్తున్న ఏడుపు ఆపుకోడానికేనని పన్నీర్ సెల్వం చెప్పారు.



ఇలాంటి పార్టీ లేదు

జయలలిత ఆధ్వర్యంలో నడిచిన అన్నాడీఎంకే లాంటి పార్టీ దేశంలోనే వేరొకటి లేనే లేదని ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి అన్నారు. తమ పార్టీకి, ప్రభుత్వానికి చాలా అడ్డంకులు వచ్చాయని, అమ్మ మరణం తర్వాత ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు కూడా జరిగాయని.. కానీ ఏ ఒక్కరూ ప్రభుత్వాన్ని ముట్టుకోలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎంజీఆర్ విగ్రహానికి కుడివైపు జయలలిత విగ్రహం ఏర్పాటుచేశారు. ఎంజీఆర్ విగ్రహం కంటే పెద్దగా జయలలిత విగ్రహం ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా శిల్పి ప్రసాద్‌కు బంగారు ఉంగరం బహూకరించారు. ఇక పార్టీ ఆధ్వర్యంలో 'నమదు పురచ్చి తలైవి అమ్మ' అనే పేరుతో వార్తాపత్రిక ప్రారంభించారు. దీని తొలి సంచికను 136 పేజీలతో సిద్ధం చేశారు.



సైన్యానికి 400 డ్రోన్లు కావాలి

- కొత్తతరం ఆయుధాలు అవసరం.. రక్షణ శాఖ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: భవిష్యత్తులో సైన్యం అవసరాలను తీర్చేందుకు కొత్తతరం ఆయుధాలు అవసరమని రక్షణ శాఖ నివేదిక వెల్లడించింది. వచ్చే పదేళ్లలో భారత సైనిక దళానికి 400 డ్రోన్లు, అత్యాధునిక ఆయుధ సంపత్తి అవసరమవుతాయని పేర్కొంది. యుద్ధ సంపత్తి, జలాంతర్గామి నుంచి రిమోట్ ద్వారా పైలెటింగ్ చేసే విమానాలు, లేజర్, మైక్రోవేవ్ వంటి డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్(డీఈడబ్ల్యూ), ఉపగ్రహాలూ కావాల్సి వస్తుందని తెలిపింది. భారత్ రక్షణ శాఖ రూపొందించిన 'సాంకేతిక దృక్పథం, సామర్థ్య రోడ్‌మ్యాప్-2018'లో ఈ విషయాలను వెల్లడించారు. దానికి అనుగుణంగా రక్షణ రంగాన్ని ఆధునికీకరించాలని పేర్కొన్నారు. ''ఈ రోడ్ మ్యాప్ ద్వారా రక్షణరంగంలో సాంకేతిక అభివృద్ధికి బీజం పడుతుంది. భాగస్వాములు, ఉత్పత్తి ఒప్పందాలు అభివృద్ధి చెందుతాయి. మేకిన్ ఇండియాలో భాగంగా భారత్ చేపట్టే కార్యక్రమాలకు ఇది మరింత ఊతమిస్తుంది'' అంటూ రక్షణ శాఖ 82 పేజీల నివేదికలో వెల్లడించింది. ఇప్పటికిప్పుడు కావాల్సిన అవసరాలే కాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కొత్తతరం జలాంతర్గాములు, క్షిపణి విధ్వంసక పరికరాలు, ఇన్‌ఫాంట్రీ ఆయుధాలు, ప్రత్యేక పేలుడు పదార్థాలు, సీబీఆర్ఎన్(రసాయన, జీవ, రేడియోధార్మిక, అణు) వంటి పటిష్ఠమైన రక్షణ వ్యవస్థల ఏర్పాటుకు దోహదం చేస్తుందంటున్నారు. కాగా, ప్రస్తుతం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్డీవో).. రూ.2,650 కోట్లతో ఘటక్ స్టెల్త్ యూసీఏవీలను(యుద్ధ డ్రోన్లు) తయారు చేస్తోంది.

బడి పిల్లలను చిదిమేసిన బొలెరో


- రోడ్డు దాటుతుండగా దారుణం
- 9 మంది విద్యార్థుల దుర్మరణం
- 24 మందికి తీవ్ర గాయాలు..
- ఆరుగురి పరిస్థితి విషమం
- బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఘటన



ముజఫర్‌పూర్, ఫిబ్రవరి 24: నిండా పదేళ్లు కూడా దాటని ఆ పిల్లల నూరేళ్ల జీవితాన్ని రోడ్డు ప్రమాదం మింగేసింది. బడి ముగియగానే ఇంటికెళ్లాలనే తపనను కూడా కట్టేసుకుని క్యూలో రోడ్డు దాటుతున్న ఆ చిన్నారులను అతి వేగంతో వచ్చిన బొలెరో కారు చిదిమేసింది. తొమ్మిది మంది చిన్నారుల ప్రాణాలను బలి తీసుకుంది. 24 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ముక్కు పచ్చలారని ఆ పిల్లల రక్తం.. చెల్లాచెదురుగా పడిన శరీర భాగాలతో ఆ ప్రాంతమంతా భయానకంగా తయారైంది. ఈ దారుణం శనివారం మధ్యాహ్నం బిహార్‌లోని ముజఫర్‌పూర్‌లో జరిగింది. ఇక్కడి ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఇంటి గంట మోగగానే పిల్లలంతా ఇళ్లకు కదిలారు. ముజఫర్‌పూర్ నుంచి ఉత్తర బిహార్‌కు వెళ్లే జాతీయ రహదారి 77కు ఆనుకుని ఈ బడి ఉంది. దీంతో పిల్లలు నెమ్మదిగా చూసుకుని నెమ్మదిగా వరుస క్రమంలో రోడ్డు దాటుతున్నారు. అంతలోనే అతి వేగంతో వచ్చిన ఓ బొలెరో డ్రైవర్ దగ్గరకు వచ్చేదాకా పిల్లలను గమనించకపోవడంతో అదుపు చేయలేక వారిని ఢీకొట్టేశాడు. పక్కకు తప్పించే ప్రయత్నంలో ఆ కారు పిల్లలను తొక్కుకుంటూ పాఠశాల గోడను ఢీకొట్టింది. దీంతో ఆ కారు కింద పడిన పిల్లల శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. ప్రమాదంలో అక్కడికక్కడే 9 మంది విద్యార్థులు మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు వారిని ముజఫర్‌పూర్‌లోని శ్రీకృష్ణ మెమోరియల్ కాలేజీ, హాస్పిటల్‌కు తరలించారు. పిల్లలకు అత్యవసర చికిత్స అందిస్తున్న వైద్యులు.. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పిల్లంతా ఐదో తరగతి లోపు వారే. ఆస్పత్రి ఆవరణ అంతా పిల్లల ఆర్తనాదాలు, బంధువుల రోదనలతో విషాద వాతావరణం అలముకొంది. కాగా, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలంటూ స్థానికులు కొద్దిసేపు రోడ్డుపై ఆందోళన చేపట్టారు.

'నేషనల్ హెరాల్డ్' సంపాదకుడి కన్నుమూత

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ సంతాపం



చెన్నై, ఫిబ్రవరి 24: ప్రముఖ పాత్రికేయుడు, ఢిల్లీ కేంద్రంగా వెలువడే 'నేషనల్ హెరాల్డ్' పత్రిక ఎడిటర్-ఇన్-చీఫ్ నీలభ్ మిశ్రా (57) కన్నుమూశారు. కొంత కాలంనుంచీ అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆయన కుటుంబానికి సంతాపం ప్రకటిస్తూ- నీలభ్‌ను 'సంపాదకుల సంపాదకుడు'గా కొనియాడారు. ఆయనకు ప్రాణాంతక కాలేయ వ్యాధి సోకటంతో ఈ నెల తొలినాళ్లలో చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్చారు. అయితే కాలేయ మార్పిడి నిర్వహించేలోపే బహుళ అవయవ వైఫల్యం సంభవించడంతో మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. భారత ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వ్యవస్థాపకుడుగా ప్రారంభమైన 'నేషనల్ హెరాల్డ్' పత్రిక ఆ తర్వాత కొన్నేళ్లకు మూతపడగా 2016లో పునఃప్రారంభమైనప్పటినుంచీ నీలభ్ సంపాదక సారథ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ తర్వాత 2017లో 'నేషనల్ హెరాల్డ్ ఆన్ సండే' పత్రికతోపాటు 'నవజీవన్', ఖ్వామీ ఆవాజ్' వార్తా వెబ్‌సైట్లు కూడా ఆయన సారథ్యంలోనే ప్రారంభమయ్యాయి. బిహార్‌లోని పట్నాలో 'నవభారత్ టైమ్స్' పత్రిక రిపోర్టర్‌గా పాత్రికేయ జీవితం ప్రారంభించిన నీలభ్ మిశ్రా- మూడు దశాబ్దాలపాటు పత్రికా రంగంలో కొనసాగారు.

అఫ్ఘాన్‌లో వరుస దాడులు

- 23 మంది దుర్మరణం


పేలుళ్లలో గాయపడిన చిన్నారులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కాబూల్, ఫిబ్రవరి 24: అఫ్ఘానిస్థాన్‌లో వేర్వేరు చోట్ల జరిగిన ఉగ్ర దాడుల్లో 23 మంది దుర్మరణం చెందారు. సుమారు 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి ఫరా ప్రావిన్స్‌లోని ఆర్మీ బేస్‌పై తాలిబన్ ఉగ్రవాదుల దాడికి పాల్పడ్డారు. కాల్పులు జరుపుతూ లోపలికి చొరబడి తమను తాము పేల్చేసుకున్నారు. దీంతో 18 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని అఫ్ఘాన్ రక్షణ శాఖ ప్రతినిధి దౌలత్ వాజిర్ శనివారం మీడియాకు వెల్లడించారు. శనివారం ఉదయం దక్షిణ హెల్‌మంద్ ప్రావిన్స్‌లోని మరో ఆర్మీ బేస్ వద్ద ఉగ్రవాదులు కారు బాంబు పేల్చడంతో ఇద్దరు సైనికులు మరణించారు. పన్నెండు మందికి పైగా గాయపడ్డారు. అలాగే శనివారం అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లో ఉన్న నాటో, అమెరికా రాయబార కార్యాలయాలకు సమీపంలో మరో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా.. 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

బాలకృష్ణతో మరో సినిమా!




నందమూరి బాలకృష్ణ, సి.కల్యాణ్ కాంబినేషన్‌లో రూపొందిన 'జై సింహా' ఇటీవల విడుదలై విజయం సాధించిన విషయం తెలిసిందే. మళ్ళీ వీళ్లిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. తేజ దర్శకత్వంలో ఎన్టీఆర్ బయోపిక్‌లో నందమూరి బాలకృష్ణ నటించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమయ్యేందుకు చాలా టైమ్ ఉండడంతో ఈమధ్యలోనే మరో సినిమా చెయ్యాలని సి.కల్యాణ్ ప్లాన్ చేస్తున్నారని తెలిసిందే. ఎన్టీఆర్ బయోపిక్ ప్రారంభమయ్యే సరికి ఈ సినిమా మేజర్ షూటింగ్ పార్ట్ పూర్తి చెయ్యాలని సి.కల్యాణ్ భావిస్తున్నారు. పటాస్, సుప్రీమ్, రాజా ది గ్రేట్ వంటి కమర్షియల్ హిట్స్‌ని రూపొందించిన అనిల్ రావిపూడి దర్శకత్వంలో బాలకృష్ణ తదుపరి చిత్రం ఉంటుందని తెలుస్తోంది. అయితే ఆగస్ట్ నుంచి మాత్రమే తాను అందుబాటులో ఉంటానని అనిల్ చెప్పడంతో ఈలోపుగానే సినిమా పూర్తి చేయడానికి ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి పూర్తి వివరాలు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

నాగార్జున, నాని చిత్రం రికార్డింగ్ ప్రారంభం



నాగార్జున, నాని హీరోలుగా వైజయంతి మూవీస్ పతాకంపై రూపొందుతున్న చిత్రం పాటల రికార్డింగ్ మహతి రికార్డింగ్ స్టూడియోలో జరిగింది. టి.శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. గతంలో నిర్మాత సి.అశ్వనీదత్ ఎన్నో మల్టీస్టారర్స్ చేశారు. ఇప్పుడు నాగార్జున, నానిలతో ఈ భారీ మల్టీస్టారర్‌ను వైజయంతి మూవీస్ బేనర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అగ్రనిర్మాత సి.అశ్వనీదత్ మాట్లాడుతూ ''నాగార్జున, నాని వెరైటీ కాంబినేషన్‌లో ఒక ఇంట్రెస్టింగ్ సబ్జెక్ట్‌తో ఎంటర్‌టైనింగ్ వేలో చాలా భారీగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. మా బేనర్‌లో వచ్చిన ఎన్నో మల్టీస్టారర్స్‌ని ఆదరించిన ప్రేక్షకుల్ని ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. మా బేనర్‌లో ఎన్నో మ్యూజికల్ హిట్స్ ఇచ్చిన మణిశర్మ సంగీత సారధ్యంలో పాటల రికార్డింగ్ ప్రారంభించాం. మార్చిలో షూటింగ్‌ని స్టార్ట్ చేస్తాం. మిగతా నటీనటుల ఎంపిక జరుగుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, ఎడిటింగ్: ప్రవీణ్‌పూడి, మాటలు: వెంకట్ డి. పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం, స్క్రిప్ట్ అడ్వైజర్: సత్యానంద్, కోడైరెక్టర్: తేజ కాకుమాను, ప్రొడక్షన్ కంట్రోలర్: మోహన్, నిర్మాత: సి.అశ్వనీదత్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి.శ్రీరామ్ ఆదిత్య.



• మహేష్

మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న 'భరత్ అనే నేను' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ప్రమోషన్‌ను ప్రారంభించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. దీనిలో భాగంగానే ఉగాది పండగ సందర్భంగా 'భరత్ అనే నేను' స్పెషల్ టీజర్‌ను విడుదల చేయబోతున్నారని తెలుస్తోంది. 'శ్రీమంతుడు' తర్వాత మహేశ్, కొరటాల శివ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

'భరత్ అనే నేను' స్పెషల్ టీజర్

ఆ అంచనాలకు తగ్గట్టుగానే సినిమాను ఎంతో వైవిధ్యంగా తెరకెక్కిస్తున్నారట. పొలిటికల్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహేశ్ సరసన కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తుండగా, శరత్‌కుమార్, ప్రకాశ్ రాజ్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో కనిపిస్తారు. దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు.

'కృష్ణార్జున యుద్ధం'లో నాని



థియేటర్స్ బంద్‌కు మద్దతు

నిర్మాతలకు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ క్యూబ్, యుఎఫ్ ఓ, పిఎక్స్‌డి సంస్థలకు మధ్య చర్చలు విఫలమై మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్ పాటించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అలాగే ఆ మూడు సంస్థలకు సినిమా కంటెంట్ ఇవ్వకూడదని నిర్ణయించారు. దీనికి తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా మద్ధతు ప్రకటించింది. టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''గత పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థపై మేం పోరాటం చేస్తున్నాం. ఇప్పటికైనా ముందుకొచ్చి సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా డిజిటల్ వ్యవస్థపై పోరాటం చేయటం మంచి పరిణామం. గతంలో మేము డిజిటల్ రేట్లను తగ్గించాలంటూ నిరహార దీక్ష చేయడం కూడా జరిగింది. గతంలో 2500లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ కొన్ని సంస్థలు ముందుకొచ్చినా వారిని రానివ్వకుండా చేశారు కొంత మంది. తక్కువ రేట్లకే డిజిటల్ సర్వీసెస్ ప్రొవైడ్ చేస్తామంటూ అనేక సంస్థలు ముందుకొస్తున్నాయి. కాబట్టి మార్చి 2 నుంచి థియేటర్స్ బంద్‌కు అందరూ సహకరించాలని కోరుతున్నాను'' అన్నారు. సెక్రటరి సాయివెంకట్ మాట్లాడుతూ ''ఎంతోకాలంగా మేం ఉద్యమం చేస్తూ వచ్చాం. ఇప్పుడు సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా ఏకమై ఆ మూడు డిజిటల్ సంస్థలు దిగి వచ్చేలా మార్చి 2 నుంచి చేయబోతున్న థియేటర్స్ బంద్‌కు మా మద్ధతు ప్రకటిస్తున్నాం. దీన్ని ముందుండి నడిపిస్తున్న జెమిన్ కిరణ్‌గారికి, డి.సురేష్‌బాబుగారికి ధన్యవాదాలు'' అన్నారు.





ప్రభాస్‌తో రాజు సుందరం?

ప్రభాస్ హీరోగా సుజిత్ దర్శకత్వంలో యు.వి.క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న 'సాహో' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రం తర్వాత ఇదే బేనర్‌లో 'జిల్' దర్శకుడు రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు ప్రభాస్. ఈ రెండు సినిమాల తర్వాత ప్రభాస్ బాలీవుడ్‌లో స్ట్రెయిట్ సినిమా చెయ్యబోతున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా ప్రభాస్ మరో దక్షిణాది సినిమాకి ఓకే చెప్పారని తెలుస్తోంది. ప్రముఖ కొరియోగ్రాఫర్ రాజు సుందరం దర్శకత్వంలో సినిమా చేసేందుకు ప్రభాస్ అంగీకరించారని సమాచారం. రాజు సుందరం చెప్పిన పాయింట్ విన్న ప్రభాస్ పూర్తి స్క్రిప్ట్ రెడీ చెయ్యమని చెప్పారట. ఈ కాంబినేషన్‌లో సినిమా రాబోతోందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశం గా మారింది. అయితే ప్రభాస్, రాజు సుందరం ఈ సినిమా గురించి ఎలాంటి ప్రకటన చెయ్యలేదు.

నేటి యువతరానికి ప్రతినిధిగా..



• విజయ్ దేవరకొండ, శివాని సింగ్

విజయ్ దేవరకొండ హీరోగా, శివానీ సింగ్ హీరోయిన్‌గా రూపొందిన చిత్రం 'ఏ మంత్రం వేశావే'. శ్రీధర్ మర్రి దర్శకుడు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో గోలీసోడా ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రాన్ని మార్చి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సమర్పకుడు మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''గేమ్ నేపథ్యంలో నడిచే విభిన్నమైన కథ ఇది. విజయ్ దేవరకొండ పాత్ర ఇందులో చాలా వైవిధ్యంగా ఉంటుంది. నేటి యువతరానికి ప్రతినిధిగా కనిపించబోతున్నాడు. విదేశాల్లో చిత్రీకరించిన సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా వుంటాయి. మార్చి 9న చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని తెలిపారు. శివన్నారాయణ, రాజబాబు, నీలాక్షిసింగ్, ఆశిష్‌రాజ్, ప్రభావతి, దీపక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అబేత్ సమత్, సినిమాటోగ్రఫీ: శివారెడ్డి.

నితిన్ నటిస్తున్న 25వ చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. మేఘా ఆకాశ్ కథానాయిక. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి త్రివిక్రమ్ కథను అందించగా.. కృష్ణచైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తమన్ స్వరసారథ్యంలో రూపొందిన 'గ..ఘ..మేఘ' పాటను శనివారం విడుదల చేశారు. ఈ పాట..

'మేఘ కనులే చెప్పే కొత్త సాగా..'

''గ..ఘ..మేఘ కనులే చెప్పే కొత్త సాగా.. గ..ఘ.. మేఘ నింగే మనకు నేడు కాగా'' అంటూ కొనసాగుతుంది. రాహుల్ నంబియార్ గానం చేసిన ఈ పాటకు.. కె.కె. సాహిత్యమందించారు. మెలోడీయస్‌గా సాగే ఈ పాట వినసొంపుగా ఉంది. కాగా, ఏప్రిల్ 5న ఈ సినిమా తెరపైకి రానుంది.




• నితిన్, మేఘా ఆకాశ్



ప్రియాంక పిచ్చి చేష్టలు

ఏదో ఒక వివాదంతో నిత్యం వార్తల్లో నిలిచే బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా తీరు మళ్లీ వివాదాస్పదం అవుతోంది. సరిగ్గా కలిసిరాని రోజు పని ఒత్తిడిలో తాను ఏం చేస్తానంటే అంటూ సోషల్ మీడియాలో ఆమె ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఇందులో కోపంతో వైన్ గ్లాస్‌ను తన తలపై పగలగొట్టుకుంది. అయితే ఇలా మీరు చేయొద్దంటూ ఫ్యాన్స్‌కు సలహా ఇచ్చింది. ప్రియాంకకు ఏమైందంటూ సానుభూతితో ఫ్యాన్స్ కుప్పలు తెప్పలుగా కామెంట్స్ పెడుతున్నారు. కొందరు రెగ్యులర్ వర్క్ నుంచి కాస్త బ్రేక్ తీసుకోవాలని సలహా ఇవ్వగా...మరికొందరు అమెరికా టీవీ సిరీస్‌కు గుడ్‌బై చెప్పి బాలీవుడ్‌కు వచ్చేయాలని సలహా ఇస్తున్నారు. అయినా పని ఒత్తిడిలో ఇలా తలపై వైన్ గ్లాస్‌ను పగలగొట్టుకోవడం, దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం పిచ్చి చేష్టగా కొందరు ఆమె తీరును తప్పుబడుతున్నారు.



బీజేపీ సీమ నాడి

- ప్రకంపనలు రేపుతున్న కర్నూలు డిక్లరేషన్
- రాయలసీమకు హైకోర్టు ఇవ్వాల్సిందే
- రెండో రాజధాని.. ఎనిమిదికి జిల్లాల పెంపు
- ఢిల్లీ స్క్రిప్ట్.. వ్యూహాత్మకంగా అడుగులు
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్

అమరావతి, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): బీజేపీ రాయలసీమ డిక్లరేషన్ రాజకీయవర్గాల్లో ప్రకంపనలు రేపుతోంది. అధికార తెలుగుదేశం పార్టీని ఒకింత కలవరానికి గురిచేస్తోంది. ప్రత్యేకహోదా డిమాండ్ మళ్లీ తెరపైకి రావడం, తెలుగుదేశం కూడా 'హోదా' మంటలకు ఆజ్యం పోస్తున్న నేపథ్యంలో బీజేపీ వ్యూహాత్మకంగానే రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలంటూ ఈనెల 28న కడపలో ధర్నాకు పిలుపునివ్వటంతో బీజేపీ 'సీమ'నాడిని బాగానే పట్టుకుందని పరిశీలకులు భావిస్తున్నారు. హైకోర్టుతో పాటు రాయలసీమలో రెండో రాజధాని ఏర్పాటు చేయాలని, జిల్లాల సంఖ్యను నాలుగు నుంచి ఎనిమిదికి పెంచాలని, రాయలసీమ అభివృద్ధి బోర్డును పునరుద్ధరించి తక్షణం రూ. 10 వేల కోట్లు కేటాయించాలని డిక్లరేషన్‌లో డిమాండ్ చేశారు. పనిలో పనిగా అభివృద్ధి వికేంద్రీకరణను తెరమీదకు తీసుకొచ్చారు. అభివృద్ధి కేంద్రీకరణ కారణంగా ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నష్టం పునరావృతం కాకూడదని గడిచిన నాలుగేళ్లుగా ఆర్థిక నిపుణులు, సామాజికవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. హైదరాబాద్ కేంద్రంగానే ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి మొత్తం జరగడం.. దానివల్ల రాష్ట్రంలో పలు ప్రాంతాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోవడంతో విడిపోయిన తర్వాత చాలా ఇబ్బందులు ఒక్కసారిగా కనిపించాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇపుడు బీజేపీ కూడా అభివృద్ధి వికేంద్రీకరణ గురించి స్పష్టంగా చెప్పటం ద్వారా రాయలసీమ ప్రజల అభిమానానికి చేరువయ్యేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు. కర్నూలులో బీజేపీ ప్రకటించిన డిక్లరేషన్ ను తప్పుపట్టటానికి ఏ రాజకీయ పార్టీ సాహసం చేయదు. అలాగని, వారి డిమాండ్లను అమలుచేసే దశలోనూ అధికార పార్టీ సిద్ధంగా లేదు. ఇలాంటి సమయంలో బీజేపీ వ్యూహాన్ని ఎలా ఎదుర్కోవాలనే విషయమై అధికారపార్టీ కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో నాయకులకు కొన్ని సూచనలు చేశారు. గడిచిన నాలుగేళ్లుగా రాయలసీమ నాలుగు జిల్లాల్లో చేసిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలని, కరవు కోరల్లో చిక్కిన సీమకు నీళ్లందించిన ఘనత తమదేనని తెలిపారు. అనంతపురం, చిత్తూరు జిల్లాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి, భారీ పరిశ్రమలు, సెజ్‌లు రావడానికి తామే కారణమన్న సంగతి ప్రజలకు బాగా తెలుసన్నారు. అయితే, రాయలసీమకు నిర్దిష్టంగా ఏం కావాలో తాము డిక్లరేషన్‌లో ప్రకటించామని, ఆ మేరకు రాష్ట్రప్రభుత్వం నుంచి హామీలు, అమలును ప్రజలు ఆశిస్తున్నారని బీజేపీ నేతలు బదులిస్తున్నారు.

ఢిల్లీలో స్క్రిప్ట్ .. కర్నూలులో డిక్లరేషన్

బీజేపీ నాయకులు కర్నూలులో ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్ స్క్రిప్ట్ బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి అందినట్టు తెలిసింది. బీజేపీ ఎంతో వ్యూహాత్మకంగా రాయలసీమపై విధానపరమైన నిర్ణయాన్ని డిక్లరేషన్‌లో వెల్లడించినట్టు సమాచారం. దీని ఆధారంగా ఏపీలో బీజేపీ భవిష్యత్ అడుగులు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకోవచ్చని ఆ పార్టీ సీనియర్ నాయకులు వ్యాఖ్యానించారు. ప్రత్యేకహోదాను అమలు చేయకుండా, నిధులివ్వకుండా రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం చేసిందని ఊరూవాడా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కర్నూలు డిక్లరేషన్ ద్వారా కొత్త పల్లవితో రాష్ట్రంలో తమ అస్తిత్వాన్ని నిలుపుకోడానికి ఆ పార్టీ ఎత్తుగడని అమలు చేస్తోందని, ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటారని అధికార పార్టీ నాయకులు బదులిస్తున్నారు. రాయలసీమ వెనుకబాటుతనంపై ప్రేమ ఒలకబోసిన బీజేపీ బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక నిధులు ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. కర్నూలు డిక్లరేషన్ వెనుక తెరచాటు వ్యూహం ఉందని, ఈ డిమాండ్లపై బీజేపీ ఆందోళనలు చేస్తున్న క్రమంలో ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ కేంద్రం నుంచి ప్రత్యేక నిధులొచ్చే అవకాశం ఉందనీ, ఆ పార్టీకి లబ్ధి చెందేలా నిధుల ప్రకటన ఉండవచ్చని తెలిసింది.

చనిపోతూ.. ఏడుగురికి పునర్జన్మ

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కృష్ణా జిల్లా వాసి రాకేశ్ బ్రెయిన్ డెడ్
- తల్లిదండ్రుల సమ్మతితో అవయదానం



విజయవాడ, ఫిబ్రవరి 24 (మనం న్యూస్): తాను మరణించినా మరో ఏడుగురికి పునర్జన్మ ఇచ్చాడు. శాశ్వతంగా ఈ లోకం వీడిపోయినా.. అవయదానం చేసి ఇతరుల రూపంలో బతికున్నాడు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 'బ్రెయిన్ డెడ్' అయిన రాకేశ్ అవయవాలను ఏడు ప్రాంతాల్లోని ఏడుగురు రోగులకు దానం చేశారు. కృష్ణా జిల్లా పమిడిముక్కల గ్రామానికి చెందిన చోరగుడి సురేశ్ కుమారుడు, తొమ్మిదో తరగతి విద్యార్థి రాకేశ్ (15) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ నెల 18వ తేదీన స్నేహితుడు నవీన్‌కుమార్‌తో కలసి మోటార్ బైక్‌పై వెళ్తుండగా.. ఇన్నోవా కారు ఢీకొంది. నవీన్‌కు స్వల్ప గాయాలు కాగా, రాకేశ్ తలకు బలమైన గాయమైంది. తొలుత ఉయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం పోరంకిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యులు రాకేశ్‌ను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. శుక్రవారం రాత్రి రాకేశ్ 'బ్రెయిన్‌డెడ్' అయినట్టుగా నిర్ధారించారు. కామినేని ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ ఉయ్యూరు పోలీసుల సమక్షంలో రాకేశ్ తల్లిదండ్రులను ఒప్పించి అతని అవయవాలను జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేయించారు. నాలుగు గంటల ఆపరేషన్ అనంతరం అవయవాలను తొలగించి కిడ్నీలను నగరంలోని అరుణ్ కిడ్నీ సెంటర్‌కు, మణిపాల్ ఆసుపత్రికి, కాలేయాన్ని ఆయుష్ ఆసుపత్రికి, కళ్లను పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి నగర పోలీసులు 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు ద్వారా తరలించారు. ఊపిరితిత్తులను చెన్నైలోని ఫార్చ్యూన్ ఆసుపత్రికి, గుండెను చెన్నైలోని గ్లోబల్ ఆసుపత్రికి గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానం ద్వారా తరలించారు. ఎంత బాధలో ఉన్నా రాకేశ్ తల్లిదండ్రుల అవయదానానికి అంగీకరించడం గొప్ప విషయమని డాక్టర్ శ్రీనివాస్ అభినందించారు. తమ కుమారుడిని వేరే వ్యక్తులలో చూసుకోవచ్చనే భావంతో అవయవాలు దానం చేశామని రాకేశ్ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

సులభ వాణిజ్య విధానాలున్న రాష్ట్రం.. నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి: వెంకయ్య

- సీఐఐ సదస్సును ప్రారంభించిన ఉప రాష్ట్రపతి
- ప్రపంచ టాప్ పెట్టుబడిదారులుగా తెలుగువారు
- చంద్రబాబు నాయకత్వంలో అగ్రస్థానానికి: అదానీ



సీఐఐ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కేంద్రమంత్రులు సురేశ్‌ప్రభు, అశోక్‌గజపతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (మనం న్యూస్): పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఎంతో అనుకూలమైన రాష్ట్రమని, సులభ వాణిజ్య విధానాలు అవలంభిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ ముందంజలో ఉందని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చెప్పారు. శనివారం విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యతోపాటు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు సురేశ్ ప్రభు, అశోక్ గజపతిరాజు, కేంద్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి రమేశ్ అభిషేక్, రాష్ట్ర మంత్రులు అమర్నాథ్ రెడ్డి, లోకేశ్, చినరాజప్ప, అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, పలువురు పెట్టుబడిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ.. అన్ని రకాలుగా మంచి వనరులున్న ఏపీ పెట్టుబడులకు ఎంతో అనువైన రాష్ట్రమని అన్నారు. నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన చెప్పారు. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా సాకారానికి భారత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన అతి పెద్ద సంస్కరణల్లో నోట్ల రద్దు ఒకటని, దీని ద్వారా నల్ల ధనాన్ని వెలికితీసి.. బ్యాంకులకు నిధుల లభ్యతను పెంచారని చెప్పారు. దీంతో బ్యాంకుల వడ్డీ రేట్లు దిగి వచ్చాయన్నారు. మరో కీలకమైన సంస్కరణ జీఎస్టీ అమలుతో దేశంలో వాణిజ్య విధానాలు సులభతరమయ్యాయని చెప్పారు. జీఎస్టీ అమలు కోసం 21 సమావేశాలు జరిగాయని, అన్ని రాష్ట్రాలతో పలుమార్లు భేటీ అయ్యి ఏకగ్రీవ అభిప్రాయానికి వచ్చారని వెంకయ్య తెలిపారు. అంతకుముందు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథరెడ్డి ప్రారంభ ప్రసంగం చేశారు. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సు మూడు రోజుల కొనసాగు తుందని ఆయన చెప్పారు. ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి 2500 మందికి పైగా ప్రతినిధులు వచ్చారన్నారు. కాగా, తొలి రోజు సదస్సులో రాష్ట్ర పారిశ్రామిక విధానం, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలుపై చర్చ జ రిగింది. అలాగే 'న్యూ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ' అనే అంశంపైనా ప్రతినిధులు చర్చించారు. ఈ చర్చలో కేంద్ర పరిశ్రమ శాఖ కార్యదర్శి రమేశ్ అభిషేక్ మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకత్వంతో ఏపీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. ఇక్కడ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందని ఆయన చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా కష్టపడి పనిచేస్తోందని అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి స్వర్గధామం అని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ అన్నారు.

ఇప్పటి వరకు గుజరాతీలు.. ఇక తెలుగువారు

ఇప్పటి వరకు గుజరాతీలే ఉత్తమ పెట్టుబడిదారులుగా ఉండేవారని, ఇక త్వరలోనే వారిని అధిగమించి తెలుగువారు అగ్రస్థానానికి చేరుకోబోతున్నారని ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో త్వరలోనే తెలుగువారు ప్రపంచంలోనే టాప్ పెట్టుబడిదారులు కాబోతున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూపం కూడా సహకరిస్తుందని చెప్పారు. తీర ప్రాంతం, సహజ వనరులు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయని, అంతకుమించి సమర్థమైన నాయకత్వం ఉందని చంద్రబాబును ప్రశంసించారు.

సన్ రైజ్ ఏపీలో పెట్టుబడులు పెట్టండి: లోకేశ్

విభజన త ర్వాత అనేక సమ స్యలతో ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు ప్రధాన ఆకర్షణగా తీర్చిదిద్దామని ఐటీ మంత్రి లోకేశ్ చెప్పారు. కేవలం మూడు న్న ర ఏళ్లలోనే సమస్యలను అధిగ మించి అభివృద్ధి వైపు అడుగులు వేస్తు న్నామని ఆయన అన్నారు. సీఐఐ సదస్సులో జరిగిన తొలిరోజు ప్లీనరీలో ఆయన మాట్లాడుతూ.. సన్‌రైజ్ స్టేట్‌గా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమ రావతిని నిర్మిస్తున్నామని చెప్పారు. అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతా మని పేర్కొన్నారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా మారబోతోందని, ఇక్కడ ఫిన్‌టెక్ వ్యాలీ ఏర్పాటుతో ఫైనాన్సియల్ టెక్నాలజీ కంపెనీలన్ని క్యూ కడుతు న్నాయని చెప్పారు. రా యలసీమ జిల్లాలను తయారీ రంగానికి హబ్‌గా మారుతు న్నామని, అనంతపురం లో ప్రపంచంలోనే అతిపెద్ద కార్ల కంపెనీ కియా ఏ ర్పాటు చేశామని అన్నారు. కేవలం 15 నెలల్లో కియా మొదటి కారు రాబోతోందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వ న్‌గా ఉన్నామని, సన్ రైజ్ స్టేట్ ఆఫ్ ఇండియాగా ఉ న్న ఏపీలో పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు.

తొలి రోజు 77 ఒప్పందాలు



- 31,546 కోట్ల పెట్టుబడులు
- 98,291 మందికి ఉపాధి అవకాశాలు
- హోదా వస్తే మరింత అభివృద్ధి: అమర్నాథ్ రెడ్డి

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (మనం న్యూస్): సీఐఐ భాగస్వామ్య సదస్సు తొలి రోజున 77 ఎంవోయూలపై సంతకాలు జరిగాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందాలతో రూ.31,546 కోట్ల పెట్టుబడులు వస్తాయని, ఆయా కంపెనీల స్థాపనతో 98,291 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తామయని ఆయన చెప్పారు. శనివారం సాయంత్రం మంత్రి మీడియాతో మాట్లాడారు. తొలి రోజు సదస్సులో ఎస్సెల్ గ్రూపు, మహేంద్ర హాలిడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా, ఐసీ నావల్ ఆర్కిటెక్ట్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు జరిగాయన్నారు. ఆటోమోటివ్ రంగంలో 14, పర్యాటక రంగంలో 56, మార్క్యు నుంచి 3 ఎంవోయూలపై సంతకాలు జరిగినట్లు చెప్పారు. మరో నాలుగు ఇతర పరిశ్రమలతో ఒప్పందాలు జరిగాయన్నారు. వీటి ద్వారా రూ.31,546 కోట్ల పెట్టుబడుల వస్తాయని, తద్వారా 98,291 మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. సదస్సు పూర్తయ్యేలోపు సుమారు మూడు లక్షల కోట్లు పెట్టుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. ఏపీ హోదా ఇవ్వాల్సిన అవసరం ఉందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే మరింత పెట్టుబడులు వచ్చి అభివృద్ధి వేగవంతమవుతుందని మంత్రి చెప్పారు.

ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టొద్దు

- ప్రజలను మభ్యపెట్టేందుకు బీజేపీ యత్నం
- రాయలసీమలో 18 ప్రాజెక్టులు నిర్మించాం
- వైసీపీ, బీజేపీ తప్పుడు ప్రచారం: ఆనందబాబు




గుంటూరు, ఫిబ్రవరి 24 (మనం సిటీ ప్రతినిధి): జాతీయ పార్టీగా ఉంటూ ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టే పనులను బీజేపీ మానుకోవాలని మంత్రి నక్కా ఆనందబాబు హితవు పలికారు. బీజేపీ నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. శనివారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడతూ.. విభజన చట్టం హామీలను అమలు చేయకుండా, రాజధాని నిర్మాణానికి కూడా సహకరించని ఎన్డీయే ప్రభుత్వం, బీజేపీ కొత్తగా రాయలసీమ హక్కులు, మరో రాజధాని అంటూ మాట్లాడటం అవివేకమన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని చట్టంలో ఉండగా, సంవత్సరానికి ఒక్కో జిల్లాకు కేవలం రూ. 50 కోట్లు చొప్పున మూడుసార్లు ఇచ్చి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాల్సి ఉండగా, బుందేల్ ఖండ్‌కు రూ. 6 వేల కోట్లు ఇచ్చి, రాయలసీమకు రూ. 600 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. బీజేపీ రాయలసీమలో సమావేశం పెట్టి కొత్త విధానంలో మాట్లాడటం అవివేకమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు కేవలం పత్రికల్లో కనిపించేందుకు మాట్లాడుతున్నారన్నారు. ఆయన టీడీపీ వల్లే ఎమ్మెల్సీ అయ్యారని, వార్డు స్థాయికి కూడా పనికిరాని నేతలు ముఖ్యమంత్రిని విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు రూ. వేల కోట్లు ఇచ్చామని కేంద్రం చెబుతోందని, పోలవరంపై రాష్ట్రం పెట్టిన ఖర్చు కూడా పూర్తిగా ఇవ్వలేదని, ఇంకా రూ.4 వేలకోట్లకు పైగా ఇవ్వాలన్నారు. మూడున్నర సంవత్సరాల కాలంలో రాయలసీమలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేశామన్నారు. 28 ప్రాజెక్టుల్లో 18 ప్రాజెక్టులు రాయలసీమలోనే నిర్మించామన్నారు. రాయలసీమ అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు.

ఏం చూసి జగన్‌కు అధికారమివ్వాలి?

ప్రజలు ఏం చూసి ప్రతిపక్ష నేత జగన్‌కు అధికారం ఇవ్వాలని మంత్రి ఆనందబాబు ప్రశ్నించారు. తండ్రి అధికారం అడ్డం పెట్టుకుని అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలు విజ్ఞత గలవారని, బెయిల్ కోసం రాష్ట్ర ప్రయోజనాలపై రాజీపడిన వైసీపీని దూరం పెట్టారన్నారు. వైసీపీ, బీజేపీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు.

ఏపీకి న్యాయం చేయండి

- కేంద్ర బడ్జెట్‌ను సవరించండి.. ప్రధానికి రఘువీరా లేఖ



అమరావతి, ఫిబ్రవరి 24 (మనం ప్రతినిధి): రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలతో పాటు 2014 ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వాగ్దానాలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి కోరారు. మార్చి నెలలో తిరిగిప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి ఏపీకి న్యాయం న్యాయం జరిగేలా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ శనివారం ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. ఏపీకి ప్రత్యేక హోదా, నాటి ప్రధాని మన్మోహన్ ఇచ్చిన ఇతర హామీలను, చట్టంలోని ప్రతి అంశాన్ని తూచ తప్పకుండా బీజేపీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలు అమలుకాకపోవటం చూసి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భారత ప్రజాస్వామ్య, సమాఖ్య వ్యవస్థపై విశ్వాసం కోల్పోతున్నారని రఘువీరా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ఈ నెల 26న విజయవాడలో కాగాడాల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రఘువీరా మీడియాకు తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఆంధ్రరత్న భవన్ నుంచి పోలీసు కంట్రోల్ రూం వరకు కాగాడాల ప్రదర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

కాసుల పంట.. నీరు-మట్టి

అడుగడుగునా అవినీతి మయం.. తవ్వకుండానే తవ్వేసినట్లు బిల్లులు

- తవ్విన మట్టి ఇష్టారాజ్యంగా అమ్మకం
- రాజకీయనేతలు.. అధికారుల కుమ్మక్కు
- స్వయంగా అమ్ముకొంటున్న ఎమ్మెల్యేలు
- సత్వరం బిల్లుల రాకే అవినీతికి మూలం



విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (మనం న్యూస్‌బ్యూరో): మట్టి.. కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం జలరక్ష ణ కోసం ప్రవేశ పెట్టిన 'నీరు - చెట్టు' పథకం అడుగడుగునా అవినీతి అక్రమాలతో అధికారులు, అధికార పార్టీ నేతలకు వరంగా మారింది. చెరువులను అభివృద్ధి చేసి, జల సంరక్షణకు హామీ ఇవ్వాల్సిన ఈ పథకం అవినీతికి చిరునామాగా మారిపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఇదే తంతు నడుస్తోంది. నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలకు దగ్గరగా ఉన్న చెరువుల్లో మట్టి తవ్వకాల్లో అవినీతికి అడ్డేలేకుండా పోతోంది.

లెక్కల్లో తేడాలు.. బిల్లుల్లో మాయలు

తవ్వకాల కొలతల్లో తేడాలు, మట్టి తవ్వకుండానే తవ్వినట్టు తప్పుడు లెక్కలు చూపించడాలు వంటి వాటిపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా అవినీతిలో కుమ్మక్కవుతున్న నీటి పారుదల శాఖాధికారులు స్పందిచడం లేదు. ఈ పథకంలో చేపట్టే పనులకు నీటి పారుదల శాఖాధికారులు ముందుగా ప్రణాళికలు రూపొందించాలి. ఏ చెరువులో ఎంత మేర మట్టి తవ్వాలో అంచనాలు తయారుచేయాలి. ఇక్కడినుంచే మోసాలు మొదలవుతున్నాయి. అడుగు తవ్వితే ఆరడుగులు తవ్వినట్లు ఎం బుక్‌లలో నమోదు చేసి బిల్లులు చేసుకొంటున్నారు. ఇందులో పర్సంటేజీలు నొక్కేస్తున్నారు. ఇలా చేసే ఇటీవల విశాఖ జిల్లా మాడుగల మండల నీటిపారుదల శాఖ అధికారి ఏసీబీకి చిక్కారు. కొన్ని నియోజక వర్గాల్లో ఏకంగా ఎమ్మెల్యేలే ఈ అవినీతి తవ్వకాలకు అండగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నగరాలు, పట్టణాల్లో మట్టికి మంచి డిమాండు ఉం ది. నీరు-చెట్టు పథకంలో చెరువుల నుంచే తీసే పూడిక మట్టిని అక్రమంగా అమ్ముకొంటూ అధికార పార్టీ నేతలు, అధికారులు భారీగా దండుకుంటున్నారు. నిబంధనల ప్రకారం చెరువులో తవ్విన మట్టితో చెరువు గట్లను బలో పేతం చేయాలి. ఇంకా మట్టి మిగిలితే గ్రామాల్లో సామా జిక అవసరాలకు వినియోగించాలి లేదా రైతులకు ఉచి తంగా ఇవ్వాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. అం దుకు విరుద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో తీసిన మట్టి ని రియల్ ఎస్టేట్ కంపెనీలు, ప్రైవేటు కంపెనీలకు విక్ర యిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతుండడంతో అధికారులు కూడా ఏమీ మాట్లాడటం లేదు. విశాఖ నగర శివారులోని చొట్టావాని చెరువు పనుల పేరిట వేలలారీల మట్టిని అక్రమంగా తరలించిన వ్యవహారం తమ దృష్టికి రాలేదని ఏఈ జ్యోతిబాబు చెప్పారు.

అమ్మకాల కోసం స్వచ్ఛందంగా ముందుకు

కొన్ని చోట్ల అధికార పార్టీ నే తలు మట్టిని అమ్ముకొనే ఉద్దేశంతో సేవా సంస్థలు, సొసైటీల పేరిట స్వచ్ఛందంగా 'నీరు చెట్టు ' పనులు చేస్తామంటూ ముందుకు వస్తున్నారు. పనులు అప్పగించిన తరువాత ఎంచక్కా పొక్లెయిన్లు, లారీలతో మట్టిని తరలించి అమ్ముకొంటున్నారు. లారీ లోడ్ రూ.1500 - 2000 ధర పలుకుతుండటంతో పనుల కోసం పోటీ పడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పుడు ఇసుక వ్యాపారం కంటే ఈ మట్టి వ్యాపారమే జోరుగా సాగుతోంది. నీటి పారుదల శాఖాధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు నటిస్తున్నారు. ప్రైవేటు సంస్థలకు ఈ మట్టిని విక్రయిస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకొంటామని చెప్పే అధికారులు.. పెద్దసంఖ్యలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించినట్లు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.


బిల్లులు కూడా సత్వరమే

నీరు చెట్టు పథకం కిందిస్థాయి అధికార పార్టీ నేతల పాలిట వరంగా ఉందన్న విమర్శలు మొదటినుంచి ఉన్నాయి. జన్మభూమి కమిటీలు, ఎమ్మెల్యేలే పనులను ఖరారు చేస్తుండడంతో పూర్తిగా పార్టీనేతలకే పనులు దక్కుతున్నాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొనే నీరు-చెట్టు పథకం బిల్లులకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ట్రెజరీ నుంచి నిధుల విడుదలపై ఆంక్షలు విధించిన ప్రభుత్వం నీరు చెట్టు బిల్లులకు మాత్రం ప్రతిసారీ మినహాయింపును ఇస్తూనే ఉంది. ఉద్యోగుల జీతాలు, పింఛన్లు అయినా ఆగుతున్నాయేమో గానీ ఈ బిల్లులు మంజూరు మాత్రం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది.

ప్రీమియం బైక్‌లపై కవాసాకి కన్ను

కోల్‌కతా: బజాజ్ ఆటోతో సంబంధాలను 2017 ఏప్రిల్‌లో తెగ తెంపులు చేసుకున్న ఇండియా కవాసాకి మోటార్స్ దేశంలో ప్రీమియం బైక్‌ల విభాగంలో తన ఉనికిని చాటుకునే అవకాశం ఉందని కంపెనీ అధికారి ఒకరు ఇక్కడ చెప్పారు. ఇండియాలో ఖరీదైన ఉన్నత శ్రేణి బైక్‌ల విభాగంలో అమ్మకాలు వృద్ధి చెందగలవని ఆ జపాన్ కంపెనీ ఆశాభావంతో ఉంది. ''ప్రజల ఆదాయ స్థాయిలు కూడా పెరుగుతున్నందు వల్ల పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి ప్రభావంతో నిమిత్తం లేకుండా ఇండియాలో ప్రీమియం బైక్‌ల అమ్మకాలు వృద్ధి చెందగలవని మేం ఆశావాదంతో ఉన్నాం'' అని ఇండియా కవాసాకి మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ యుటక యమషిట ఇక్కడ మీడియా ప్రతినిధులతో అన్నారు. ప్రీమియం బైక్ మార్కెట్ ఏటా 30 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. పుణెలోని సొంత ఫ్యాక్టరీలో కంపెనీ ప్రస్తుతం 300 సిసి, 400 సిసి మధ్య శ్రేణి ఇంజన్ సామర్థ్యాలు కలిగిన బైక్‌లను అసెంబుల్ చేస్తోందని ఆయన చెప్పారు. దేశంలో కవాసాకి డెవలప్‌మెంట్ సెంటర్లు నెలకొల్పిందని ఆయన తెలిపారు. కవాసాకి 2017 ఏప్రిల్ నుంచి ఇండియాలో 1500 యూనిట్లు విక్రయించింది. కంపెనీ దేశంలో 22 పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేసింది.

మన విదేశీ పెట్టుబడులు తగ్గాయి



ముంబయి: భారతీయ కంపెనీలు విదేశాలలో పెట్టే పెట్టుబడులు ఈ ఏడాది జనవరిలో దాదాపు 70 శాతం తగ్గి 866 మిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) వెల్లడించిన డాటా సూచిస్తోంది. అంతకుముందు నెల 2017 డిసెంబరులో భారతీయ సంస్థల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 1.86 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. భారతీయ సంస్థలు 2017 జనవరిలో విదేశాలలో సంయుక్త రంగంలో ఉన్నవాటిలో, పూర్తిగా తమ యాజమాన్యం కింద ఉన్న సంస్థల్లో 2.83 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాయి. భారతీయ కంపెనీల మొత్తం 866 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులలో 385.70 మిలియన్ డాలర్లు (ఈక్విటీ), 192.38 మిలియన్ డాలర్లు (రుణం), 287.92 డాలర్లు (జారీ అయిన గ్యారంటీలో భాగం) రూపంలో ఉన్నాయి. ప్రధాన పెట్టుబడులలో రెస్టారెంట్లు, హోటల్ వ్యాపారంలో సి.జి పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్ పెట్టిన 88.74 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెద్దది. జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ 49.31 మిలియన్ డాలర్లు, సతోటి పార్ట్నర్స్ 23.42 మిలియన్ డాలర్ల పెట్టుబడులు కూడా ఉన్నాయి.



బలపడుతున్న దూధ్‌వాలా

బెంగళూరు: కంపెనీలో మైనారిటీ వాటా కోసం వెంచర్ క్యాపిటలిస్టు సంస్థ ఆమ్నివోర్ నుంచి 2.2 మిలియన్ డాలర్ల ప్రారంభిక మూలధనాన్ని అందుకున్నట్లు తాజా సరకులకు సంబంధించి మైక్రో డెలివరీ సర్వీసు సంస్థ దూధ్‌వాలా వెల్లడించింది. దూధ్‌వాలా సంస్థ తన సర్వీసులను కొత్త మార్కెట్లలోకి విస్తరింపజేయడానికి, ప్రతిభావంతులను తీసుకోవడానికి, టెక్నాలజీని ఉన్నతపరచుకునేందుకు ఈ నిధులు ఉపయోగించుకుంటుంది. ఆమ్నివోర్ ప్రిన్సిపల్ రహీమ్ రాయ్ తమ కంపెనీ బోర్డులో చేరతారని కూడా అది తెలిపింది. దూధ్‌వాలాను అత్యంత ప్రాంతీయ సమర్పణ వేదికగా చెప్పవచ్చు. చందాదారుల ఆధారంగా నడుస్తోంది. ఉదయమే కావలసిన సరకులను, కూరగాయలను, పాలను, మాంసాన్ని, పండ్లను తాజాగా వ్యవసాయ క్షేత్రాలు, పాల కేంద్రాలు, ఇతర వనరుల నుంచి ఇంటి ముంగిటకు తెచ్చిచ్చే సంస్థ. ప్రతి రోజు ఉదయం 7 గంటల లోపు వాటిని అందిస్తుంది. తెచ్చి ఇచ్చినందుకు చార్జీగా 3 రూపాయలు మాత్రమే వసూలు చేస్తున్నామని దూధ్‌వాలా సహ స్థాపకుడు ఇబ్రహీం అక్బరీ చెప్పారు. ఫలితంగా, మార్కెట్‌లో ఇతర సంస్థలకన్నా అనన్యమైన స్థితిలో ఉన్నట్లు తెలిపారు. వినియోగదార్లను నిలబెట్టుకోవడంలో 85 శాతంపైగా స్కోరు సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం బెంగళూరు, పుణెలలో దూధ్‌వాలా నెలకు నాలుగు లక్షలకు పైగా డెలివరీలను నమోదు చేస్తోంది.

అల్లాడుతున్న అల్యూమినియం

పునర్వినియోగ సంస్థలు



ముంబయి: ముడి పదార్థ దిగుమతిపై చెల్లించిన సుంకం రూ. 5,000 కోట్లకు పైగా పేరుకుపోవడంతో చిన్న, మధ్య తరహా అల్యూమినియం పునర్వినియోగ యూనిట్లు తీవ్ర నగదు కొరత సమస్యను ఎదుర్కొంటున్నాయి. సెకండరీ అల్యూమినియం ఉత్పత్తి సంస్థలు మోటారు వాహనాల విడి భాగాల తయారీకి, ఉక్కు కర్మాగారాలు, పాత్రల తయారీ విభాగాల్లో ఉపయోగించే డియాక్స్‌కి పూర్తిగా దిగుమతి చేసుకునే తుక్కుపైనే ఆధారపడుతున్నాయి. దిగుమతి చేసుకున్న తుక్కు విలువను కస్టమ్స్ శాఖ కృత్రిమంగా పెంచేస్తోందని మెటల్ రిసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యుడు కిశోర్ రాజ్‌పురోహిత్ అంటున్నారు. అది ప్రైమరీ అల్యూమినియం లోహ ధరకు లండన్ మెటల్ ఎక్స్చేంజి ధరను గీటురాయిగా తీసుకుని కన్‌సైన్‌మెంట్ విలువను పునర్మూల్యాంకనం చేస్తోందని ఆయన చెప్పారు. ''ఇరవై టన్నుల తుక్కుతో వచ్చిన కంటైనర్ దిగుమతి విలువ 1100 డాలర్లు కాగా, కస్టమ్స్ అధికారులు 2.5 శాతం దిగుమతి సుంకం విధించేందుకు దాని విలువను 1400 డాలర్లుగా లెక్కగడుతున్నారు. దిగుమతి చేసుకున్న తుక్కుపై విలువ జోడింపై 200 డాలర్లు మించి ఉండదు'' అని ఆయన అన్నారు. దిగుమతుల విలువను తిరిగి అధికంగా మదింపు చేసేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ వాల్యుయేషన్ 2016లో ప్రచురించిన 'ఎలర్ట్' ను కస్టమ్స్ అధికారులు ఉపయోగించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇక జి.ఎస్.టి నిబంధన కింద సరకును దిగుమతి చేసుకునే వ్యక్తి విలువను జోడించుకున్న ఉత్పత్తులను ఎగుమతి చేస్తే, కొన్ని ఖర్చులపై రిఫండు పొందడానికి అర్హత ఉంది. కానీ, అల్యూమినియం పునర్వినియోగ పరిశ్రమ దాని ఎగుమతులపై కడచిన ఆరు నెలల్లో ఎలాంటి రిఫండును అందుకోలేదు. ''మేం కష్టాలు విన్నవించుకునేందుకు ప్రభుత్వ అధికారులతో మాకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. మేం చిన్న యూనిట్లకు ప్రాతినిధ్యం వహిస్తూండడమే దానికి కారణం. పరిశ్రమ తీసుకున్న రుణం నిరర్థక ఆస్తిగా మారిన తర్వాత పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నించే బదులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ఆదిలోనే పరిష్కరించేందుకు శ్రద్ధ చూపాలి'' అని రాజ్‌పురోహిత్ అన్నారు.

జి.ఎస్.టి తెచ్చిన సమస్య

ముడి పదార్థ అంశంతో సంబంధం లేకుండా అల్యూమినియం తుక్కుపైన, పూర్తయిన ఉత్పత్తిపైన కూడా ఒకే విధంగా 18 శాతం పన్ను ఉంది. ముడి పదార్థంపై రేటును 12 శాతానికి తగ్గించవలసిందిగా ప్రభుత్వానికి పరిశ్రమ విజ్ఞప్తి చేసింది. దీనివల్ల ప్రభుత్వ రాబడికి వాటిల్లే లోటు ఏమీ లేదు. ఎందుకంటే, దాని ఆదాయం తుది ఉత్పత్తిపై విధించే రేటుపై ఆధారపడి ఉంటుందని రాజ్‌పురోహిత్ అన్నారు. ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని చేపట్టడంతో, గత మూడేళ్ళలో, ఆసియాన్ దేశాల నుంచి సుంకం రహిత అల్యూమినియం మిశ్రమ లోహాల దిగుమతి గణనీయంగా పెరిగింది. దేశీయ వస్తూత్పత్తి సంస్థలు మాత్రం, కీలక ముడి పదార్థమైన అల్యూమినియం తుక్కుపై 2.5 శాతం దిగుమతి సుంకం చెల్లించవలసి వస్తోందని రాజ్‌పురోహిత్ చెప్పారు.

కెనడాతో పెరగనున్న వర్తకం




న్యూఢిల్లీ: భారత్-కెనడాల మధ్య వర్తకం వచ్చే మూడేళ్ళలో రెండింతలై 10 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు పి.హెచ్.డి. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఒక ప్రకటనలో తెలిపింది. కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో భారత పర్యటన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. కెనడాతో భారతదేశ ద్వైపాక్షిక వర్తకం 2001లో ఉన్న 1.09 బిలియన్ డాలర్ల నుంచి 2016లో 5.62 బిలియన్ డాలర్లకు చేరిందని పి.హెచ్.డి. చాంబర్ అధ్యక్షుడు అనిల్ ఖైతాన్ చెప్పారు. కెనడా నుంచి భారతదేశ దిగుమతులు 2016లో 3.65 బిలియన్ డాలర్ల మేరకు ఉండగా, ఎగుమతులు 2016లో 1.97 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు, ఫర్నిచర్, ముత్యాలు, నగలకు ఉపయోగించే పాక్షిక విలువైన రాళ్ళు, ప్లాస్టిక్ వస్తువులు తదితరమైన వాటిని కూడా చేర్చుకుంటే కెనడాకు ఎగుమతులు పెంచుకోవచ్చని ఖైతాన్ చెప్పారు. ''ఈ ఉత్పత్తుల్లో దేశంలో ఉత్పత్తి అవకాశాలు వృద్ధి చెందుతున్నాయి. అంతర్జాతీయంగా వాటి వాడకం కూడా పెరుగుతోంది. కనుక కెనడాకు వచ్చే మూడేళ్ళలో అంటే 2021 నాటికి మొత్తం ఎగుమతులను ఇప్పుడున్న 1.97 బిలియన్ డాలర్ల నుంచి 4 బిలియన్ డాలర్లకు పెంచుకోగల అవకాశం ఉంది'' అని ఖైతాన్ అన్నారు. పెట్టుబడుల విషయంలో, భారతదేశంలో కెనడా 23వ పెద్ద పెట్టుబడిదారుగా ఉంది. పదిహేడేళ్ళ (2000-2017) కాలంలో దాని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దాదాపు 1.12 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయని అనిల్ ఖైతాన్ తెలిపారు. కాలుష్య రహిత ఇంధన వనరులు, వ్యవసాయ రంగ యంత్ర పరికరాలు, వాతావరణ మార్పు, అధునాతన వస్తూత్పత్తి, వ్యవసాయ ఉపకరణాలు, వ్యవసాయం-ఆహారం, కాలుష్య రహిత టెక్నాలజీ, డిజిటల్ ఇండస్ట్రీలు, ఆరోగ్యం, బయో సైన్సెస్ వంటి రంగాల్లో పెట్టుబడులు వృద్ధి చెందడానికి అవకాశం ఉందని ఆయన చెప్పారు.

స్పార్క్‌కు ఐ.టి నోటీసు

న్యూఢిల్లీ: సన్ ఫార్మా అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ కంపెనీ (స్పార్క్) 2014-15 అస్సెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించి రూ. 27.30 కోట్లు చెల్లించాలంటూ ఆదాయ పన్ను శాఖ నుంచి డిమాండ్ నోటీసు అందుకున్నట్లు తెలియజేసింది. 1961 నాటి ఆదాయ పన్ను చట్టంలోని 156వ సెక్షన్ కింద ఈ నోటీసు జారీ అయింది. తానా మొత్తాన్ని చెల్లించనవసరం లేదని కంపెనీ వాదించనుంది. ఈ నోటీసుకు వ్యతిరేకంగా, నిర్దేశిత గడువు లోపల తగిన అపీలు దాఖలు చేస్తామని కంపెనీ తెలిపింది.





పెరిగిన ప్రైవేటు ఈక్విటీలు



న్యూఢిల్లీ: ప్రైవేటు ఈక్విటీ (పి.ఇ) ఇన్వెస్టర్లు 2018 జనవరి నెలలో 983 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఒప్పందాలను ప్రకటించారు. గత ఏడాది అదే కాలంతో పోలిస్తే, పెట్టుబడుల పరిమాణం 23 శాతం పెరిగినట్లు లెక్క. కొన్ని పెద్ద లావాదేవీలు చోటుచేసుకోవడం దీనికి కారణమని గ్రాంట్ థార్నటన్ నివేదిక వెల్లడించింది. జనవరిలో 983 మిలియన్ డాలర్ల విలువైన 84 పి.ఇ లావాదేవీలు సంభవించాయని ఆ పూచీకత్తుల, పన్నుల, సలహా సంస్థ పేర్కొంది. 2017 జనవరిలో 796 మిలియన్ డాలర్ల విలువైన 81 పి.ఇ లావాదేవీలు నమోదయ్యాయి. ''ప్రైవేటు ఈక్విటీ లావాదేవీలు 2017 జనవరిలో పోలిస్తే, 2018 జనవరిలో పరిమాణం విషయంలో 4 శాతం, లావాదేవీల విలువ విషయంలో 23 శాతం పెరుగుదలను నమోదు చేశాయి'' అని గ్రాంట్ థార్నటన్ ఇండియా ఎల్ఎల్‌పి డైరెక్టర్ పంకజ్ చోప్డా చెప్పారు. జనవరిలో నెలలో స్టార్టప్‌లలోకి పెట్టుబడులు ఎక్కువ వెళ్ళాయి. మొత్తం పెట్టుబడుల పరిమాణాలలో అవి 52 శాతం మేరకు ఉన్నాయి.

మరోపక్క, ఇంధన, సహజ వనరులు, స్థిరాస్తుల రంగాలు 10 కోట్ల డాలర్లకు పైగా పి.ఇ పెట్టుబడులు చూశాయి. మొత్తం పి.ఇ లావాదేవీల విలువలో అవే 39 శాతం మేరకు ఉన్నాయి. హైదరాబాద్, పుణెలలో ఐదు రియల్టీ ప్రాజెక్టులపై ఆల్టికో క్యాపిటల్స్ సంస్థ 195 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టి జనవరిలో అగ్ర పి.ఇ. లావాదేవీగా నిలిచింది. ఇతర ప్రధాన లావాదేవీలలో, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు 144 మిలియన్ డాలర్లు పెట్టి రిన్యూ పవర్ వెంచర్స్‌లో 6 శాతం వాటా కైవసం చేసుకోవడం, రివిగో సర్వీసెస్‌లో వార్‌బర్గ్ పిన్కస్, సైఫ్ పార్ట్నర్స్ 5 కోట్ల డాలర్ల పెట్టుబడులు వంటివి ఉన్నాయి. రానున్న రోజుల్లో కూడా, స్టార్టప్ రంగంలోకి ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల జోరు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ''ఆన్‌లైన్ లావాదేవీలలో కస్టమర్లు పాలుపంచుకోవడం పెరిగింది. స్టార్టప్‌లు ఆఫరు చేసే ఆన్‌లైన్ లావాదేవీలను సులభతరం చేసే సొల్యూషన్లు పెరిగాయి. ఇవి రిటైల్, ఫిన్‌టెక్, ఫుడ్‌టెక్, ఆన్ డిమాండ్ సర్వీసెస్, ట్రావెల్ అండ్ లాజిస్టిక్స్‌లలోని స్టార్టప్‌ల పట్ల ఆసక్తి కలుగుజేస్తాయి'' అని చోప్డా చెప్పారు. ''ఆర్.ఇ.ఆర్.ఏ వంటి ప్రభుత్వ సంస్కరణలు, క్లీన్‌టెక్‌పైన, డిజిటల్ ఫైనాన్షియల్ లావాదేవీలు పెంచడంపైన దృష్టి కేంద్రీకరించడం వల్ల బ్యాంకింగ్, ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ఇంధన వనరులు, సహజన వనరులలో వేగ గతి కొనసాగుతుంది. ఇప్పటికే ఇండియాలో పెట్టుబడులు పెట్టిన, ఇండియా పట్ల నిర్దిష్ట వ్యూహాలు అనుసరిస్తున్న గ్లోబల్ పి.ఇ సంస్థలు, కొత్తవారు ఏర్పాటు చేసే ఫండ్లు పి.ఇ లావాదేవీలు మరిన్ని పెరిగేందుకు ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి'' అని చోప్డా అన్నారు.

దేశీయ అమ్మకాల్లో రికార్డు దిశగా...

ట్రాక్టర్ల పరిశ్రమ పయనం



చెన్నై: అమ్మకాల్లో కొనసాగుతున్న ప్రోత్సాహకర గతిని బట్టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరాన్ని దాదాపు 6.8 లక్షల యూనిట్ల అత్యధిక దేశీయ అమ్మకాలతో ముగించవచ్చని ట్రాక్టర్ పరిశ్రమ ఆశిస్తోంది. ట్రాక్టర్ పరిశ్రమ గతంలో 2013-14లో దేశీయంగా అత్యధికంగా 6.34 లక్షల యూనిట్లు అమ్మి రికార్డు సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17-18 శాతం వృద్ధి రేటు సాధించవచ్చని ట్రాక్టర్ కంపెనీలు, పరిశ్రమ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పరిశ్రమ గత ఆర్థిక సంవత్సరంలో 5.8 లక్షల యూనిట్ల దేశీయ అమ్మకాలను నమోదు చేసింది. పరిశ్రమ క్యూ 3 పనితీరు ఊహించిన దానికన్నా మెరుగ్గా ఉందని ట్రాక్టర్ల తయారీ సంస్థలు చెబుతున్నాయి. అమ్మకాలలో జోరు జనవరిలో కూడా కొనసాగిందని, కనుక, క్యూ 4 ఫలితాలు కూడా అంతే ప్రోత్సాహకరంగా ఉంటాయని పరిశ్రమ నమ్మకంతో ఉంది. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్కార్ట్స్, సోనాలికా ట్రాక్టర్స్ వంటి అగ్ర సంస్థలు జనవరి నెలలో దేశీయ అమ్మకాల్లో 40 శాతం పైగా వృద్ధిని నమోదు చేశాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో మొదటి 10 నెలల్లో దేశీయ ట్రాక్టర్ అమ్మకాల పరిమాణాలు సుమారు 18 శాతం వృద్ధి చెందాయి. ఈ మొదటి పది నెలల్లో, మహీంద్రా 18 శాతం వృద్ధిని, ఎస్కార్ట్స్ 17.5 శాతం వృద్ధిని కనబరచాయి. ''క్యూ 3లో ట్రాక్టర్ పరిశ్రమ మేం ఊహించినదానికన్నా మెరుగైన ఫలితాలు సాధించింది. త్రైమాసికం ఆరంభంలో అమ్మకాలు ఏమంత ఉండకపోవచ్చని, ఉన్నా బహుశా స్వల్ప మెరుగుదలతో ఉండవచ్చని భావించాం. కానీ, పరిశ్రమ 8 శాతం వృద్ధితో ముగిసింది. ఖరీఫ్ దిగుబడి చాలా చక్కగా ఉండడం, గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల సెంటిమెంట్, వ్యవసాయ, గ్రామీణ విభాగాలకు ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం దానికి ప్రధాన కారణం'' అని మహీంద్రా అండ్ మహీంద్రా మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయంకా అన్నారు. ''జనవరి (దేశీయ అమమకాలు, ఎగుమతులు కలిపి) 38 శాతం పెరుగుదల చూసింది. క్యూ 4లో పరిశ్రమ 15 నుంచి 18 శాతం మధ్య వృద్ధిని సాధించవచ్చు. పరిశ్రమ ఈ ఆర్థిక సంవత్సరానికి అత్యధిక అమ్మకాలతో ముగింపు పలుకుతుందని మేం భావిస్తున్నాం'' అని ఆయన చెప్పారు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో దేశీయ ట్రాక్టర్ అమ్మకాలు 6.80 లక్షల యూనిట్లకు చేరవచ్చని ఎస్కార్ట్స్ అంచనా వేస్తోంది. 2017 ఏప్రిల్ నుంచి 2018 జనవరి మధ్య కాలంలో దేశీయంగా ట్రాక్టర్ల అమ్మకాలు 17 శాతం వృద్ధి చెంది 6.59 లక్షల యూనిట్లుగా నిలిచాయని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్ సంస్థలో కార్పొరేట్ల విభాగ సీనియర్ విశ్లేషకుడు టి. కార్తికేయన్ చెప్పారు. వరుసగా రెండేళ్ళపాటు చక్కని వర్షపాతం నమోదవడం, పంటల దిగుబడులు మెరుగుపడడం, రైతులకు రుణ సదుపాయాలు తేలిగ్గా అందుబాటులో ఉండడం, వ్యవసాయేతర రంగాల్లో ట్రాక్టర్ల వాడకం పెరగడం వృద్ధికి కారణాలని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రాక్టర్ల పరిశ్రమ 2017-18 ఆర్థిక సంవత్సరంలో 6.5 లక్షల యూనిట్ల దేశీయ అమ్మకాలు సాధిస్తుందని రేటింగ్ ఏజన్సీ క్రిసిల్ అంచనా వేసింది. వరుసగా సాధారణ వర్షపాతానికి ఉన్న అవకాశాలు, తగ్గుతున్న వడ్డీ రేట్లు, రాష్ట్రాలు వ్యవసాయ రుణాలను మాఫీ చేయడం అమ్మకాల్లో విజృంభణకు తోడ్పడే అంశాలని అది పేర్కొంది.

చక్కెరకు ఆన్‌లైన్ స్పాట్ మార్కెట్

NeML
NCDEX Group Company



న్యూఢిల్లీ: చక్కెర, దాని అనుబంధ ఉత్పత్తులను తక్షణం విక్రయించేందుకు ఒక ఆన్‌లైన్ వేదిక ప్రారంభమైంది. ఇండియన్ షుగర్ ఎగ్జిమ్ కార్పొరేషన్ (ఐసెక్), ఎన్.సి.డి.ఇ.ఎక్స్ ఈమార్కెట్ లిమిటెడ్ (ఎన్ఈఎంఎల్) చేతులు కలిపి ఇండియన్ షుగర్ ఈమార్కెట్ (ఐసెమ్) పేరుతో ఒక ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేశాయి. ఆహార, ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి రవికాంత్ ఈ ఎలక్ట్రానిక్ మార్కెట్‌ప్లేస్ ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఐసెమ్ మొదలైన కొద్ది నిమిషాల లోపలే అపరిచిత కొనుగోలుదారు ఒకరు బులంద్‌షహర్ లోని అనామిక షుగర్ మిల్స్ నుంచి 10 టన్నుల చక్కెర కొనుగోలుకు ఆర్డరు పెట్టారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో కొచ్చిన ఈ తక్షణ విక్రయ మార్కెట్ మిల్లుల యజమానులు, కొనుగోలుదారులు ఇద్దరికీ మెరుగైన ధరలు అందించడంలో సహాయపడుతుంది. కార్యకలాపాల్లో పారదర్శకతకు చోటు ఏర్పడుతుంది. వర్తక అనంతర తంతులను పూర్తి చేయడం సులభమవుతుందని ఐసెక్ చైర్మన్ గౌరవ్ గోయల్ చెప్పారు. ''ప్రస్తుతం మిల్లుకి తుది వినియోగదారుకు మధ్య ఐదు అంచల మధ్యవర్తుల వ్యవస్థ ఉంది. మనం కనీసం రెండు అంచలను నిర్మూలించగలిగినా, వినియోగదార్లకు లబ్ధి చేకూరేది ఎంతో ఉంటుంది'' అని గోయల్ అన్నారు. గత కొద్ది నెలల్లో మిల్లు వద్ద చక్కెర ధర తగ్గింది. కానీ, దాని తాలూకు ప్రయోజనమేదీ ఢిల్లీలో చక్కెర రిటైల్ కొనుగోలుదార్లకు అందనే లేదని గోయల్ అన్నారు. ఈ-మార్కెట్ వల్ల పరిశ్రమకు, కొనుగోలుదార్లకు ఇద్దరికీ మేలు చేకూరుతుందన్నారు.

నిరంతర మార్కెట్ ప్రాతిపదికపై వర్తక అవకాశాలను ఈ-కామర్స్ ప్లాట్‌ఫాం కల్పిస్తుంది. కొనుగోలుదారు లేదా విక్రేత అవసరాల ప్రకారం లావాదేవీలను ఫార్వర్డ్ లేదా రివర్సు చేసుకునే అవకాశాలుంటాయి.

ఈసారి చక్కెర ఉత్పత్తి 2 కోట్ల 50 లక్షల టన్నుల స్థాయికి చేరుకుని, ఉత్పత్తిలో మిగులు ఏర్పడగలదని భారతీయ చక్కెర ఫ్యాక్టరీలు భావిస్తున్న సమయంలో డిజిటల్ మార్కెట్ ఆవిర్భవించింది. భారత, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలు చక్కెరకు పూర్తిగా దిగుమతులపై ఆధారపడుతున్నాయి. వాటితో ద్వైపాక్షిక వర్తక అవకాశాలను అన్వేషిస్తున్నారు. ''ఇది చక్కెర ఫ్యాక్టరీలు చక్కెర ఫ్యాక్టరీల కోసం ఏర్పాటు చేసుకున్న వేదిక. దాన్ని ఏర్పాటు చేయడంలో ఎన్ఈఎంఎల్ తోడ్పడిందంతే'' అనిఎన్ఈఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ రాజేశ్ సిన్హా చెప్పారు. ''చక్కెర పరిశ్రమ, చక్కెర ఫ్యాక్టరీలు వాటి వంతు కృషిని అవి చేస్తూండవచ్చు. కానీ, అది మాత్రమే సరిపోదు. ప్రమేయం ఉన్న వ్యక్తుల ఆవరణ వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్న ఈ-ప్లాట్‌ఫాం, ఆ లోటును భర్తీ చేయడంలో సహాయపడవచ్చు'' అని గోయల్ చెప్పారు.

చక్కెర, దాని అనుబంధ ఉత్పత్తులకు స్థిరమైన స్పాట్ మార్కెట్‌ను ఏర్పాటు చేసే దిశగా ఈ-ప్లాట్‌ఫాం అడుగు వేసింది. రానున్న రోజుల్లో, చక్కెరకు ఉజ్వలమైన ఫ్యూచర్ మార్కెట్ అభివృద్ధికి పునాదిగా ఇది ఉపయోగపడవచ్చునని ఒక ప్రకటనలో తెలిపారు. చక్కెరే కాకుండా, మొలాసిస్, ఎథనాల్, చెరకు పిప్పి వంటి ఉప ఉత్పత్తులకు కూడా ఈ ప్లాట్‌ఫాంను విస్తరించవచ్చు. చక్కెర ఫ్యాక్టరీలకు అవసరమైన వాటి కొనుగోలుకు కూడా దీన్ని ఉపయోగించుకోవచ్చు.

పిల్లలు @ ఫుడ్



మీ పిల్లల దగ్గర చెప్పకూడని విషయాలు

మీ ఇంట్లో పిల్లలు ఉన్నారా? వాళ్ల చాలా ఫాస్ట్‌గా పెరుగుతున్నారని భావిస్తున్నారా? పేరెంటింగ్ అనేది తేలికైన విషయం కాదు. వాళ్లు పెరిగి పెద్దవాళ్లు అయ్యే కొద్దీ.. వాళ్లను పెంచడం అనేది చాలెంజింగ్‌గా మారుతుంది. ఎప్పుడైతే మీ పిల్లలకు 10 ఏళ్లు దాటుతాయో.. అప్పుడు వాళ్లు మరింత సెన్సిటివ్‌గా మారతారు. వాళ్లు, వాళ్ల తల్లిదండ్రుల చుట్టూ జరు గుతున్న విషయాలను అవగాహన చేసుకుంటూ ఉంటారు. 7 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాళ్ల ఫీలింగ్స్ హర్ట్ అవకుండా జాగ్రత్త పడాలి. వాళ్ల ఫీలింగ్స్ పై ప్రభావం పడిందంటే.. నెగటివ్ ఇంపాక్ట్ పెరుగుతుంది. పేరెంటింగ్ అనేది.. చాలా పెద్ద బాధ్యత. ప్రతి చిన్న విషయంలో తప్పుని గ్రహించాలి. కానీ.. వాళ్లు ఎమోషన్ అవకుండా.. వివరించాలి. ఈ విషయంలో ఏమాత్రం ఆసహనానికి గురైనా, ఆవేశానికి గురైనా.. మానసిక సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి కొన్ని విషయాల్లో జాగ్రత్త వహించడం, కొన్ని విషయాలను పెరిగే పిల్లలకు చెప్పకపోవడం మంచిది..



చిలుకమ్మ సలహా!

ఒక ఉడుత మర్రిచెట్టు కింద ఆడుకుంటోంది. అంతలో ఆకలిగా ఉన్న తోడేలు అటుగా వచ్చింది. ఉడుత ఒక్క ఉదుటున చెట్టు పైకి గెంతి భయం భయంగా కిందకు చూసింది. అది గమనించిన తోడేలు ఎంతో అమాయకంగా పచ్చగడ్డిని ఆవురావురుమని తినసాగింది. 'అరె, అనవసరంగా భయపడ్డానే! ఈ తోడేలు మంసాహారి కాదు... శాకాహారి!' అంది ఉడుత. అదే చెట్టు పైనున్న తన నేస్తం చిలుకతో. చిలుక తోడేలును పరీక్షగా చూస్తూ 'అదో మోసకారి తోడేలు' అంది. 'కాదు! కాదు! అదెంతో మంచిది. దాంతో స్నేహం చేస్తా' అంది ఉడుత ఉత్సాహంగా.

'వద్దు! వద్దు! అపరిచితులను వెంటనే నమ్మకూడదు' అని హితవు పలికింది చిలుక. చిలుక మాటలను పెడచెవిన పెట్టి చటుక్కున కిందకు దూకేసింది ఉడుత. తోడేలు ఉడుత వంక ప్రేమగా చూస్తూ 'ఉడుతమ్మా! ఎటు పడితే అటు దూకబాకమ్మా. కాళ్లు విరుగుతాయి' అంది సౌమ్యంగా.

'నా కాళ్లకేం కాదులే, తోడేలు మామా' గర్వంగా చెప్పింది ఉడుత. 'అవునా? ఇంతకీ నీ కాళ్ల గొప్పదనం ఏమిటో?' కుతూహలంగా అడిగింది తోడేలు. ఉడుత పొంగిపోతూ 'మా ఉడుతల కాళ్లు బలంగా ఉంటాయి. మా ముందరి కాళ్లు పొట్టిగాను, వెనుక కాళ్లు పొడుగ్గాను ఉంటాయి. అందువల్ల మేము ఎటు కావాలంటే అటు చకచకా గెంతగలుగుతాము' అని చెప్పింది. 'అబ్బో! మీరు మహా గొప్పవాళ్లు! అది సరే, నువ్వా మర్రిచెట్టు చిటారుకొమ్మ పై నుంచి కిందకు దూకగలవా? నీ సాహసకృత్యం కనులారా చూసి తరిస్తా' అంది తోడేలు. ఉడుత అమితోత్సాహంతో చెట్టు పైకి ఎక్కసాగింది. చిలుక దానితో 'మిత్రమా! కిందకు దూకాక ప్రాణం పోతున్నట్టు కేకలు పెట్టు. దయచేసి నా సలహా పాటించు' అని కోరింది. కిందకు దూకిన ఉడుత 'అమ్మో... చచ్చా! బాబోయ్... చచ్చా!' అంటూ కేకలు పెట్టసాగింది. తోడేలు వికృతంగా నవ్వుతూ 'ఓ అమాయక ఉడుతా! నాకు భలే చిక్కావుగా. నిన్నిక గుటుక్కుమనిపిస్తా' అంటూ అడుగులు ముందుకేసింది. మరుక్షణం ఉడుత మెరుపు వేగంతో గెంతి, చెట్టుపైకి చేరింది.తోడేలు తెల్లబోయి చూస్తూ 'ఇదేమి విడ్డూరం! నీకేం కాలేదా?' అని అడిగింది.

'వూహూ! నాకేం కాలేదు. అంతెత్తు నుంచి కింద పడ్డా నాకేమీ కాదు. ఎందుకంటే నా కుచ్చుతోక నాకు శ్రీరామ రక్ష. కింద పడగానే అది నా శరీరాన్ని సమతూకంగా ఉంచి, దెబ్బలు తగలకుండా కాపాడుతుంది. ఓ దుష్ట తోడేలు మామా! నా నేస్తం చిలుకమ్మ సలహా పాటించి, నీ నిజస్వరూపం తెలుసుకున్నా. ఇక నీ దారిన నీవు పో' అని కసురుకుంది ఉడుతమ్మ. తోడేలు ఉసూరుమంటూ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మీరొక ఇంటరెస్టింగ్ రెసిపీ గురించి తెలుసుకున్నారు. ఆరోగ్యానికి మంచిదైన ఆ డిష్‌ను తయారుచేసేందుకు మీరు వంటింట్లో గంటల కొద్దీ సమయాన్ని గడిపారు. మీ పాపాయికి ఆ డిష్‌ని వడ్డించి పాపాయి తింటే ఆనందిద్దామని కలలుగన్నారు. అయితే, మీరు పాపాయి కోసం ఆ డిష్‌ని టేబుల్‌పై సర్ది ఉంచుతారు. మీ పాపాయి స్కూల్ నుంచి ఇంటికి వచ్చి ఆ డిష్ ని నిరాకరించడం వలన మీరు డిజప్పాయింట్ అవుతారు. కనీసం రుచి కూడా చూడకుండా ఆ వంటకాన్ని నిరాకరించడం మిమ్మల్ని బాధకి గురిచేస్తుంది. ఈ సినారియో అనేది చాలా మంది తల్లులకు అనుభవమే. తరచూ ఇటువంటి పరిస్థితినే చాలామంది తల్లులు ఎదుర్కొంటూ ఉంటారు. ఈ విషయంలో మీరు డిజప్పాయింట్ అవడం సహజం.



పిల్లలు ఆహారాన్ని నిరాకరించడానికి గల కారణాలు

ఆహారం నచ్చినట్టుగా లేకపోతే

చిన్న చిన్న విషయాలనే పిల్లలు ఎక్కువగా పట్టించుకుంటారు. ఆహారం టెక్స్చర్స్‌కి సంబంధించి పిల్లలు ఎంతో కచ్చితంగా ఉంటారు. రోజులతరబడి తిండికి దూరంగా ఉంటారు. కొంతమంది పిల్లలకు అన్నం మెత్తగా ఉంటే నచ్చుతుంది. అందువలన, వారికి నచ్చిన విధంగానే ఆహారాన్ని తయారుచేయండి. వారికి మెత్తని పలుచని చపాతీలు ఇష్టమైతే ఆ విధంగానే చపాతీలను నెయ్యి ఉపయోగించి తయారుచేయండి. వారికి నచ్చిన విధంగా ఆహారాన్ని తయారుచేయడానికి కాస్తంత శ్రమకి గురైనా పరవాలేదు. వారి ఛాయస్‌లను మీరు గౌరవిస్తే వారు మిమ్మల్నెప్పుడూ డిజప్పాయింట్ చేయరు.

ఇక్కడ మీరు గుర్తుంచుకోవలసిన వాస్తవం ఏంటంటే కొంతమంది పిల్లలు ఫస్సీ ఈటర్స్ కిందకి వస్తారు. వీరిని ప్లీజ్ చేయడం కష్టం. వీరికి ఏ వంటకమూ అంత త్వరగా రుచించదు. మనం ఎంతగా ప్రయత్నించినా వారు ఆహారాన్ని తీసుకోవడానికి ఆసక్తి చూపరు. ఈ విషయం వలన మనం కొంత ఆందోళనకు గురవుతాము. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాలు వారికి అందడంలేదని తద్వారా పోషకాహార లోపంతో వారు బాధపడతారని చింతిస్తాము. మన పిల్లలే మన ప్రపంచం. వారి ప్రతీ మాటా చేతా మనకి ఎంతో ఆశ్చర్యకరంగా అనిపిస్తాయి. వారి ఎదుగుదలను చూస్తున్నప్పుడు వారు నేర్చుకుంటున్న కొత్త విషయాలను గమనిస్తున్నప్పుడు మనకి వారిని చూస్తేనే గర్వంగా ఉంటుంది. అయితే, ఫస్సీ ఈటర్స్ క్యాటగిరీలోకి వచ్చే పిల్లలు మనల్ని నిత్యం ఆందోళనకు గురిచేస్తూ ఉంటారు.



భయపెట్టడం, తిట్టడం

పిల్లలు తినడానికి నిరాకరించినప్పుడు, తల్లులు పిల్లల్ని అనేకవిధాల సముదాయించాలని ప్రయత్నిస్తారు. భయపెట్టడం, తిట్టడం అలాగే వారిని ఆటలాడనివ్వకపోవడంతో పాటు వారికిష్టమైన వాటినుంచి దూరంగా ఉంచడం వంటివి చేస్తూ ఉంటారు. అయితే, ఇటువంటి ఫస్సీ ఈటర్స్ మొండివారు. వారిని సులభంగా సముదాయించడం కుదరదు. కోపం తెచ్చుకుని వారిపై ప్రదర్శించేకంటే వారు ఎందుకు తినటం లేదో అర్థం చేసుకోవడం ముఖ్యం.ఒకవేళ పై పాయింట్స్‌ని పరిగణలోకి తీసుకున్నా కూడా మీ పాపాయి ఆహారాన్ని నిరాకరిస్తూ ఉంటే మీ పాపాయి అలా ప్రవర్తించడం వెనుక బలమైన కారణం ఉండవచ్చు. పిల్లలు ఆహారాన్ని తీసుకోకపోవడానికి గల కారణాలని తల్లులు తెలుసుకుని వారికి బలవంతంగా ఆహారాన్ని పెట్టే బదులు వారి సమస్యకు పరిష్కారాన్ని అందిస్తే మంచిది.పిల్లలు ఆహారాన్ని నిరాకరించడానికే గల కారణాలను ఈ ఆర్టికల్‌లో పొందుబరిచాము. వీటిని పరిశీలించండి మరి.



సెన్సిటివ్ టేస్ట్ బడ్స్‌ని కలిగి ఉంటే..

కొంతమంది పిల్లలకు నాలుకపై టేస్ట్ బడ్స్ అనేవి అధికంగా కలిగి ఉంటాయి. అందువలన వారు టేస్ట్ కి సూపర్ సెన్సిటివ్‌గా రియాక్ట్ అవుతారు. వీరికి ఏ వంటమైనా ఇట్టే నచ్చదు. వారికి రుచించకపోవడం వలన వారు ఆహారాన్ని నిరాకరిస్తారు.

పాపాయి డిస్ట్రాక్ట్ అయినప్పుడు

ఇది సాధారణమైన విషయం. టీవీ చూస్తున్నప్పుడు గానీ మొబైల్‌లో వీడియోలను చూస్తున్నప్పుడు గాని వారు డిస్ట్రాక్ట్ అవడం సహజం. ఇది వారి అప్పెట్టయిట్‌ను స్పాయిల్ చేస్తుంది. అందువలన, వారికి తిండిపై ధ్యాస ఉండదు.



ఇర్రెగులర్ బౌల్ మూవ్మెంట్స్

ఒకవేళ మీ పాపాయి ఇర్రేగులర్ బౌల్ మూవ్మెంట్స్ సమస్యతో బాధ పడుతూ మోషన్‌ని పాస్ చేయడానికి ఇబ్బంది పడుతూ ఉంటే, ఆహారాన్ని తీసుకోవాలన్న ధ్యాస అనేది ఉండదు. బౌల్ మూవ్మెంట్స్ సవ్యంగా ఉంటే ఆహారాన్ని స్వీకరించాలని వారికి అనిపిస్తుంది. ఈ ముఖ్యమైన అంశాన్ని తల్లితండ్రులు విస్మరిస్తారు. వారి బౌల్ మూవ్మెంట్స్‌ని రెగ్యులర్ చేయడం వలన వారి అప్పెట్టయిట్ ని సాధారణ స్థితికి తీసుకురావచ్చు.

ఛాయిస్‌లు ఉండటం వలన

మీ పాపాయికి మీరు ఎక్కువ ఛాయిస్ లను ఇస్తే ఈ అలవాటును తక్షణమే మానుకోండి. మీరు అన్ని ఛాయిస్ లను వారి ముందుంచితే పిల్లలు కన్ఫ్యూజన్ కి గురవుతారు. కార్బ్స్‌కి సంబంధించి ఒక ఆప్షన్ ని (రైస్ లే దా రోటీ) అందివ్వండి. అలాగే వారికి నచ్చిన కూరను తయారుచేయండి.

అనారోగ్యం

ఏదైనా అనారోగ్యం నుంచి మీ పాపాయి ఇటీవలే కోలుకున్న వారికి ఆహారం రుచించదు. అటువంటి పరిస్థితులలో, వారు బాగా కోలుకునే సమయాన్ని వారికివ్వాలి. వారు సాధారణంగా ఆహారాన్ని ఇష్టపడే వరకు వేచి చూడాలి. వారిని ఫోర్స్ చేసి తినిపించడం వలన ఎటువంటి ఉపయోగం లేదు.

ఫుడ్ అలర్జీలు

కొన్ని ఫుడ్ అలర్జీల వలన పిల్లలు కొన్ని ఆహారాలకి దూరంగా ఉంటారు. మీరు గుర్తించని ఫుడ్ అలర్జీలతో వారు బాధపడుతూ ఉండవచ్చు. ఒక ప్రత్యేకమైన ఫుడ్ ను మీ చైల్డ్ ప్రతీసారి నిరాకరిస్తున్నట్టయితే ఆ ఫుడ్ వలన వారిలో సమస్యలు తలెత్తుతున్నాయని మీరు గుర్తించాలి. వారితో మాట్లాడి వారి అసౌకర్యానికి గల కారణాన్ని తెలుసుకోవాలి.



ఇంట్లోని వాతావరణం

మీ పాపాయికి మీరు వేరే ఆహారం పెడతారా? కుటుంబసభ్యులందరూ తినే ఆహారాన్ని పాపాయికి అందించరా? అలా అయితే, ''బేబీ ఫుడ్'' అనే ట్యాగ్‌తో విసిగిపోయిన మీ పాపాయి ఆహారాన్ని నిరాకరిస్తూ రావచ్చు. మీ డిన్నర్ లో బేబీని కూడా భాగం కానివ్వండి. కుటుంబమంతా ఏ ఆహారం తీసుకుంటారో పాపాయికి కూడా అదే ఆహారాన్ని అందివ్వండి. ఒకవేళ మీ ఫామిలీ మెంబర్స్ కోసం ఫుడ్‌ని స్పైసీగా చేస్తే మీ పాపాయి కోసం అదే ఫుడ్‌ని కారాన్ని తగ్గించి చేయండి. ఇలా చేస్తే మీ పాపాయి ఫుడ్‌ని హ్యాపీగా ఆస్వాదిస్తుంది.

పిల్లలు తినకపోవడానికి ఎన్నో కారణాలున్నాయి. ఆ కారణాలని తెలుసుకుని మనం అందుకు తగినట్లుగా చర్యలు తీసుకోవాలి.

- పిల్లల మీల్ టైమ్స్ మధ్య తగినంత గ్యాప్ లభించిందా?
- పిల్లలకి నచ్చే విధంగా ఫుడ్‌ని ప్రిపేర్ చేశారా?
- మీ పిల్లలకు మీల్స్‌కి ముందు స్నాక్స్ తినే అలవాటుందా?
- మీ చైల్డ్‌కి తగినంత ఫిజికల్ ఎక్సర్సైజ్ లభిస్తోందా? మీ చైల్డ్ యాక్టివ్‌గా ఎనర్జిటిక్‌గా ఉంటోందా?
- ఒకవేళ ఈ ప్రశ్నలన్నిటికీ మీ సమాధానం కాదు అని వస్తే మీరు సరైన పరిష్కారాన్ని తక్షణమే ఎంచుకోవాలి.
- మీ పిల్లల మీల్ టైం అనేది ప్రోపర్‌గా షెడ్యూల్ అయ్యే విధంగా ప్లాన్ చేసుకోండి. ప్రతి మీల్‌కి మధ్యలో కనీసం మూడు నుంచి నాలుగు గంటల గ్యాప్ ఉండేలా చూసుకోండి.
- అలాగే, మీ పిల్లలకు నచ్చే విధంగా ఆహారాన్ని తయారుచేయండి.
- మీల్స్ కి ముందు కనీసం అరగంటపాటు పిల్లలకు స్నాక్స్ ని అందుబాటులో ఉంచకండి. స్నాక్స్ ఇస్తే వారికి ఆకలి వేయదు.
- మీ చైల్డ్ ఎనర్జటిక్‌గా లేదా యాక్టివ్‌గా లేకపోయినా మీల్స్ టైం లో వారికి ఆకలి వేయకపోవచ్చు.








పిల్లలు వెయిట్‌కు తగ్గ హైట్



పిల్లలు పుట్టిన తర్వాత తల్లిదండ్రులందరూ వారి పిల్లలు అన్నింటిలో బెస్ట్‌గా ఉండాలని కోరుకుంటారు. వారి ఆరోగ్యం మరియు శారీరకంగా స్ట్రాంగ్ గా మరియు మంచి బాడీ షేప్ కలిగి ఉండాలని కోరుకుంటారు! ప్రతి ఒక్క తల్లిదండ్రి వారి పిల్లలు ఫిజికల్‌గా హెల్తీగా, స్ట్రాంగ్‌గా పెరగాలని కోరుకుంటారు., అలాగే మంచి హైట్ ఉండాలని కోరుకుంటారు! పిల్లలకు పెరిగే కొద్ది వారి బరువుకు తగ్గ హైట్ ఉండాలని కోరుకుంటారు. ఇలా ఉండటం వల్ల వివిధ రకాలుగా వారికి ఉపయోగపడుతుందని, ఇంకా పిల్లులు చూడటానికి అందంగా కనబడుతారని ఆశిస్తారు! పెరిగే పిల్లలు ఆవరేజ్ కంటే ఎత్తుగా ఉన్నప్పుడు, వారు వివిధ రకాల స్పోర్ట్స్‌లో పాల్గొనడానికి సులభం అవుతుంది. మంచి మంచి ప్లేయర్స్ వారి హైట్ వల్లే ఇలా స్పోర్ట్స్‌లో బాగా పాపుర్ అయ్యారు! పిల్లలు బరువుకు తగ్గ హైట్ ఉండాలంటే అందుకు జనటిక్ సమస్య మరియు హెరిడిటి, కుంటుంబంలో తల్లిదండ్రులు పొడవుగా ఉంటే, వారికి పుట్టే పిల్లలకు కూడా పొడవుగా పెరుగుతారు. అయితే, కొంత మంది విషయంలో తల్లిదండ్రులు పొట్టిగా ఉన్నా పిల్లలు పొడవు పెరుగుతారు, ఇది సాద్యం కాదని చెప్పలేము. ఒక వేళ కుంటుంబంలోని వారు పొడవుగా ఉన్నా పిల్లలు పొట్టిగా ఉంటే, పొడవు పెంచుకొనే అవకాశం ఉంటుంది.



మనం స్పోర్ట్స్

ఆదివారం 25 ఫిబ్రవరి 2018

www.manamnews.com

సెమీఫైనల్లో సమీర్ వర్మ

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్

బాసెల్: భారత షట్లర్ సమీర్ వర్మ స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. శనివారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సయ్యద్ మోడీ గ్రాండ్ ప్రీ గోల్డ్ చాంపియన్ సమీర్ 21-17, 21-16తో జపాన్‌కు చెందిన మాజీ ప్రపంచ 2వ ర్యాంక్ షట్లర్ కెంటొ మొమొటను వరుస సెట్లలో ఓడించాడు. కాసినోకు వెళ్లినందుకు 23 ఏళ్ల కెంటోపై 2016లో నిప్పో బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిషేధం విధించింది. 2016 హాంకాంగ్ సూపర్ సిరీస్‌లో ఫైనల్‌కు చేరిన సమీర్ వర్మ తదుపరి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన కాంటఫోన్ వాంగ్‌చరోన్‌తో ఆడనున్నాడు.

జోర్డాన్ చేతిలో భారత్ ఓటమి

ఫిబా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్

బెంగళూరు: భారత బాస్కెట్‌బాల్ జట్టు స్ఫూర్తిదాయక ఆటను ప్రదర్శించింది. అయినప్పటికీ శనివారమిక్కడి శ్రీ కంఠీరవ స్టేడియంలో జరిగిన ఫిబా వరల్డ్ కప్ ఆసియా క్వాలియింగ్ మ్యాచ్‌లో భారత్ 88-102తో తన కంటే అధిక ర్యాంక్ ఉన్న జోర్డాన్ చేతిలో ఓటమిపాలైంది. గ్రూప్-సిలో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో సత్నమ్ సింగ్ సేన పరాజయాన్ని చవిచూసింది. అరవింద్ అన్నాదురై తన అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ 11 బాస్కెట్స్ వేసి 28 పాయింట్లు సాధించాడు. సత్నమ్ సింగ్ 20 డ్రాపింగ్ పాయింట్లు, 8 అసిస్ట్స్, 4 పవర్‌ఫుల్ డ్రంక్స్ సాధించాడు. అరంగేట్ర ఆటగాడు జస్టిన్ జోసెఫ్ కూడా స్ఫూర్తిదాయక ఆటను కనబరిచి తొలి అంతర్జాతీయ గేమ్‌లో 16 డ్రాపింగ్ పాయింట్స్ సాధించాడు. అయినప్పటికీ భారత జట్టు గెలుపు తీరానికి చేరుకోలేకపోయింది. ఇక తర్వాతి మ్యాచ్‌లో 26న లెబనాన్‌తో ఇండియా తలపడుతుంది.



స్టన్నింగ్ క్యాచ్

దుబాయ్‌లో జరుగుతున్న పాకిస్తాన్ సూపర్ లీగ్ క్రికెట్ టోర్నీలో మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది మ్యాజిక్ చేశాడు. కరాచీ కింగ్స్ తరపున ఆడుతున్న ఆఫ్రిది ఒంటిచేత్తో ఓ స్టన్నింగ్ క్యాచ్ పట్టాడు. క్వెట్టా గ్లాడియేటర్స్ ఆటగాడు ఒమర్ కొట్టిన ఓ బంతిని బౌండరీ లైన్ దగ్గర ఒంటిచేత్తో పట్టుకున్న ఆఫ్రిది బ్యాలెన్స్ తప్పి బౌండరీలైన్ దాటాడు. అయితే వెంటనే బంతిని గాల్లో విసిరేసి బౌండరీలైన్ లోపలకొచ్చి పట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కరాచీ కింగ్స్ 19 రన్స్ తేడాతో గెలిచింది.





మెల్‌బోర్న్: హైదరాబాద్ జిమ్నాస్ట్ అరుణ బుద్ధ ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో సంచలనం సృష్టించింది. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ప్రపంచ కప్ పోటీల్లో కాంస్య పతకం గెలిచింది. దీంతో జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్‌లో పతకం గెలిచిన భారత తొలి మహిళా అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన పోల్ట్ విభాగం ఫైనల్లో అరుణ 13.469 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఫ్లోర్, వాల్ట్ ఈవెంట్స్‌లో 11.466 పాయింట్లు సాధించి ఫైనల్‌కు చేరిన అరుణ టైటిల్ పోరులో అద్భుతంగా రాణించింది. 16 దేశాల అథ్లెట్లు పాల్గొంటున్న ఈ ప్రపంచ కప్‌లో అరుణ ఫైనల్లో అద్భుతంగా రాణించి పతకం సొంతం చేసుకుంది. మొత్తం 13.666 పాయింట్లను తొలి రౌండ్‌లో సాధించిన అరుణ, రెండో రౌండ్‌లో 13.636 పాయింట్లను సాధించింది. మొత్తంగా 13.649 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో స్లొవేనియాకు చెందిన క్రైస్లెఫ్, ఆస్ట్రేలియాకు చెందిన ఎమిలీ తొలి రెండు స్థానాల్లో నిలిచి స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు.

ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో... అరుణోదయం

కాంస్యం గెలిచి చరిత్ర సృష్టించిన తెలుగమ్మాయి

భారత తొలి మహిళా అథ్లెట్‌గా రికార్డు

బ్లాక్ బెల్ట్ చాంపియన్



కరాటే బ్లాక్ బెల్ట్ చాంపియన్ అరుణ 2005లో జాతీయ చాంపియన్‌షిప్‌లో తొలిసారి పతకం సాధించింది. 2014లో కామన్‌వెల్త్ క్రీడల పోల్‌వాల్ట్ విభాగంలో 14వ స్థానంలో నిలిచిన అరుణ ఆసియా క్రీడల్లో 9వ స్థానంతో సంతృప్తి చెందింది. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో నిలిచింది. 2010 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత ఆటగాడు ఆశిష్‌కుమార్ తొలిసారి పతకం సాధించి అంతర్జాతీయ స్థాయిలో జిమ్నాస్టిక్స్ ఈవెంట్‌లో చరిత్ర సృష్టించాడు. జిమ్నాస్టిక్స్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు గుర్తింపు తెచ్చాడు. ఆ తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌కు భారత స్టార్ దీపా కర్మాకర్ అర్హత సాధించి చరిత్ర సృష్టించింది. ఆ ఒలింపిక్స్‌లో కర్మాకర్ తృటిలో కాంస్య పతకం చేజార్చుకుని నాలుగో స్థానంలో నిలిచింది. అయితే ఆ తర్వాత ఇప్పుడు హైదరాబాద్ అమ్మాయి అరుణా రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి చరిత్ర సృష్టించింది. జిమ్నాస్టిక్స్ విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఇది మూడో పతకం.

తండ్రే ఆదర్శం...

హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన అరుణా రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ స్టూడెంట్. చదువుతో పాటు ఆటల్లోనూ ఆమె ఎప్పుడూ టాప్ పొజిషన్‌లోనే ఉండేది. కోచ్ బ్రిజ్ కిషోర్ శిష్యరికంలో రాటుదేలి హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది. ఐదేళ్ల వయసు నుంచే కరాటే ప్రాక్టీస్ మొదలుపెట్టిన అరుణ శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండండంతో కోచ్ సలహా మేరకు జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ ప్రారంభించింది . అంచెలంచెలుగా ఎదుగుతూ..ఈ ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే కామన్ వెల్త్ క్రీడల్లో, 2020 ఒలింపిక్స్‌లో మెడల్ సాధించటమే అరుణ లక్ష్యంగా పెట్టుకుంది. తాజాగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో గెలుచుకున్న పతకంతో తన లక్ష్యానికి మరింత చేరువైంది.



నాన్నకు స్వర్ణాన్ని కానుకగా ఇస్తా...

అరుణను జిమ్నాస్ట్ చేసేందుకు ఆమె తండ్రి నారాయణ రెడ్డి ఇల్లు అమ్మేశాడు. 2012లో ఉదయ్‌పూర్‌లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో అరుణ వాల్ట్, బీమ్‌లలో స్వర్ణం గెలిచింది. కొన్ని నెలల తర్వాత ఆమె తండ్రి మరణించారు. తండ్రే తనకు ఎంతో ఆదర్శమని.. ఆయన ప్రోత్సాహం వల్లే తాను రాణించగలుగుతున్నానని అరుణ తెలిపింది. తండ్రి పడ్డ కష్టాన్ని మరచిపోలేనని స్వర్ణ పతకం గెలుచుకుని అరుదైన బహుమతిని ఆయనకు కానుక ఇస్తానని ఆమె తెలిపింది. 'ఎన్నో త్యాగాలు చేసిన తండ్రికి స్వర్ణ పతకాన్ని కానుకగా ఇస్తానని నేను ఆయనతో చెప్పాను. కానీ తండ్రి మరణం తర్వాత వారం రోజుల పాటు అథ్లెటిక్స్‌పై దృష్టి పెట్టలేకపోయాను. ఏం చేయాలో తెలియలేదు. ఒకానొక సమయంలో అథ్లెటిక్స్‌ను వదిలేద్దామనుకున్నా. కానీ మా అక్క, బావ నా గురించి శ్రద్ధ తీసుకుని నాకు అండగా నిలిచారు' అని అరుణ వివరించింది.



కొత్త చరిత్ర

ఒకే టూర్‌లో రెండు సిరీస్‌లు కైవసం చేసుకున్న భారత మహిళలు

సౌతాఫ్రికాపై ఐదో టి20లో హర్మన్‌ప్రీత్ సేన విజయం

కేప్‌టౌన్: సౌతాఫ్రికా పర్యటనలో టీమిండియా మహిళల జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. కేప్‌టౌన్‌లో జరిగిన ఆఖరి, ఐదో టీ20లో భారత జట్టు 54 పరుగులతో గెలిచి ఈ పర్యటనను గ్రాండ్‌గా ముగించింది. ఈ గెలుపుతో టీ20 సిరీస్‌ను 3-1తేడాతో హర్మన్‌ప్రీత్ సేన సొంతం చేసుకుంది. దీంతో ఒకే టూర్‌లో రెండు సిరీస్‌లను గెలిచిన ఘనతను సాధించింది. సఫారీ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ గెలుచుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌నూ గెలిచి కొత్త చరిత్ర సృష్టించింది. నాలుగో టీ ట్వంటీ రద్దవగా.. ఈ సిరీస్‌కు ముందు జరిగిన వన్డే మ్యాచ్‌ల్లో భారత్2-1 తేడాతో గెలిచింది.



మెరిసిన మిథాలీ

టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా భారత్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఓపెనర్ మిథాలీ రాజ్ సూపర్ ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. మిథాలీ రాజ్ 50 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్స్‌లతో 62 పరుగులు చేసింది. మిథాలీకి తోడుగా జెమీమా రోడ్రిగ్వెస్ 34 బాల్స్‌లో 3 ఫోర్లు, రెండు సిక్స్‌లతో రాణించింది. వీరిద్దరితో పాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ దూకుడుగా ఆడి 17 బంతుల్లో రెండు సిక్స్‌లు ఒక ఫోర్‌తో అజేయ 27 పరుగులు చేసింది. దీంతో 20 ఓవర్లుముగిసే సరికి భారత్ 4 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది.

స్కోరుబోర్డు

ఇండియా ఇన్నింగ్స్: మిథాలీ రాజ్ (సి) లీ (బి) ఇస్మాయిల్ 62, మంధన (సి) క్లాస్ (బి) కాప్ 13, రోడ్రిగ్వెస్ (సి) అండ్ (బి) ఖాకా 44, హర్మన్‌ప్రీత్ కౌర్ నాటౌట్ 27, కృష్ణమూర్తి రనౌట్ 8; ఎక్స్‌ట్రాలు: 12, **మొత్తం 20 ఓవర్లలో 166/4;** వికెట్ల పతనం : 1-32, 2-130, 3-134, 4-166; బౌలింగ్: కాప్: 4-1-22-1, ఖాకా: 4-0-41-1, ఇస్మాయిల్: 4-0-35-1, క్లాస్: 2-0-21-0, వాన్ నెక్రిక్: 4-0-22-0.

సౌతాఫ్రికా: లీ (సి) పూనమ్ యాదవ్ (బి) ధార్ 3, నెక్రిక్ (సి) పాండే (బి) ధార్ 10, లూస్ (బి) పాండే 5, ప్రైజ్ (సి) రాజ్ (బి) పాండే 17, ట్రేయాన్ (సి) కైర్ (బి) గైక్వాడ్ 25, డిక్లర్క్ (బి) పాండే 4, ఖాప్ (సి) రోడ్రిగ్వెస్ (బి) ధార్ 27, ఇస్మాయిల్ (స్టంప్) భాటియా (బి) గైక్వాడ్ 8, క్లాస్ (స్టంప్) భాటియా (బి) గైక్వాడ్ 9, ఖాకా (సి) మంధన (బి) గైక్వాడ్ 1, నోట్జాకే నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు: ః3; **మొత్తం 18 ఓవర్లలో 112 ఆలౌట్;** వికెట్ల పతనం: 1-22, 2-18, 3-20, 4-40, 5-44, 6-71, 7-100, 8-108, 9-112, 10-112; బౌలింగ్: వస్త్రాకర్ 3-1-14-0, పాండే 3-0-16-3, ధార్ 4-0-26-3, పూనం యాదవ్ 4-0-25 -1, గైక్వాడ్ 3-0-26-3, కౌర్ 1-05-0.

బౌలర్ల దెబ్బకు విలవిల

167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా ఏ మాత్రం ధీటుగా ఆడలేకపోయింది. 18 ఓవర్లలోనే 112 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లు పాండే (3/16), ధార్ (3/26), గైక్వాడ్ (3/26)లు మూడేసి వికెట్లు పడగొట్టి సౌతాఫ్రికా వెన్ను విరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ సొంతం చేసుకుంది.

ఆల్ ఇంగ్లండ్‌కు యాక్సెల్‌సెన్ దూరం



న్యూఢిల్లీ: డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ నంబర్ వన్ షట్లర్ విక్టర్ యాక్సెల్‌సెన్ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌కు దూరమయ్యాడు. కాలి మడమ గాయం నుంచి కోలుకుంటున్న యాక్సెల్‌సెన్ పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఆల్ ఇంగ్లండ్ టోర్నీ వచ్చే నెల 14 నుంచి 18వ తేదీ వరకు బర్మింగ్‌హామ్‌లో జరగనుంది. 'ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ఆడటం నాకు పెద్ద సాహసమే అవుతుంది. టోర్నీ సమయానికి నేను కోలుకోలేను.. పూర్తి ఫిట్‌నెస్ సాధించలేను. జాగ్రత్తగా ఉండమని శస్త్ర చికిత్స అనంతరం డాక్టర్లు చెప్పారు. బ్యాడ్మింటన్ ఆడటమంటే నాకు చాలా ఇష్టం. అటువంటిది బర్మింగ్‌హామ్‌కు దూరం కావడం చాలా బాధగా ఉంది. కానీ తప్పదు' అని యాక్సెల్‌సెన్ అన్నాడు. డెన్మార్క్‌కు చెందిన 24 ఏళ్ల ఈ యువ సంచలనం గత సీజన్‌లో అసాధారణ ఫామ్‌ను కనబరిచాడు. జపాన్, ఇండియా ఓపెన్ టైటిళ్లతో పాటు వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. అంతేకాదు దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్ టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌ను కూడా అతను దూకుడుగా ఆరంభించాడు. మలేసియా మాస్టర్స్ టైటిల్‌ను గెలిచిన యాక్సెల్‌సెన్ ఇండోనేషియా మాస్టర్స్‌లో గాయానికి గురై రెండో రౌండ్‌లో రిటైర్మెంట్ తీసుకున్నాడు. దీంతో ఈ ఏడాది ఇండియా ఓపెన్, యురోపియన్ టీమ్ చాంపియన్‌షిప్‌కు దూరమైన యాక్సెల్‌సెన్‌కు కొద్ది రోజుల క్రితమే శస్త్ర చికిత్స జరిగింది.



ఐస్ హాకీ ఆడిన కెనడా ప్రధాని

న్యూఢిల్లీ: భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధాని ట్రూ డూ ఐస్ హాకీ స్టిక్‌తో సందడి చేశారు. భారత్‌లోని కెనడా రాయబార కార్యాలయంలో జరిగిన ఓ సరదా హాకీ మ్యాచ్‌లో ఆయన, ఒలింపియన్లు, యంగ్ ప్లేయర్లతో కలసి హాకీ ఆడారు. కెనడాలో నంబర్ వన్ గేమ్ అయిన ఐస్ హాకీ జెర్సీలను యువ క్రీడాకారిణిలకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కెనడా ఐస్ హాకీ ఒలింపియన్ విక్నెషర్, భారత వింటర్ ఒలింపియన్ శివకేశవన్ పాల్గొన్నారు. భారత్- కెనడా మధ్య క్రీడా సంబంధాలు మరింత మెరుగుపరచేందుకు రెండు దేశాలు ఇటీవల ఓ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఐస్ హాకీని భారత్‌లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని విక్నెషర్ తెలిపింది.

2022 కామన్‌వెల్త్ గేమ్స్‌లో నో షూటింగ్!



న్యూఢిల్లీ : భారత్‌కు నిరాశ కలిగించే, పతకాల మోత మోగించే షూటర్లకు నిరాశ కలిగించే వార్త ఇది. బర్మింగ్‌హామ్‌లో 2022లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో షూటింగ్ క్రీడ నిర్వహణపై సందేహాలు మొదలయ్యాయి. ఈ క్రీడల్లో షూటింగ్ ఐచ్ఛికం మాత్రమేనని 2015లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల ఫెడరేషన్ సమావేశంలో నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని కామన్‌వెల్త్ క్రీడల రాజ్యాంగం కూడా ఆమోదించింది. అయితే కామన్‌వెల్త్ క్రీడల్లో షూటింగ్ రద్దు చేయలేదని ఆ క్రీడల్లో పాల్గొనే దేశాల అభిప్రాయంపై తుది నిర్ణయం ఆధారపడి ఉంటుందని గేమ్స్ ఫెడరేషన్ అప్పట్లో తెలిపింది. అయితే తాజాగా షూటింగ్‌ను రద్దు చేస్తున్నట్టు గేమ్స్ ఫెడరేషన్ ప్రకటించింది. షూటింగ్ క్రీడను రద్దు చేస్తున్న నిర్ణయం ఫెడరేషన్‌ది మాత్రమే కాదని, అన్ని దేశాలూ కలిసి తీసుకున్న నిర్ణయమని ఫెడరేషన్ సీఈఓ గ్రేవింబర్గ్ తెలిపారు. షూటింగ్ స్థానంలో మరికొన్ని క్రీడలను చేర్చారని గేమ్స్ ఫెడరేషన్ ప్రకటించింది. అయితే కామన్ వెల్త్ క్రీడల్లో అత్యధికంగా గెలుపొందే ఓ దేశం ఈ నిర్ణయంపై నిరాశను ప్రకటించిందని భారత్ పేరును ప్రస్తావించకుండా గ్రేవింబర్గ్ ఓ లేఖలో తెలిపారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.